PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 55 | విజయవాడ, గురువారం 25 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 25 September 2025 | Rs

దుర్గమ్మ సేవలో ఉపరాష్ట్రపతి దంపతులు

3

ఫైనల్‌కు టీమిండియా

- అభిషేక్ అర్ధసెంచరీ
- బంగ్లాపై 41పరుగుల తేడాతో గెలుపు
- నేడు పాక్-బంగ్లా మధ్య కీలక పోరు
- గెలిచిన జట్టుకు ఫైనల్ బెర్త్

8

'ప్రైవేట్'కు 6022 ఎకరాలు ఇచ్చినా..

వచ్చిన ఉద్యోగాలు సున్నా

- మండలిలో పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన 2024 జూన్ నుండి ఇప్పటి వరకు 1,555 ప్రైవేటు కంపెనీలకు 602.20 ఎకరాల భూములు ఎపిఐఐసి ద్వారా కేటాయించాం. వాటిద్వారా ఇప్పటివరకు ఎటువంటి ఉపాధి లభించలేదు.' ఇది సాక్షాత్తు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి టిజి భరత్ శాసనమండలిలో ఇచ్చిన సమాధానం! వైసిపి సభ్యులు అడిగిన ఒక ప్రశ్నకు మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ మేరకు జవాబు ఇచ్చారు. వైసిపి సభ్యులు టి మాధవరావు, వంకా రవీంద్రనాథ్, పండుల రవీంద్రబాబు రాష్ట్రంలో ప్రైవేటు సంస్థలకు చేసిన భూముల కేటాయింపు, కల్పించిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై వివరాలు చెప్పాలని కోరారు. దీనికి జవాబిచ్చిన మంత్రి భరత్ తొలుత రాష్ట్రంలో ఇప్పటి వరకు 3,48,891 మంది ఉపాధి కల్పించామని, ఇందులో మెగా డిఎస్సి ద్వారా 15,941 ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. దీనిని వైసిపి సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము ప్రైవేట్ సంస్థలకు భూములు కేటాయింపులు ద్వారా కల్పించిన ఉద్యోగాలు గురించి అడిగామని, మంత్రి ఇచ్చిన సమాధానానికి ఆ ప్రశ్నకు పొంతన లేదని వారు అన్నారు. దీనికి జవాబుకు ఇచ్చిన అనుబంధం -2లో 1,46, 890 ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందని పొందుపరిచామని మంత్రి భరత్ చెప్పారు. ఆ సమాధానం కూడా తమకు అందలేదని, తాము ఎన్ని ఉద్యోగాలు ఇప్పటిదాకా వచ్చాయో చెప్పాలని అడిగామంటూ వైసిపి సభ్యులు ఆందోళనకు దిగారు. ఆ సమయంలో కొంత గందరగోళం నెలకొంది. అంతకుముందు వైసిపి సభ్యులు మాధవరావు మాట్లాడుతూ ఇండోసోల్ కంపెనీకి రూ.42వేల కోట్లు, బిపిఎల్ అనే కంపెనీకి రూ.72వేల కోట్లు ప్రోత్సాహకాల రూపంలో ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. కంపెనీలకు కల్పించే ఈ సబ్సిడీని ప్రభుత్వం ఎక్కడి నుంచి తెస్తోందో చెప్పాలన్నారు. లులూ అనేది షాపింగ్ మాల్ అని, ఆ కంపెనీ మలేషియాలో ఇప్పటికే దివాళా తీసిందన్నారు. అలాంటి కంపెనీకి విశాఖ పట్నం, విజయవాడల్లో అత్యంత ఖరీదైన స్థలాలను ఎలా అప్పగిస్తారని నిలదీశారు. ప్రైవేట్ సంస్థలకు భూములు కేటాయించే సమయంలో స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో 2524 అనధికారిక విగ్రహాలు

రాష్ట్రంలోని రోడ్లు, భవనాల శాఖ అధీనంలోని వివిధ ప్రభుత్వ స్థలాల్లో మొత్తం 2,524 అనధికారిక విగ్రహాలు ఏర్పాటు చేశారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు టిడిపి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, బిటి నాయుడు, ఆలపాటి రాజేంద్రప్రసాద్ అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిస్తూ కడపలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం అనధికారికంగా ఏర్పాటు చేసి సుందరీకరణ పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేశారని తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు ఎత్తి అవమానించే విధంగా అధికార పార్టీ సభ్యులు ప్రవర్తిస్తున్నారని నిరసిస్తూ వైసిపి సభ్యులు వాకౌట్ చేశారు.

నిరుద్యోగ భృతిపై వైసిపి వాయిదా తీర్మానం

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పించే అంశంపై చర్చించాలని వైసిపి వాయిదా తీర్మానాన్ని మండలిలో ప్రతిపాదించింది. సభ ప్రారంభం కాగానే వైసిసి సభ్యులు రమేష్ యాదవ్, కె శ్రీనివాస్, బొమ్మి ఇజ్రాయిల్ ఈ తీర్మానం అందించారు. దీనిని ఛైర్మన్ తిరస్కరించారు.

'పిపిపి' ఉపసంహరించాల్సిందే

- మెడికల్ కళాశాలలపై మండలిలో వైసిపి డిమాండ్
- సభ నుండి వాకౌట్
- మరో 33 ఏళ్లు పొడిగిస్తాం : మంత్రి

2లో

లేహ్‌లో జనాగ్రహం

- బిజెపి ప్రధాన కార్యాలయానికి నిప్పు
- కాల్పుల్లో నలుగురు మృతి, 30 మందికి గాయాలు
- రాష్ట్ర హోదా జారీలో కేంద్రం జాప్యాన్ని నిరసిస్తూ భగ్గుమన్న లడఖ్ రాజధాని

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను రద్దు చేసి, రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడంపై గత కొన్నేళ్లుగా బిజెపిపై నెలకొన్న ఆగ్రహం బుధవారం లేహ్ వీధుల్లో తీవ్రంగా వ్యక్తమైంది. లడఖ్‌కు తక్షణమే రాష్ట్ర హోదాను కల్పించాలని, రాజ్యాంగపరమైన రక్షణలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకారులు పెద్దఎత్తున నిరసనలకు దిగారు. పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు పోలీసులు కాల్పులకు దిగడంతో ఒక్కసారిగా ఈ నిరసనలు, ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. లేహ్‌లోని బిజెపి ప్రధాన కార్యాలయాన్ని ఆందోళనకారులు దగ్ధం చేశారు. దీంతో భద్రతా సిబ్బంది లాఠీఛార్జి, కాల్పులకు దిగారు. ఈ ఘటనలో నలుగురు మరణించగా, 30 మందికిపైగా గాయపడ్డారు. లడఖ్‌కు రాష్ట్ర హోదా, ఆరవ షెడ్యూల్ హోదా ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న విపరీతమైన జాప్యానికి నిరసనగా లేహ్‌లోని ఎన్‌డిఎస్ గ్రౌండ్‌లో ఈ నెల 10 నుంచి వాతావరణ కార్యకర్త, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆయనతోపాటు దీక్ష చేస్తున్న ఇద్దరు కార్యకర్తలు మంగళవారం ఆసుపత్రి పాలయ్యారు. కేంద్రం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఎబి) బుధవారం బంద్‌కు పిలుపునిచ్చింది. ఇప్పటికే బిజెపిపై ప్రజలు ఆగ్రహంగా వుండడంతో ఈ బంద్ ఉద్రిక్తంగా మారింది. రాష్ట్ర హోదా తదితర డిమాండ్లపై లడఖ్ ప్రతినిధులతో కేంద్రం చర్చలు జరపకపోవడాన్ని ఖండిస్తూ లేహ్‌లోని బిజెపి ప్రధాన కార్యాలయాన్ని తొలుత ముట్టడించిన ఆందోళకారులు, ఆ తరువాత దీన్ని దగ్ధం చేశారు. బుధవారం ముందుగా లేహ్‌లోని లడఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎల్ఎహెచ్‌డిసి) కార్యాలయం ముందు ఆందోళనలు ప్రారంభమయ్యాయి, ఆ వెంటనే ఇవి లేహ్ పట్టణమంతా విస్తరించాయని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. నిరసనకారులను అడ్డుకోవడానికి ఎక్కడికక్కడ పోలీసులు ప్రయత్నించారు. బల ప్రయోగానికి దిగడంతో ఆందోళనకారులు వాగ్వివాదానికి దిగారు. దీంతో భద్రతా దళాలు బాష్పవాయుగోళాలను ప్రయోగించాయి. లేహ్‌లోని ఒక ప్రాంతంలో ఒక పోలీసు వ్యాన్‌ను కూడా దగ్ధం చేశారు. లడఖ్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌లో 2020 నుంచి బిజెపి అధికారంలో ఉంది. 2020లో జరిగిన ఎన్నికల్లో 26 కౌన్సిల్ సీట్లకు గాను బిజెపి 15 సీట్లను గెలుచుకుంది. వచ్చే నెలలో మళ్లీ ఎన్నికలు జరగడానికి ముందుగా ఈ నిరసనలు చోటు చేసుకున్నాయి. ఎల్ఎహెచ్‌డిసిలో, కేంద్రంలోనూ అధికారంలో ఉన్న బిజెపిపై ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. పైగా బిజెపినే 2019 ఆగస్టులో జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను రద్దు చేసి లడఖ్, జమ్మూ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. అప్పట్నుంచి రాష్ట్రహోదాను పునరుద్ధరించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ డిమాండ్లను పరిశీలించడానికి కేంద్రం ఒక ఉన్నతస్థాయి కమిటీని వేసినా ఎలాంటి పురోగతి లేదు. అప్పటి నుంచి రగులుతున్న ప్రజాగ్రహం బుధవారం ఒక్కసారిగా లేహ్ వీధుల్లో వ్యక్తమైంది.



లేహ్‌లో నిరసనకారులు నిప్పుపెట్టడంతో మంటల్లో కాలిపోతున్న బిజెపి ప్రధాన కార్యాలయం

నిరాహార దీక్ష ముగించిన వాంగ్‌చుక్
సంయమనంగా వుండాలని విజ్ఞప్తి

ఈ నెల 10 నుంచి నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్ తన దీక్షను బుధవారం విరమించారు. బుధవారం నిరసనలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఒక వీడియో సందేశం విడుదల చేశారు. ఈ నిరసనను 'సామాజిక అశాంతి'గా అభివర్ణిస్తూ ప్రశాంతంగా, సంయమనంగా వుండాలని విజ్ఞప్తి చేశారు. దీన్ని జెన్-జెడ్ విప్లవంగా అభివర్ణించారు. తనతోపాటు నిరాహార దీక్ష చేస్తున్న ఇద్దరు వ్యక్తులు మంగళవారం ఆసుపత్రి పాలవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తించిందని, ఫలితంగా బుధవారం లడఖ్ బంద్‌కు పిలుపునిచ్చారని తెలిపారు. 'ఈ బంద్‌తో వేలాదిమంది యువకులు బయటకు వచ్చారు. వారిని వీధుల్లోకి తీసుకువచ్చిన జెన్ - జెడ్ విప్లవం ఇది. ఐదు సంవత్సరాలుగా వారు నిరుద్యోగులుగా ఉన్నారు. పైగా మా యువకులకు ఉద్యోగాలు నిరాకరించడానికి ఒకరి తర్వాత ఒకరు సాకులు వెతుకుతున్నారు. సామాజిక అశాంతికి ఇదే అసలైన కారణం' అని ఆ వీడియోలో వాంగ్‌చుక్ పేర్కొన్నారు.

బుధవారం నాటి హింసాత్మక ఘటనలను ఆయన ఖండించారు. 'లేహ్‌లో జరిగింది దురదృష్టకరం. ఒకప్పుడు ప్రశాంతతకు మారుపేరైన లడఖ్, ఇప్పుడు బిజెపి విఫల ప్రయోగం (కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటన) కారణంగా నిరాశ, అభద్రతతో నిండిపోయింది. ఇందుకు కేంద్రానిదే బాధ్యత, చర్చలు తిరిగి ప్రారంభించండి' అని కోరారు.

బుధవారం నాటి ఘటనలతో గురువారం జరగాల్సిన కార్గిల్ పర్యటనను లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కవిందర్ గుప్తా రద్దు చేసుకున్నారు. రాష్ట్రహోదా కోసం ఎల్ఎబితోపాటు పోరాటం చేస్తున్న కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కెడిఎ) గురువారం లడఖ్ పూర్తి బంద్‌కు పిలుపునిచ్చింది.

భూముల రక్షణకు ఐక్య పోరాటాలు

రైతు, కూలీల మహాధర్నాలో వి.శ్రీనివాసరావు పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పేదల భూములను పరిశ్రమల పేరుతో కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని ఐక్య పోరాటాలతో అడ్డుకుని, భూములను కాపాడుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతు, కూలీల మహాధర్నా విజయవాడలోని ధర్నా చౌక్‌లో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అభివృద్ధి అంటే పచ్చని భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడం కాదన్నారు. భూములు ఇచ్చిన రైతులకు ఉపాధి, ఆదాయం కల్పించడంతోపాటు, జీవితాలు గతం కంటే మెరుగుపడాలన్నారు. రాష్ట్రంలో భూములు ఇచ్చిన రైతులకు ఎక్కడా ఇటువంటి పరిస్థితి లేదన్నారు. గత 10 ఏళ్లలో ఎపిఐఐసి 1.45 లక్షల ఎకరాలను పరిశ్రమలకు కేటాయించిందని, ఎన్ని చోట్ల పరిశ్రమలు పెట్టారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అదానీ, అంబాని, నవయుగ, షిర్డిసాయి వంటి సంస్థలకు భూములను దారాదత్తం చేస్తుందన్నారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ ఉండగా, శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కార్గోకు 4 వేల ఎకరాల్లో ప్రత్యేక ఎయిర్ పోర్టు ఎందుకని ప్రశ్నించారు. అనకాపల్లి జిల్లాలో గతంలో బల్క్ డ్రగ్ పరిశ్రమ కోసం ఇచ్చిన భూములను మిట్టల్ స్టీల్‌కు కేటాయించి, తాజాగా మళ్లీ బల్క్ డ్రగ్ పరిశ్రమకు భూములు సేకరిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే ఉన్న బల్క్ డ్రగ్ పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యం వల్ల అక్కడి ప్రజలు అనారోగ్య సమస్యల భారిన పడుతున్నారన్నారు. కాకినాడ సెజ్‌కు 10వేల ఎకరాలు తీసుకుంటే కేవలం 150 ఎకరాల్లో మాత్రమే ఒక పరిశ్రమ ఏర్పాటు చేశారని చెప్పారు. సత్యసాయి జిల్లాలోని నాలెడ్జ్ సెంటర్ కోసం సేకరించిన 4 వేల ఎకరాల్లో నిర్మాణ సంస్థ 2,500 ఎకరాలను తనఖాపెట్టి బ్యాంక్ నుంచి రూ.4,500 కోట్లు రుణం తీసుకుందన్నారు. వీరిపై ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలో 40 వేల ఎకరాలను సేకరిస్తున్నారని తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్‌లకు భూములు ఇచ్చిన రైతులకు లాభాల్లో వాటా ఇవ్వాలన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడాన్ని తప్పుబట్టారు. పిపిపి అంటే పబ్లిక్ ప్రాపర్టీపై ప్రైవేటు పెత్తనమని చెప్పారు. విశాఖలో డేటా సెంటర్‌కు అదానికి 4 ఏళ్ల కిందట భూములిస్తే ఇప్పటికీ ఏర్పాటు చేయలేదన్నారు. ఆ సంస్థ నుంచి భూములు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిసిఎస్ సంస్థకు ఉచితంగా భూములు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఏర్పాటైన ఒకటి రెండు పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని, బీహార్, బెంగాల్ రాష్ట్రాల తీసుకువచ్చిన మిగతా 7లో

మహాధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

రెండో రోజూ మత్స్యకారుల ఆందోళన

- డిప్యూటీ సిఎం హామీతో తాత్కాలికంగా విరమణ
- పవన్ కల్యాణ్ లేఖను చదివి వినిపించిన కలెక్టర్

2

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోయిస్టులు మృతి
- నిషేధిత జెజెఎంపి సభ్యులుగా గుర్తింపు
- ఛత్తీస్‌గఢ్‌లో భారీగా మావోయిస్టుల లొంగుబాటు

7

రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

వేడుకగా శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సాయంత్రం శ్రీవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ శ్రీవారి ఫొటో, తీర్థ ప్రసాదాలను అందజేశారు. సిఎం చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి నారా భువనేశ్వరి, కుమారుడు లోకేష్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్ ఉన్నారు. తిరుమల పర్యటనలో భాగంగా గురువారం ఉదయం వెంకటాద్రి నిలయం (పిఎసి-5), టిటిడి ఎఐ కమాండ్ కంట్రోల్ సెంటర్, ఇంటెలిజెంట్ క్రౌడ్ సైబర్ కంట్రోల్, శ్రీవారి ప్రసాదాల ఇంగ్రెడియెంట్స్ విజన్ బేస్డ్ సార్టింగ్ మెషిన్ ప్లాంట్‌ను సిఎం ప్రారంభించనున్నారు. అనంతరం అమరావతికి పయనమవుతారు.

టిటిడి అన్ని ఆలయాల్లో నిత్యాన్నదానం..

అనంతరం సిఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న అన్ని ఆలయాల్లో నిత్యాన్నదాన పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించాలని, రాష్ట్రంలోని ఐదువేల గ్రామాల్లో శ్రీవారి ఆలయాలను నిర్మించాలని సూచించారు. 17 లక్షల మంది శ్రీవారి సేవకులున్నారని, బ్రహ్మోత్సవాల్లో 14సార్లు శ్రీవారికి పట్టు వస్త్రాలను సమర్పించే భాగ్యం తనకు దక్కిందన్నారు.

శ్రీవారికి యజ్ఞోపవీతం కానుక

శ్రీవారికి రూ.3.86 కోట్లు విలువైన స్వర్ణ యజ్ఞోపవీతంను వైజాగ్‌కు చెందిన హిందుస్థాన్ ఎంటర్‌ప్రైజెస్ ఎమ్‌డి పువ్వాడ మస్తాన్‌రావు, కుంకుమ రేఖ దంపతులు కానుకగా ఇచ్చారు.

ఎస్ఐఆర్ ప్రజాస్వామ్యానికి అతిపెద్ద ముప్పే

- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం
- నితీష్‌ను బిజెపి మానసికంగా రిటైర్ చేసింది : ఖర్గే

పాట్నా : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రజాస్వామ్యానికి అతి పెద్ద ముప్పు అని, అణగారిన వర్గాల ఓటు హక్కును దోచుకోవడానికి రూపొందించిన ప్రక్రియ అని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ పేర్కొంది. ఖర్గే అధ్యక్షతన పాట్నాలోని సదాకత్ ఆశ్రమంలో బుధవారం జరిగిన ఈ భేటీకి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి తదితర ముఖ్య నేతలు హాజం య్యారు. స్వాతంత్ర్యం తర్వాత బీహార్‌లో సిడబ్ల్యుసి సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి. మన ఓటరు జాబితాను అధికారికంగా ట్యాంపింగ్ చేస్తున్న వేళ మన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిజ్ఞ చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు కేంద్రంలో మోడీ ప్రభుత్వ అవినీతి పాలన ముగింపునకు నాంది పలుకుతాయని అన్నారు. బీహార్ సిఎం నితీష్ కుమార్‌ను బిజెపి నాయకత్వం మానసికంగా రిటైర్‌మెంట్ చేసిందని ఆరోపించారు.

ఆ హక్కు కల్పించారు!

మోడీ ప్రభుత్వం దౌత్యపరంగా విఫలమవడం వల్లే మన దేశం అంతర్జాతీయంగా సమస్యలు ఎదుర్కొంటున్నదని ఖర్గే విమర్శించారు. ఎవరినైతే ప్రధాని తన స్నేహితులుగా చెబుతున్నారో వారే ఇప్పుడు భారత్‌ను సమస్యల వలయంలోకి నెట్టారని అన్నారు. సరిగ్గా 85ఏళ్ల కింద రామ్‌గఢ్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశంలో మొదటి రాజ్యాంగ ప్రతిపాదనను ప్రవేశపెట్టారని ఆయన గుర్తు చేసుకు న్నారు. మహాత్మా గాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సహా పలువురు కలిసి దేశ పౌరులకు "ఒక వ్యక్తి, ఒక ఓటు" హక్కును కల్పించారని ఆయన పేర్కొన్నారు.

సమాధానాలకు బదులు అఫిడవిట్లు

ప్రజాస్వామ్యానికి పునాది నిష్పాక్షికమైన, పారదర్శకమైన ఎన్నికలు అని ఖర్గే అన్నారు. ఎన్నికల కమిషన్ నిష్పాక్షికత, పారదర్శకత మిగతా 7లో

ఎర్రమట్టి దిబ్బల సర్వేకు కమిటీ

ప్రజాశక్తి-అమరావతి

భీమునిపట్నం మండలం, నేరెళ్లవలస గ్రామ పరిధిలోని ఎర్రమట్టి దిబ్బలను రక్షించాలని హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వాటి హద్దులు నిర్ణయించేందుకు భారతీయ జియోలాజికల్ సర్వే సంస్థకు చెందిన ఇద్దరు, రాష్ట్ర రెవెన్యూశాఖకు చెందిన ఇద్దరు చొప్పున ఉన్నతాధికారులతో కమిటీ వేసింది. కమిటీ సర్వే చేసి ఎర్రమట్టి దిబ్బల హద్దులను నిర్ణయించాలంది. కాంక్రీట్ రాళ్లలో కంచె ఏర్పాటు చేయాలంది. అక్కడి పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని కమిటీకి చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఎర్రమట్టి దిబ్బలను యునెస్కో సంస్థ ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిందని తెలిపింది. నేరెళ్లవలస గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 118/5 ఎ (పాత సర్వే నెంబరు 49/1)లోని ఎర్రమట్టి దిబ్బలను విధ్వంసం నుంచి రక్షించాలంటూ జనసేన కార్పొరేటర్ పివిఎల్ఎన్ మూర్తి యాదవ్, టి శంకర్‌రావు వేసిన పిల్స్‌పై విచారణను వాయిదా వేసింది.

10 వేలకుపైగా మెడికల్ సీట్ల పెంపు

- రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా 10 వేలకుపైగా మెడికల్ సీట్లను పెంచుతున్నట్లు కేంద్ర మంత్రివర్గం ప్రకటించింది. దసరా, దీపావళి పండగల నేపథ్యంలో గ్రూప్ సి, గ్రూప్ డి ఉద్యోగులకు 78 రోజుల బోనస్ ఇస్తున్నట్లు పేర్కొంది. బుధవారం నాడిక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం భేటీ అయింది. అనంతరం విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. రైల్వే నాన్ గెజిటెడ్ గ్రూప్ సి, గ్రూప్ డి (లెవెల్ 1 స్టాఫ్) ఉద్యోగులకు బోనస్ వర్తించనుంది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం రూ.1,866 కోట్లు కేటాయించింది. రైల్వే ప్రొడక్షన్ యూనిట్లు, రైల్వే వర్క్‌షాపులు, ఇతర సహాయ విభాగాల్లో పనిచేసే 10,91,146 ఉద్యోగులకూ ఈ బోనస్ అందనుంది.

భారీగా మెడికల్ సీట్ల పెంపు

దేశంలో పోస్ట్ గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్య సీట్లు భారీగా పెంచేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఐదు వేల పిజి, 5,023 ఎంబిబిఎస్ సీట్లను పెంచడానికి, ప్రస్తుత ప్రభుత్వ వైద్య కళాశాలల అప్‌గ్రేడ్ కోసం సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్ (సిఎస్ఎస్) విస్తరణకు ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా ఎంబిబిఎస్ సీట్లు 1,18,190కి, పిజి సీట్లు 74,306కి చేరుకుంటాయి. మొత్తం రూ.15,034.50 కోట్ల బడ్జెట్ (2025-26 నుంచి 2028-29 వరకు)తో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. ఇందులో కేంద్రం వాటా రూ.10,303.20 కోట్లు కాగా.. రాష్ట్రాల వాటా రూ.4,731.30 కోట్లుగా ఉంది. డిమాండ్‌కు తగ్గట్టు సీట్లు పెంచడం అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఆరోగ్య మంత్రిత్వశాఖ ఈ మార్పుల అమలుకు మార్గదర్శకాలు వెంటనే జారీ చేస్తుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్)లోని 'సామర్థ్యాభివృద్ధి, మానవ వనరుల అభివృద్ధి' పథకాన్ని 15వ ఆర్థిక సంఘం కాలానికి గాను 2021-22 నుంచి 2025-26 వరకు మొత్తం వ్యయం రూ.2,277.397 కోట్లతో చేపట్టేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

సముద్ర రంగం అభివృద్ధికి రూ.69,725 కోట్లు

నౌకా నిర్మాణం, నౌకా వాణిజ్య రంగాల పునరుజ్జీవనం కోసం రూ.69,725 కోట్ల సమగ్ర ప్యాకేజీని కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఈ ప్యాకేజీ కింద మొత్తం రూ.24,736 కోట్ల కార్పస్‌తో నౌకా నిర్మాణం కోసం ఆర్థిక సాయం అందించే పథకం (ఎస్‌బిఎఫ్ఎఎస్) గడువును 2036 మార్చి 31 వరకు పొడిగించారు. దేశంలో నౌకా నిర్మాణాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందించిన ఈ పథకంలో రూ.4,001 కోట్ల కేటాయింపు గల షిప్‌బ్రేకింగ్ క్రెడిట్ నోట్ భాగంగా ఉంది. అన్ని కార్యక్రమాల అమలును పర్యవేక్షించడం కోసం ఒక జాతీయ నౌకా నిర్మాణ మిషన్‌నూ ఏర్పాటు చేస్తారు. రూ.25 వేల కోట్ల కార్పస్‌తో ఈ రంగానికి దీర్ఘకాలిక ఆర్థిక సహాయం అందించేందుకు మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎన్‌డిఎఫ్) ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం నుంచి 49 శాతం భాగస్వామ్యంతో రూ.20 వేల కోట్ల మారిటైమ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, రుణాల ప్రభావ వ్యయాన్ని తగ్గించడానికి, ప్రాజెక్ట్ బ్యాంకింగ్ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి రూ.5 వేల కోట్ల వడ్డీ ప్రోత్సాహక నిధి దీనిలో భాగంగా ఉన్నాయి. రూ.19,989 కోట్ల బడ్జెట్ వ్యయంతో నౌకా నిర్మాణ అభివృద్ధి పథకాన్ని (ఎస్‌బిడిఎస్) అమలు చేస్తారు.

రూ.3,822 కోట్లతో నాలుగు లైన్లు

సాహెబ్ గంజ్-బెట్టయ్య ఎన్‌హెచ్ 139 నాలుగు లైన్ల రహదారి 79 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.3,822 కోట్లు కేటాయించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. భక్తియార్ పూర్-రాజ్ గిర్-తలయ మధ్య 104 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ డబ్లింగ్ కోసం కేంద్రం రూ.2,192 కోట్లు ఖర్చుపెట్టనుంది.

లోకాయుక్త, ఎపిహెచ్ఆర్‌సి చైర్మన్ల నియామకం ఎప్పుడు?

● ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

లోకాయుక్త, ఎపి హెచ్ఆర్‌సి, ఎపి విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి), రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎస్‌సిడిఆర్‌సి)లకు చైర్మన్లను, సభ్యులను ఎందుకు నియమించలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. వాటిని ఎప్పటిలోగా భర్తీ చేస్తారో చెప్పాలంది. ఇదే అంశంపై దాఖలైన పిల్‌తో కలిపి ఈ తాజా పిటిషన్లపై విచారణ చేస్తామని ప్రకటించింది. విచారణను 4 వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ప్రకటించింది. లోకాయుక్త ఇతర పోస్టులను భర్తీ చేయకపోవడంపై విశ్రాంత వెంకటరమణ మూర్తి పిల్ వేశారు. కీలక సంస్థలకు నియామకాలు చేయడం లేదన్నారు.

విపక్ష నేతగా గుర్తించండి : జగన్

● పలువురికి నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

శాసనసభలో తనను విపక్ష నేతగా గుర్తింపు ఇవ్వకుండా స్పీకర్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ మాజీ సిఎం వైఎస్ జగన్ దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం హైకోర్టు విచారించింది. ప్రతివాదులైన అసెంబ్లీ కార్యదర్శి, లా కార్యదర్శి, స్పీకర్ కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. స్పీకర్ గత ఫిబ్రవరి 5న ఇచ్చిన రూలింగ్‌ను రద్దు చేయాలని జగన్ వేసిన పిటిషన్‌పై విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రతిపక్ష నేతగా గుర్తించేందుకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నిరాకరిస్తూ ఇచ్చిన రూలింగ్‌ను కొట్టివేయాలని, ఈ రూలింగ్ ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్స్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్ క్వాలిఫికేషన్ యాక్ట్‌లోని సెక్షన్ 12–బికి విరుద్ధమని ప్రకటించాలని జగన్ తరఫున న్యాయవాది వాదించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పిన [illegible] చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపవలసిన...

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం–అమరారెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా – 522 501కు కానీ editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపై కోలాట నృత్య ప్రదర్శన చేస్తున్న మహిళలు

అన్నపూర్ణదేవిగా దుర్గమ్మ

● శ్రీకాళహస్తి దేవస్థానం తరపున పట్టువస్త్రాలు, సారె సమర్పణ

ప్రజాశక్తి- విజయవాడ సిటీ :

దసరా వేడుకల్లో భాగంగా మూడోరోజున అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. బుధవారం వేకువజామున నాలుగు గంటల నుంచి సర్వదర్శనం క్యూలైన్లతోపాటు రూ.100, రూ.300 టికెట్ల క్యూ లైన్లలో యాత్రికుల రద్దీ కొనసాగింది. రాత్రి ఏడు గంటలకు వరకు సుమారు 70 వేల మంది యాత్రికులు దుర్గమ్మను దర్శించుకున్నారు. రూ.31.08 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.

ఉత్సవాల్లో భాగంగా నగరోత్సవం నేత్రపర్వంగా సాగింది. మల్లికార్జున మహామండపం నుంచి ప్రారంభమైన నగరోత్సవం కనకదుర్గ నగర్, ఘాట్ రోడ్డు మీదగా ఆలయానికి చేరుకుంది. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట నిర్వహించిన పూజలతో నగరోత్సవం పరిసమాప్తమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు, డప్పు కళాకారుల విన్యాసాలతో నగరోత్సవం సాగింది. దుర్గమ్మను రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు, మంత్రి కొలుసు పార్థసారథి, పలువురు ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి దేవస్థానం తరపున దుర్గమ్మకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ కుమార్ రెడ్డి, శ్రీకాళహస్తి దేవస్థాన ఇఒ టి.బాపిరెడ్డి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు.

మాజీ ఐఎఎస్ అధికారి పిటిషన్‌పై తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

సినిమా ప్రమోషన్ కోసం డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ రిటైర్డు ఐఎఎస్ అధికారి విజయ్ కుమార్ వేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో తీర్పును తరువాత ప్రకటిస్తామని జస్టిస్ వెంకట జ్యోతిర్మయి బుధవారం ప్రకటించారు. హరిహర వీరమల్లు సినిమా, వాణిజ్య కార్యక్రమాలను ప్రమోట్ చేసుకొనేందుకు ప్రభుత్వ నిధులను వినియోగించారని, అధికార యంత్రాంగాన్ని వాడుకున్నారని న్యాయవాది బాల వాదించారు.

డిప్యూటీ సిఎం లెటర్ చదివి వినిపిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

ఉప్పాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో ధర్నా చేస్తున్న మత్స్యకారులు

రెండో రోజూ మత్స్యకారుల ఆందోళన

● డిప్యూటీ సిఎం హామీతో తాత్కాలికంగా విరమణ

● పవన్ కల్యాణ్ లేఖను చదివి వినిపించిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి (కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లిలో కాలుష్య కారక పరిశ్రమలను మూసివేయాలని మత్స్యకారులు చేపట్టిన ఆందోళన బుధవారం రెండో రోజూ కొనసాగింది. ఉప్పాడ, మూలపేట, కోనపాపేట ప్రధాన రహదారిలో కుటుంబ సభ్యులతో కలిసి బైఠాయించారు. దివీస్, అరబిందో, ఇతర పరిశ్రమల కాలుష్య జలాలను సముద్రంలోకి నేరుగా వదులుతుండడంతో మత్స్య సంపద అంతరించిపోతోందని, వేట సాగక తమ ఉపాధికి గండిపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పిఠాపురం ఎంఎల్‌ఎ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇక్కడికి వచ్చి సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, పోలీస్ ఉన్నతాధికారులు అక్కడికి వచ్చారు. సమస్య డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లిందన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పవన్ కల్యాణ్ ఇక్కడికి రావాల్సిందేనని, సమస్య పరిష్కరించే వరకూ ధర్నా కొనసాగిస్తామని మత్స్యకారులు తేల్చి చెప్పారు. దీంతో, కలెక్టర్, జిల్లా అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఆ తర్వాత కొత్తపల్లి తహశీల్దారు కార్యాలయంలో మత్స్యకార పెద్దలతో కలెక్టర్ సమావేశమయ్యారు. అనంతరం ధర్నా వద్దకు ఆయన వచ్చారు. సమస్య పరిష్కారానికి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ లేఖ పంపారంటూ దానిని చదివి వినిపించారు. 'ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మత్స్యకార కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోగలను.

ప్రస్తుతం తాను అసెంబ్లీ సమావేశాల్లోనూ, అస్వస్థతతోనూ ఉన్నందున వ్యక్తిగతంగా వచ్చి మాట్లాడలేకపోతున్నాను. కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, ఫిషరీస్, రెవెన్యూ ఉన్నతాధికారులు, కాకినాడ జిల్లా కలెక్టర్‌తో కమిటీని ఏర్పాటు చేస్తాం. దీనిలో మత్స్యకార ప్రతినిధులకు, స్థానిక నాయకులకు స్థానం ఇవ్వాలని నిర్ణయించాం. సమస్యల పరిష్కారంతోపాటు జీవనోపాధి మెరుగుదల, తీర ప్రాంత గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనపైనా ఈ కమిటీ దృష్టి పెడుతుంది. నష్టపరిహారం మదింపు గురించి కూడా చర్చిస్తుంది. మత్స్యకార సమస్యలను అధ్యయనం చేసి, అమలు చేయదగిన సిఫార్సులతో కూడిన నివేదికను కమిటీ సిద్ధం చేస్తుంది. ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తాం' అని డిప్యూటీ సిఎం హామీ ఇచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఆందోళన విరమించాలని కోరారు. దీంతో, వచ్చే నెల పదో తేదీ వరకు సమయం ఇస్తున్నట్టు మత్స్యకారులు తెలిపారు. తాత్కాలికంగా ఆందోళన విరమిస్తున్నామని ప్రకటించారు. హామీని నిలుపుకోకపోతే మరోసారి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

మత్స్యకారుల వేటపై తీవ్ర ప్రభావం చూపుతున్న కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకొని మత్స్య సంపదను కాపాడాలని మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం జిల్లా నాయకులు యు.సత్యనారాయణ, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. మత్స్యకారుల ధర్నాకు వద్దకు వచ్చి వారికి మద్దతు తెలిపారు. ఉప్పాడ, కోనపాపపేట, అమీనాబాద్ తదితర మత్స్యకార గ్రామస్తుల న్యాయమైన పోరాటానికి సిపిఎం కూడా మద్దతు ఇస్తోన్న విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

అన్ ఎయిడెడ్ సిబ్బందికి కనీస వేతనం చెల్లించాలి

● మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎయిడెడ్ విద్యాసంస్థల్లోని (పాఠశాల, కళాశాల) అన్‌ఎయిడెడ్ సిబ్బందికి కనీస వేతనం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి కోరారు. శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా బుధవారం ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రంలో ఎయిడెడ్ విద్యాసంస్థలు గతంలో విద్యాభివృద్ధి కోసం కృషి చేశాయని తెలిపారు. వాటి పరిస్థితి నేడు చాలా దయనీయంగా మారిందన్నారు. అందులో పనిచేసే అన్ ఎయిడెడ్ బోధన, బోధనేతర సిబ్బంది రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పనిచేస్తున్నారని తెలిపారు. 10 నుంచి 15 ఏళ్ల నుంచి అదే వేతనంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇటువంటి వారిని ఎయిడెడ్ పోస్టుల్లో నింపాలని సుప్రీంకోర్టు, హైకోర్టు కొన్ని జడ్జిమెంట్లు కూడా ఇచ్చాయన్నారు. కావున అర్హత కలిగిన వారిని ఎయిడెడ్ పోస్టుగా పరిగణించాలని, మిగిలిన వారికి కనీస వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎయిడెడ్ సిబ్బందికి హెల్త్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. విద్యాభివృద్ధి కోసం దాతలు స్థలాలిచ్చి భవనాలు నిర్మించారని, కానీ కొన్నిచోట్ల అవి అన్యాక్రాంతమవుతున్నాయని చెప్పిన ఆయన పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణంలో బిజిబిఎస్ మహిళా కళాశాల గురించి ప్రస్తావించారు. అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్వహణ సరిగ్గా లేని కళాశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు.

అరెస్టు చేసేప్పుడు సివిల్ డ్రెస్‌లో ఎలా ఉంటారు?

● పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

నిందితులను అరెస్టు చేసేప్పుడు పోలీసులు సివిల్ డ్రెస్‌లో ఎలా ఉంటారని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. పోలీసులు యునిఫామ్ ఎందుకు ధరించలేదని ప్రశ్నించింది. సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినప్పటికీ ఎందుకు అమలు చేయడం లేదని తప్పుపట్టింది. సవీంద్రరెడ్డి అరెస్ట్ సమయంలో యునిఫామ్ ఎందుకు వేసుకోలేదని ప్రత్తిపాడు ఎస్‌హెచ్‌ఒను నిలదీసింది. నిందితుడు సవేంద్రరెడ్డిని వచ్చే శుక్రవారం వరకు విడిచిపెట్టాలని ఆదేశించింది. అదేరోజు జరిగే విచారణకు తమ ఎదుట హాజరుపర్చాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 26కు వాయిదా వేస్తూ జస్టిస్ ఆర్ రఘునందనరావు, జస్టిస్ టిసిడి శేఖర్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైసిపి వలంటీర్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచాల సవేంద్రరెడ్డిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ ఆయన భార్య లక్ష్మీప్రసన్న వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను గత విచారణలో రెడ్డిని తమ ఎదుట హాజరుపర్చాలని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

'పిపిపి' ఉపసంహరించాల్సిందే

● మెడికల్ కళాశాలలపై మండలిలో వైసిపి డిమాండ్

● సభ నుండి వాకౌట్

● మరో 33 ఏళ్లు పొడిగిస్తాం : మంత్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ కళాశాలలను పిపిపి పద్ధతిలో నిర్మించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని బుధవారం శాసన మండలిలో వైసిపి డిమాండ్ చేసింది. ప్రభుత్వమే ఈ కళాశాలలను నిర్మించి నిర్వహించాలని ఆ పార్టీ ప్రభుత్వాన్ని కోరింది. అయితే ఇందుకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో వైసిపి సభ నుంచి వాకౌట్ చేసింది. అంతకుముందు మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ అంశంపై లఘు చర్చ జరిగింది. చర్చ వాడీవేడిగా కొనసాగింది. టిడిపి, వైసిపి సభ్యుల మధ్య వాగ్వావాదం జరిగింది. తొలుత వైద్య ఆరోగ్య శాఖ పి.సత్యకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతిపాదించిన 17 మెడికల్ కళాశాలలను నిర్మాణం, నిర్వహణ మాత్రమే ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నట్టు తెలిపారు. అంతేతప్ప కళాశాలలకు చెందిన భూములు వారికి ఇవ్వడం లేదన్నారు. ప్రైవేటు సంస్థలతో ఒప్పందం 33 ఏళ్లకు ఇస్తున్నామని ఈ గడువును మరో 33 ఏళ్లకు భవిష్యత్తులో పొడిగించే అవకాశం కూడా ఉంటుందని పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు జవాబుగా ఆయన వెల్లడించారు. 17 కళాశాలల నిర్మాణానికి రూ.8500 కోట్లు అవసరం అవుతాయన్నారు. గత ప్రభుత్వం రూ. 1550 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఐదు కళాశాలలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగతావి ప్రారంభం కాలేదన్నారు. కళాశాలలను ప్రవేటు వారికి అమ్మేస్తున్నారనే ప్రచారం వాస్తవం కాదన్నారు. 50 శాతం సీట్లు కన్వీనర్ కోటాలో పేద విద్యార్థులకు దక్కుతాయన్నారు. మంత్రి మాట్లాడుతుండగా వైసిపి సభ్యుడు రహుల్లా మంత్రి సోది చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఇందుకు టిడిపి సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. టిడిపి సభ్యులు పోడియం వద్దకు వెళ్లి రహుల్లా మంత్రికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రహుల్లా మాట్లాడిన పదాలు అన్‌పార్లమెంటరీ కనుక అయితే రికార్డులను పరిశీలించి తొలగిస్తామన్నారు. ఈ సందర్భంగా వైసిపి సభ్యులు కుంభారవిబాబు, పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డి, కల్పలతా, రమేష్‌బాబు, సిపాయి సుబ్రమణ్యం, తూమాటి మాధవరావు, ఇస్రాయిల్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయంలో 17 కళాశాలలను ఒకే సారి ప్రారంభించామని వీటిలో ఐదు పూర్తయ్యాయని తెలిపారు. రూ.లక్ష కోట్లు పెట్టి రాజధాని నిర్మించే కూటమి ప్రభుత్వం వద్ద మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ. 5 వేల కోట్లు లేవా అని ప్రశ్నించారు. 17 మెడికల్ కళాశాలలకు ఒకే సారి 2,550 సీట్లు రాష్ట్రానికి కేటాయించారని గుర్తు చేశారు. కరోనా తరువాత కేంద్రప్రభుత్వం దేశ వ్యాప్తంగా మెడికల్ కళాశాలలను ప్రైవేటు సంస్థలకు కాకుండా ప్రభుత్వం అధీనంలో ఉండాలన్న లక్ష్యంతో ప్రతి జిల్లాలో ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాలను కేటాయించిందని గుర్తు చేశారు. ఇందుకు విరుద్ధంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, బిజెపి మంత్రి సత్యకుమార్ మెడికల్ కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని నిర్ణయించడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపి సభ్యులు పంచుమర్తి అనురాధా, వేపాడ చిరంజీవి రావు, కావలి గ్రీష్మ, రాంభూపాల్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ 17 కళాశాలల నిర్మాణంను ఆర్భాటంగా ప్రారంభించి కేవలం మూడు మాత్రమే పూర్తి చేశారని ఎద్దేవా చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రవేటు సంస్థలే ఈ నిర్మాణాలను పూర్తి చేసి పేదలకు 50 శాతం సీట్లు ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సబబేనన్నారు. ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయంలో 17 మెడికల్ కళాశాలలను నిర్మాణం చేపట్టామని 5 పూర్తయ్యాయని మిగతావి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. తరువాత వచ్చిన ప్రభుత్వం వీటిని త్వరగా పూర్తి చేయాలే తప్ప ప్రైవేటు సంస్థలకు అప్పగించాలనుకోవడం అన్యాయం అన్నారు. ప్రజారోగ్యం ప్రైవేటు పరం చేస్తే ఎన్నో ఘోరాలు జరుగుతాయన్నారు. ఇందుకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పుడు సిఎం అయినా కీలక రంగాలన్నింటిలో ప్రైవేటు సంస్థలకు భాగస్వామ్యం కల్పిస్తారని ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తారని ఆరోపించారు. పిపిపి విధానం ఎన్నో సార్లు విఫలం అయిందని తెలిపారు. ప్రతిసారి పిపిపి అనడం సబబు కాదన్నారు. ప్రజారోగ్యాన్ని ప్రైవేటు పరం చేయడం అన్యాయం, దుర్మార్గం అంటూ మండలి నుంచి వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించారు. పలుమార్లు మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారధితో బొత్సాకు వాగ్వావాదం జరిగింది.

ఆగని పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా

● ప్రజాప్రతినిధులకు భారీగా ముడుపులు?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా యధేశ్చగా కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అనేకరకాల చర్యలు తీసుకున్నామని చెబుతున్నప్పటికీ ఆచరణలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ గణాంకాలే దీనికి నిదర్శనం. గతేడాది జూన్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా,దారి మళ్లింపుపై రాష్ట్ర వ్యాప్తంగా 2,438 కేసులు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి.వీటిలో 1955 నిత్యావసర వస్తువుల చట్టం, 2018 ప్రజా పంపిణీ వ్యవస్థ(నియంత్రణ) ఉత్తర్వుల నిబంధనల ప్రకారం ఉన్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు 232 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఇందుకు సంబంధించి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన 282 వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఆయా కేసులకు సంబంధించి రూ.254.6కోట్ల విలువైన 5,65,886 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఇందులో 25,584 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వం వేలం వేసి రూ. 6,60,63,805లు ప్రభుత్వం ఆదాయం సమకూర్చుకున్నట్లు స్పష్టమవుతోంది. ఇది ఇలా ఉంటూ కైకలూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో 5.40కోట్ల విలువజేసే బియ్యం పక్కదారి పట్టిన అంశంపై ప్రభుత్వం విచారణ చేపట్టినట్లు సమాచారం.

బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం విశాఖపట్టణం, కాకినాడ ఓడరేవుల్లో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు (ఐసిపి)లను ఏర్పాటు చేసినా, పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ప్రకటించినా అక్రమ రవాణా ఆగడం లేదు. పలువురు ప్రజాప్రతినిధులకు ఈ వ్యవహారంతో సంబంధం ఉండటం, ఎక్కడికక్కడ వారికి ముడుపులు అందుతుండటం దీనికి కారణమని చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో గతంలో ఎండియూ వాహనాల ఆపరేటర్లు లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తుండగా, ప్రస్తుతం అనేకచోట్ల రేషన్ షాపు డీలర్లే ఆ పనిచేస్తున్నట్లు సమాచారం.

రూ.51,801 కోట్లతో అమరావతి పనులు

● శాసనసభలో మంత్రి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నగరంలో 85 పనులను రూ.51,801 కోట్లతో చేపట్టామని, వీటిల్లో 21 ప్రాజెక్టులు సిఆర్‌డిఎ, 64 ప్రాజెక్టులు ఎడిసిఎల్ చేపడుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో బిజెపి సభ్యులు విష్ణుకుమార్‌రాజు, కె శ్రీనివాస్, ఎన్ ఈశ్వరరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. 2019 నుంచి 2024 వరకూ అక్కడ పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పనులు ప్రారంభించామన్నారు. 2026 మార్చి 31 నాటికి 3,500 ప్లాట్లను పూర్తి చేస్తామని తెలిపారు. గతంలో ఇచ్చిన పనులకు అప్పుడున్న ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని, దీంతో సవరించి టెండర్లు పిలిచామని పేర్కొన్నారు. టెండర్లలో పేర్కొన్న నిబంధనల మేరకు అర్హులైన కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తున్నామని, వేగవంతంగా పనులు పూర్తి చేయడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అలాగే రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లలో అభివృద్ధి పనులూ వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.

మొత్తం 9 సంస్థలకే పనులా : విష్ణుకుమార్ రాజు

రాష్ట్రంలో మూడువేల మంది కాంట్రాక్టర్లు ఉన్నారని, కానీ అమరావతిలో తొమ్మిది సంస్థలకే పనులు అప్పగించారని విష్ణుకుమార్ రాజు విమర్శించారు. పరిపాలనా సౌలభ్యం పేరుతో తక్కువ మంది కాంట్రాక్టర్లకు పనులు ఇచ్చినందువల్ల మిగిలిన కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అమరావతి విషయంలో చిన్న కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాలని, పనులు చేసిన వారందరికీ డబ్బులు చెల్లించాలని కోరారు. అయితే చిన్న కాంట్రాక్టర్లకు పాత రేట్లతో పనులు ఇస్తున్నారని, పెద్ద కాంట్రాక్టర్లకు కొత్త ధరలు నిర్ణయించారని పేర్కొన్నారు. బిల్లులు అడిగితే ఆర్థికశాఖ ఇబ్బందులు పెడుతోందని అన్నారు. బిల్లు ఉందో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొందని విమర్శించారు. సిఆర్‌డిఎ కాంట్రాక్టర్లు మాత్రం బిల్లు సబ్మిట్ చేస్తే వెంటనే బిల్లు కూడా అవుతోందని పేర్కొన్నారు.

పిఆర్‌సి బకాయిలు రూ.12,119 కోట్లు

పిఆర్‌సికి సంబంధించి 2024 వరకూ పిఆర్‌సి బకాయిలతో సహా డిఎ రూ.12,119 కోట్లు బకాయి ఉందని, వాటిని ప్రాధాన్యతను బట్టి చెల్లిస్తామని వైసిపి సభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, బి విరూపాక్షి అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. పిఆర్‌సి వేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపింది. ఐఆర్ చెల్లింపు అంశం కూడా పరిశీలనలోనే ఉందని వివరించింది. గిరిజన నియోజకవర్గాలకు ప్రత్యేక అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసే ఆలోచన లేదని మంత్రి సంధ్యారాణి తెలిపారు. జనసేన సభ్యులు చిర్రి బాలరాజు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ.. అటువంటి ప్రతిపాదనలు కూడా ఏమీ లేవని తెలిపారు. పిల్లల యూనిఫాం కొనుగోళ్లకు సంబంధించి అవినీతి జరిగిందని అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు అసెంబ్లీలో ప్రభుత్వం వివరించింది.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

● ఐద్వా పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర మహాసభలు అనంతపురం జిల్లాలో అక్టోబరు 13 నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి తెలిపారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సంఘం చేసిన కార్యక్రమాల అనుభవాలను చర్చించుకుని, రాబోయే కాలంలో కర్తవ్యాలను రూపొందించుకోనున్నట్లు తెలిపారు. ప్రజలు గత ప్రభుత్వం కంటే మెరుగైన పాలన ఇస్తామని నమ్మి కూటమిని గెలిపిస్తే, సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వ విధానాల పట్ల మహిళలు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామన్న వాగ్దానం గురించి ప్రభుత్వ పెద్దలు మాట్లాడటం లేదని, ఉచిత గ్యాస్ సిలిండర్ల వాగ్దానం నామమాత్రంగా అమలు జరుగుతుందన్నారు. ఉచిత బస్సు హామీ అమలును స్వాగతిస్తున్నామని, బస్సు సౌకర్యం లేని ప్రాంతాలకు ఈ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. జనాభాను బట్టి బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. డ్వాక్రా పథకంలో రూ.10 లక్షల రుణాలకు సున్నా వడ్డీ హామీ నేటికీ అమలు కాలేదన్నారు. హింసకు కారణమైన మద్యం పాలసీ విధానంలో గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం లాభార్జనే ధ్యేయంగా పని చేస్తున్నాయని, ఇది మహిళలకు నష్టదాయకమని తెలిపారు. నివాస ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం షాపుల్ని ఏర్పాటు చేయడం, ఎమ్మెల్యేలు మద్యం వ్యాపారంలో భాగస్వాములుగా ఉండటంతో రాష్ట్ర మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే బెల్ట్ షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు. మద్యం వినియోగంపై టార్గెట్‌లు ఇవ్వడమంటే యువత జీవితాలతో ఆడుకోవడమేనన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తున్నారని చెప్పారు. ఈ అంశాలన్నింటిపై మహాసభల్లో చర్చిస్తామని తెలిపారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి వి సావిత్రి మాట్లాడుతూ.. మహాసభల సందర్భంగా అక్టోబరు 9 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, మహిళా ఉద్యమ చరిత్రపై ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి ప్రభావతి, ఆఫీస్ బేరర్స్ శ్రీదేవి, అలివేలు, సత్యవతి, రమణి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తల కోసం రూపొందించిన డిజిటల్ బుక్ వివరాలు తెలియజేస్తున్న ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

కార్యకర్తలే పార్టీకి బలం

● వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి

● అందుబాటులోకి వైసిపి డిజిటల్ బుక్

● అధికారంలోకి రాగానే చట్టపరమైన విచారణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కార్యకర్తలే పార్టీకి బలమని, 14 ఏళ్లకాలంలో పార్టీ బలంగా ఎదిగిందని వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, పరిశీలకులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, కో–ఆర్డినేటర్ల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. అన్ని స్థాయిల్లోనూ పార్టీని బలోపేతం చేయాలని, కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. సంక్రాంతి నాటికి పార్టీ ఐడి కార్డు అందరికీ అందిస్తామని చెప్పారు. పార్టీలో తన హోదా గురించి ప్రతి కార్యకర్తా గర్వంగా చెప్పుకునేలా చేస్తామని అన్నారు. కార్యకర్తలందరి డేటా తన వద్ద ఉందని, పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత వాళ్లకు మంచి చేస్తామని, అందరికీ మేలు జరుగుతుందని అన్నారు. కష్టసమయాల్లో కార్యకర్తలు పార్టీని భుజాన వేసుకున్నారని వివరించారు. అలాంటి వారి గుర్తింపు కోసమే ఐడి కార్డులు ఇస్తున్నామని చెప్పారు. ప్రతి అభ్యర్థి గెలవాలన్న ధ్యేయంతో అందరూ పనిచేయాలని సూచించారు. పార్టీ నిర్మాణం ద్వారానే అది సాధ్యమవుతుందని, ఇప్పుడు అన్యాయానికి గురైన ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. దీనికోసం అన్యాయాలను రికార్డు చేసేందుకు వైసిపి డిజిటల్ బుక్ అందుబాటులోకి వచ్చిందని వివరించారు. పోర్టల్, ఐవిఆర్ఎస్ పద్ధతిలో ఫిర్యాదు చేయొచ్చని, లేదా 040 49171718 నెంబరు ద్వారా రికార్డు చేయొచ్చని పేర్కొన్నారు. వైసిపి అధికారంలోకి రాగానే ఫిర్యాదులపై విచారించి చట్ట ప్రకారం కారకులను శిక్షిస్తామని, బాధ్యులు ఎక్కడున్నా వదిలిపెట్టబోమని, రిటైర్ అయినా రప్పిస్తామని హెచ్చరించారు. రెడ్‌బుక్ అనేవారికి డిజిటల్ బుక్ ఎలా ఉంటుందో చూపిస్తామని తెలిపారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగుతాయని, బుద్ధి జ్ఞానం ఉంటే గవర్నమెంటు కళాశాలలను ప్రైవేటీకరిస్తారా? అని ప్రశ్నించారు. స్కూళ్లు, బస్సులు, ఆస్పత్రులను ప్రభుత్వాలే నడుపుతున్నాయని, అటువంటప్పుడు కళాశాలలను ఎందుకు నడపదని ప్రశ్నించారు. అమరావతిలో మొదటిదశ మౌలిక సదుపాయాలకు రూ.లక్ష కోట్లు ఖర్చవుతుందని చంద్రబాబు చెప్పారని, రెండోదశ మౌలిక సదుపాయాలకు మరో రూ.లక్ష కోట్లు ఖర్చవుతుందని అన్నారు. డబ్బులు లేకపోయినా రూ.లక్షల కోట్లు ఖర్చు చేస్తామని ప్రచారం చేస్తూ వెనుకబడిన ప్రాంతాలకు అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. అదే సమయంలో మెడికల్ కళాశాలలకు రూ.5 వేల కోట్ల ఖర్చు చేయలేమని అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని, ఏ ఒక్కరికీ మేలు జరగడం లేదని పేర్కొన్నారు. 16 నెలల్లో రూ.రెండు లక్ష లకోట్లకుపైగా అప్పుల చేశారని వివరించారు. తెచ్చిన రుణం ఏమి చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మరోవైపు ఎమ్మెల్యేలు యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారని, ఇసుక ఫ్రీ అన్నారని, ఆచరణలో గతంలో కంటే రెట్టింపు ధరకు అమ్ముతున్నారని తెలిపారు. పైగా ఇసుకలో ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా రావడం లేదని పేర్కొన్నారు. సమస్యలు వచ్చినప్పుడల్లా డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతూ కాలం వెల్లదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్యారంటీలపై గోప్యత

● ఆడిట్‌కు వివరాలివ్వని ఆర్థికశాఖ ● పదేపదే కాగ్ లేఖలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వివిధ ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రభుత్వం ఇచ్చే గ్యారంటీ రుణ వివరాలను వెల్లడించడంలో రాష్ట్ర ఆర్థికశాఖ చొరవ చూపడం లేదు. ఏళ్ల తరబడి ఇదే అంశంపై నాన్చుడు ధోరణి అవలంభిస్తోంది. దీనిపై ప్రధాన గణాంకశాఖ అధికారులు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి పదేపదే లేఖలు రాస్తున్నట్లు తెలిసింది. అయినప్పటికీ ఈ లేఖలు బుట్టదాఖలు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇదే అంశంపై ఇతర శాఖల అధికారుల మధ్య చర్చలు కూడా జరుగుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ రంగ సంస్థలు తమ శాఖల అవసరాల కోసం రుణాలు తీసుకోవడం ఎప్పట్నుంచో జరుగుతూనే ఉంది. అందులో కొన్ని రుణాలను సొంత పూచీకత్తుపై తీసుకుంటుండగా, మరికొన్ని రుణాలకు ప్రభుత్వం తన పూచికత్తుతో అనుమతులిస్తోంది. ఇలా అనేక సంస్థలు వేల కోట్ల రూపాయల రుణాలను తీసుకుంటున్నాయి. సొంత పూచీకత్తుతో తీసుకున్న రుణాలపై పెద్దగా చర్చ లేకపోయినప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలతో తీసుకున్న రుణాలపైనే కొన్నేళ్లుగా విస్తృత చర్చ జరుగుతోంది. వార్షిక ఆర్థిక గణాంకాలను సిద్ధం చేసే సమయంలో ఈ రుణ వివరాలను కేంద్రం పరిధిలోని కాగ్‌కు సమర్పించాల్సి ఉంటుంది. ఈ వివరాలను నెలవారీ, వార్షిక నివేదికల్లో కాగ్ వెల్లడిస్తోంది. అయితే తమకు ఈ వివరాలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందడం లేదని కాగ్ అధికారులు చెబుతున్నారు. ప్రతినెలా ఈ వివరాల కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం, ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఈ వివరాలు లేకుండానే నివేదికలు వెల్లడించడం ఆనవాయితీగా మారిపోయిందని కాగ్ చెబుతోంది.

దారి మళ్లింపులే కారణం

పలు సంస్థలు తీసుకుంటున్న గ్యారంటీ రుణాలను ప్రభుత్వం దారిమళ్లిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇంధనశాఖ, పౌర సరఫరాల శాఖ, నీటిపారుదల శాఖ వంటి కీలక శాఖలు ప్రభుత్వ గ్యారంటీలతో తీసుకున్న రుణాలను వెనువెంటనే ఆర్థికశాఖ స్వాధీనం చేసుకుని ఇతర శాఖల్లోని అవసరాలకు వినియోగించుకుంటోంది. ఈ రుణాల బకాయిలు సంస్థలు చెల్లించాల్సిన వాటి వాయిదాలకు సరిపడిన మొత్తాన్ని చివరి క్షణాల్లో చెల్లించడం కూడా ఆనవాయితీగా వస్తోంది. ఇది ఆర్థిక నియమాలకు విరుద్ధం కావడంతో ఆ వివరాలను బయటకు పొక్కకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందుకే రుణ వివరాలను కాగ్ దృష్టికి కూడా తీసుకెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఒక అధికారి వ్యాఖ్యానించడం గమనార్హం.

ఒక్కరోజే 2,991 వాహనాల రిజిస్ట్రేషన్లు

- రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నూతనంగా అమలైన జిఎస్‌టి విధానం వాహనాల అమ్మకాలకు ఊతమిచ్చిందని, పన్నుల భారం తగ్గడంతో ప్రజలు కొత్త వాహనాల కొనుగోలుకు ముందుకు వస్తున్నారని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 22న ఒక్కరోజే 2,991 వాహనాలు తాత్కాలిక రిజిస్ట్రేషన్లు అయ్యాయన్నారు. వీటిలో మోటారు సైకిళ్లు 2,352, కార్లు, క్యాబ్‌లు 241, ట్రాక్టర్లు 60, ఆటోలు 227, గూడ్స్ వాహనాలు 47, ఆటో గూడ్స్ వాహనాలు 50, ఇతర వాహనాలు 12 ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. జిఎస్‌టి కొత్త విధానం అమల్లోకి వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ వేగం పెరుగుతుందని, త్వరలోనే రోజుకు 4 వేల వాహనాల రిజిస్ట్రేషన్లు సాధ్యమవుతుందని తెలిపారు.

ఒంగోలులో స్వల్ప భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై 3.4 తీవ్రత నమోదు

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

ఒంగోలు నగరంలో మంగళవారం అర్ధరాత్రి 2:53 గంటల సమయంలో భూమి స్వల్పంగా కంపించింది. ఇస్లాంపేట, సత్యనారాయణపురం, దిబ్బల రోడ్డు, అన్నవరపుపాడు, మంగమూరు రోడ్, పేర్నమిట్ట, సీతారామపురం, అంజయ్య రోడ్ ప్రాంతాలలో భూమి స్వల్పంగా కంపించినట్లు స్థానికులు తెలిపారు. ఎలాంటి ఆస్తినష్టము జరగలేదు. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 3.4 తీవ్రతతో కంపనాలు నమోదైనట్లు జాతీయ భూకంపన అధ్యయన కేంద్రం పేర్కొంది.

మహిళా ఖైదీల్లో మార్పు తీసుకొస్తాం

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖపట్నం)

మహిళా ఖైదీల్లో మార్పు తీసుకొచ్చి, స్వశక్తితో బతికేలా చర్యలు చేపడతామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. వారికి కౌన్సిలింగ్ ఇప్పించి, తిరిగి సమాజంలో గౌరవప్రదంగా జీవించే విధంగా చేస్తామని చెప్పారు. విశాఖ సెంట్రల్ జైలులోని మహిళా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ముందుగా జైలులోని మహిళా బ్యారెక్‌కు వెళ్లిన ఆమె అక్కడివారికి అందుతున్న వసతులపై సమగ్ర పరిశీలన చేశారు. ఆహారం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. జైలులో మహిళల జీవనశైలి, వారికి అందిస్తున్న సౌకర్యాలు హాస్పిటల్, బేకరీ, ఫ్యాక్టరీల పనితీరును సమీక్షించారు. కార్యక్రమంలో కేంద్ర కారాగారం పర్యవేక్షణ అధికారి మహేష్ బాబు, ఉప పర్యవేక్షణ అధికారులు సాయి ప్రవీణ్, సిహెచ్.సూర్యప్రకాష్, ఐసిడిఎస్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి, ప్రాజెక్ట్ డైరెక్టర్ రామలక్ష్మి పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల వేతనం రూ.20 వేలకు పెంచాలి

- ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల (ఎఫ్‌ఎ)కు నెలకు రూ.20 వేల వేతనం చెల్లించాలని ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గత 8 ఏళ్లుగా ఎఫ్‌ఎలకు జీతం పెంచలేదని యూనియన్ గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం పరందామయ్య, బి నర్సింహులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరికి ప్రస్తుతం నెలకు కేవలం రూ.5,740 చెల్లిస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణ, పేదలు తమ స్వస్థలాల్లోనే నివాసం ఉండటానికి ఈ పథకం ఎంతో తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఎఫ్‌ఎలను ఉద్యోగాల నుంచి నిర్ధాక్షిణ్యంగా తొలగిస్తున్నారని తెలిపారు. మ్యాన్ డేస్ విధానం రద్దు చేసి కనీస వేతనం రూ.20 వేలు చెల్లించడంతోపాటు ఉపాధి కూలీలకు పని దినాలు 200లకు పెంచాలని డిమాండ్ చేశారు. వేతనదారులకు రోజుకు రూ.600 చెల్లించాలని కోరారు.

కాలువలో పారబోసిన ఉల్లిపంట

- గిట్టుబాటు ధర లేక రైతు ఆవేదన

ప్రజాశక్తి-పత్తికొండ

ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో కాలువలో పారబోసిన సంఘటన కర్నూలు జిల్లా పత్తికొండ మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పత్తికొండ మండలం పందికోన గ్రామంలోని రైతు రాజు రెండు ఎకరాలలో ఉల్లిని సాగు చేశారు. బుధవారం కోత కోసే సమయానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ట్రాక్టర్‌తో ఉల్లిని తీసుకెళ్లి హంద్రీనీవా ప్రధాన కాలువలోకి పారబోసి, ఖర్చులు కూడా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చలో విశాఖ డెయిరీ ఉద్రిక్తం

- పాల రైతులను ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు
- ఆరుగురు అరెస్టు

పాల రైతుల ప్రదర్శనను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

పాల రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ విశాఖ డెయిరీ పాల రైతుల సంఘం ఆధ్వర్యాన బుధవారం తలపెట్టిన చలో విశాఖ డెయిరీ కార్యక్రమం పోలీసుల చర్యతో ఉద్రిక్తంగా మారింది. తమ కష్టాలను చెప్పుకునేందుకు వచ్చిన పాల రైతులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఆరుగురిని అరెస్టు చేశారు. విశాఖ డెయిరీలో జరిగిన అవినీతిపై వేసిన హౌస్ కమిటీ విచారణ పూర్తి చేసి, దోషులను శిక్షించాలని, డెయిరీ ఆస్తులను కాపాడాలని, పాల సేకరణ ధర లీటర్‌కు కనీసం రూ.10 పెంచాలని, ప్రతి మూడు నెలలకూ బోనస్ ఇవ్వాలని, చనిపోయిన పాల రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర ప్రాంతంలోని పాల రైతులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. విశాఖ డెయిరీ మహాజన సభ షీలానగర్ ప్రాంతంలోని కృషి ఐకాన్ హాస్పిటల్ వెనుక జరుగుతుండటంతో అక్కడకు వెళ్లి వినతిపత్రం ఇచ్చేందుకు సిద్ధమయ్యారు.

షీలా నగర్ జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రహదారిపైనే పాల రైతులు ఆందోళనకు దిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నినాదాలతో హోరెత్తించారు. తమ కష్టాలను చెప్పుకునేందుకు పాల రైతులు పలుమార్లు ముందుకెళ్లగా రోప్ పార్టీతో పోలీసులు అడ్డగించారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణను అరెస్టు చేసి షీలానగర్‌లోని ఒక అపార్టుమెంట్ వద్ద గంటసేపు నిర్బంధించారు. ఈ వైఖరిని పాల రైతులు నిలదీశారు. అవినీతి చేసిన డెయిరీ యాజమాన్యాన్ని వదిలేసి, తమ నాయకున్ని ఎందుకు నిర్బంధించారని ప్రశ్నించడంతో పోలీసులు వెనక్కి తగ్గి సూర్యనారాయణను విడిచిపెట్టారు. తదుపరి మరోసారి రైతులు మహాజన సభ వద్దకు బయలుదేరగా ఎపి రైతు, పాల రైతు సంఘం నాయకులు సూర్యనారాయణ, కర్రి అప్పారావు, గొంప కృష్ణమూర్తి, నాయనబాబు, వెలమల రమణ, బుద్ధరాజు రాంబాబును అరెస్టు చేసి గాజువాక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం విడిచిపెట్టారు. తమ పోరాటాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించి డెయిరీ యాజమాన్యానికి పోలీసులు సహాయపడ్డారని రైతులు దుయ్యబట్టారు. డెయిరీలో జరుగుతున్న అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ బిజెపిలో చేరారని సూర్యనారాయణ విమర్శించారు. ఎంతటి నిర్బంధం విధించినా తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

అవినీతిపై విచారణ జరపాలి : ఎపి రైతు సంఘం

విశాఖ డెయిరీలో జరిగిన అవినీతి, అక్రమాలను అరికట్టాలని, డెయిరీలో అవినీతికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు వి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ధర్నా చేస్తున్న ఆంధ్రప్రదేశ్ పాలరైతుల సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. తక్షణమే అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని, విశాఖ డెయిరీ అక్రమాలను వెలికితీయాలని, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'దుర్గమ్మ'ను దర్శించుకున్న ఉప రాష్ట్రపతి దంపతులు

ప్రజాశక్తి- యంత్రాంగం

భారత ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ దంపతులు విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న కనక దుర్గమ్మను బుధవారం దర్శించుకున్నారు. వారికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం మీడియా పాయింట్‌లో ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విజయవాడ ఒకటన్నారు. ఇంద్రకీలాద్రికి చేరుకున్న ఉప రాష్ట్రపతి దంపతులకు రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్‌వి రాజశేఖర్‌బాబు, దేవాదాయ శాఖ కమిషనరు రామచంద్రమోహన్, విఎంసి కమిషనరు ధ్యానచంద్ర, దుర్గగుడి ఇఒ శీనా నాయక్ స్వాగతం పలికారు. అంతకుముందు గన్నవరం విమానాశ్రయంలో ఉప రాష్ట్రపతి దంపతులకు గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబునాయుడు, చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తదితరులు స్వాగతం పలికారు. విమానాశ్రయంలో పోలీసుల గౌరవవందనాన్ని ఉప రాష్ట్రపతి స్వీకరించారు.

విజయవాడ ఉత్సవ్‌లో..

విజయవాడ నగరంలోని పున్నమి ఘాట్లో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్‌లో బుధవారం ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ పాల్గొన్నారు. దుర్గమ్మ దర్శనం అనంతరం ఆయన పున్నమి ఘాట్‌కు వెళ్లారు. విజయవాడ ఉత్సవ్‌లో ఉప రాష్ట్రపతి తమిళంలో మాట్లాడారు. తెలుగు భాష సాహిత్య భరితమైందని, సంగీత భరితమైందని, అందుకే అందమైనదని కొనియాడారు. మహిళా శక్తిని గౌరవించడం భారతీయ సంప్రదాయమన్నారు. విద్య, వైద్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆంధ్రప్రదేశ్ వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. వికసిత భారత్ కల కాదని, నిజం అవుతుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో వికసిత ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు పడుతున్నాయని అన్నారు. విజయవాడ పున్నమి ఘాట్ వేదికపై ప్రముఖ కళాకారిణి పి.మానస ప్రదర్శించిన నృత్యాన్ని ఉప రాష్ట్రపతి తిలకించి ఆమెపై ప్రశంసలు కురిపించారు.

తిరుమలకు చేరిక..నేడు 'శ్రీవారి' దర్శనం

విజయవాడ నుంచి తిరుమల శ్రీవారి పర్యటన నిమిత్తం ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ రేణిగుంట విమానాశ్రయానికి బుధవారం రాత్రి చేరుకున్నారు. తిరుమల చేరుకున్న ఆయనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు స్వాగతం పలికారు. పద్మావతి అతిథి గృహంలో ఉప రాష్ట్రపతి బస చేశారు. గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

గుంటూరులో క్రమంగా పెరుగుతున్న డయేరియా

- కొత్తగా 50 కేసులు నమోదు!

ప్రజాశక్తి-గుంటూరు, మంగళగిరి

గుంటూరులో డయేరియా కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. చికిత్స తీసుకుంటున్న వారి పరిస్థితి నిలకడగానే ఉంటున్నా కొత్త కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. బుధవారం గుంటూరు నగరంలో మరో 50 కేసులు నమోదైనట్లు సమాచారం. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లోనే 17 కేసులు నమోదయ్యాయి. మిగతావి నగరంలోని వివిధ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో నమోదైనట్లు సమాచారం. ఈనెల 17 నుంచి ఇప్పటి వరకూ 185 కేసులు రిపోర్ట్ కాగా 104 మంది ఇంకా చికిత్స పొందుతున్నారు. 81 మంది డిశ్చార్జి అయ్యారు. అతిసార ప్రభావిత ప్రాంతాల్లో 50 వైద్య బృందాలు 3202 గృహాలను సర్వే చేశాయని డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ కె.విజయలక్ష్మి తెలిపారు. అతిసార లక్షణాలున్న 11 మందిని, జ్వరంతో ఉన్న నలుగురిని సర్వేలో గుర్తించి ఆస్పత్రికి సిఫార్సు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే కాకుండా ప్రైవేటు హాస్పిటల్స్‌లో పెద్ద సంఖ్యలో బాధితులు చికిత్స తీసుకుంటున్నారు. అయితే, వారి వివరాలు ప్రభుత్వం వెల్లడించడం లేదు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రగతి నగర్‌లో మెడికల్ కిట్లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిఎంసి మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం పంపిణీ చేశారు. యాదవ బజార్‌లోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి : సిపిఎం

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సిపిఎం డిమాండ్ చేసింది. కలరాతో ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ తదితరులు పరామర్శించారు. బాధితులతో మాట్లాడి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. నేతాజీ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాల వలన డయేరియా, కలరా బారినపడి అనేకమంది ఆస్పత్రి పాలవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని ప్రాంతాల్లో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్య మెరుగుదలకు వెంటనే చర్యలు చేపట్టాలని, డయేరియా, కలరా ఇతర ప్రాంతాలకు ప్రబలకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



నిమ్మల రామానాయుడు కుమార్తె వివాహానికి హాజరైన సిఎం చంద్రబాబు దంపతులు, మంత్రి లోకేష్

నిమ్మల కుమార్తె వివాహ వేడుకల్లో సిఎం దంపతులు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ వివాహ వేడుకకు సిఎం చంద్రబాబు దంపతులు, పలువురు మంత్రులు, ప్రముఖులు హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని బ్రాడీపేటలో నిర్వహించిన వివాహ వేడుకల్లో నూతన దంపతులకు సిఎం చంద్రబాబు, ఆయన భార్య భువనేశ్వరి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిమ్మల కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేశారు.

తొలుత హెలికాప్టర్‌లో పాలకొల్లు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు, వారి కుమారుడు, మంత్రి నారా లోకేష్‌కు మంత్రి నిమ్మల రామానాయుడు భారీ గజమాలతో స్వాగతం పలికారు.

జనాభాపై కాకి లెక్కలు

ఒక్కో శాఖది ఒక్కో లెక్క!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర జనాభా ఎంతన్నది స్పష్టంగా తేలని పరిస్థితి. ఒక్కో శాఖ ఒక్కో గణాంకాలతో ముందుకొస్తుండడంతో గందరగోళంగా మారుతోంది.ఎ . గ్రామ వార్డు సచివాలయాల ద్వారా నిర్వహించిన సర్వేలో ఒక లెక్క కనిపిస్తుండగా, ఉడాయ్ గణాంకాల్లో ఒకలా, ఆధార్ లెక్కల్లో ఇంకొకలా, ప్రణాళిక శాఖ అధికారిక గణాంకాల్లో ఇంకొకమాదిరిగా జనాభా కనిపిస్తోంది. అయితే, ఎన్ని గణాంకాలు మారినా కూడా రాష్ట్ర జనాభా ఐదు కోట్లకు పైగానే ఉన్నట్లు స్పష్టమవుతోంది.ఏ పథకాన్ని అమలు చేయాలన్నా కూడా వాస్తవంగా ఎంత జనాభా ఉందన్నది విస్పష్టంగా తేలాల్సి ఉంటుంది. అందులో భాగంగానే ఏ వర్గానికి ఏయే పథకాలు ఇస్తున్నామన్న లెక్కలను కూడా తేలుస్తారు. ప్రధానంగా జనాభా లెక్కలు తేల్చేంపదుకు పదేళ్లకు ఒకసారి నిర్వహించే జనగణన కీలకం కాగా మధ్యలో భిన్న సర్వేల ద్వారా లెక్కలు గుర్తిస్తారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ద్వారా ఒక్కో కుటుంబంలో ఎంత మంది నమోదై ఉన్నారన్న లెక్కలు ఖరారు చేస్తారు. అలాగే ప్రణాళిక శాఖ, ఆధార్ వంటి ఇతర విభాగాల ద్వారా కూడా జనాభాపై లెక్కలను గుర్తిస్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారం విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 4.95 కోట్లమంది జనాభా ఉన్నట్లు తేల్చారు. కాగా రేషన్ కార్డుల సర్వే ఆధారంగా రాష్ట్రంలో మొత్తం 1.71 కోట్ల కుటుంబాలు ఉండగా, అందులో 1.47 కోట్ల కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. అంటే మొత్తం 1.71 కోట్ల కుటుంబాల్లో కుటుంబానికి సగటున మూడు నుంచి నలుగురు ఉంటారని భావించినా దాదాపు 5.15 కోట్ల మంది జనాభా ఉంటారని అంచనా వేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. తాజాగా నెల రోజులపాటు నిర్వహించిన ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో ఎంత మంది ఉన్నారు, వారిలో ఎంతమంది యోగా కార్యక్రమానికి హాజరయ్యారన్నదానిపై గ్రామ, వార్డు సచివాయలాల ద్వారా నిర్వహించిన ఒక సర్వేలో 5.11 కోట్ల మంది జనాభా ఉన్నట్లు పేర్కొనడం విశేషం. కేంద్రం నిర్వహించిన ఉడాయ్ (యూనిక్ ఐడెంటిఫికేషన్ ఆథారిటీ ఆఫ్ ఇండియా) కార్యక్రమం మేరకు రాష్ట్రంలో 5.35 కోట్ల మంది జనాభా ఉన్నట్లు తేల్చారు. అదే రాష్ట్రంలో పలు కార్యక్రమాల అమలు కోసం చేసిర ఆధార్ సర్వే మేరకు 5.74 కూట్ల మంది ఉన్నట్లు తేలింది.

పలు విభాగాల గణాంకాల్లో ఉన్న జనాభా వివరాలు

విభాగం	జనాభా
2011 గణన మేరకు	4,95,77,103
యోగా గణన	5,01,11,738
రేషన్ కార్డుల ద్వారా	5,15,59,669
ఉడాయ్	5,35,24,000
ప్రణాళికశాఖ	5,36,00,000
ఆధార్ మేరకు	5,74,58,462

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న

స్పెషల్ డిఎస్‌సి కోసం ధర్నా

- కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ అభ్యర్థులు ధర్నా చేశారు. 2,260 స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా మాత్రమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు బిర్లాగెట్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన ధర్నాలో డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న మాట్లాడుతూ... జిఒ నంబర్ 13 ప్రకారం 2,260 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులకు తక్షణమే సిలబస్ ప్రకటించి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2025 జులై 15 లోపు స్పెషల్ ఎడ్యుకేషన్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత 20 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ బిఇడి, డిఇడి చేసిన నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. స్పెషల్ డిఎస్‌సి విడుదల చేస్తూ అసెంబ్లీ సమావేశంలో విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే రోజుల్లో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, నగర కార్యదర్శి హుస్సేన్‌బాష, ఉపాధ్యాయ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య బీమా సంస్థలపై

పాలసీదారుల ఆగ్రహం

న్యూఢిల్లీ : అనారోగ్యం పాలయినప్పుడు అత్యవసర సమయంలో వైద్య బీమా ఉంటే ఎంతో ధీమాగా ఉంటుందని పాలసీలు కొనుగోలు చేసిన వారికి అంతిమంగా నిరాశనే ఎదురవుతోంది. హాస్పిటల్‌లో చేరిన తర్వాత అడ్డగోలు షరతులు పెట్టి.. బీమా వర్తింపునకు సంబంధిత సంస్థలు మోకాలడ్డు వేస్తోన్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. వైద్య బీమా కంపెనీలపై ఫిర్యాదులు దాదాపు రెట్టింపు కావడమే ఇందుకు నిదర్శనం. ఈ ఏడాది జూన్‌తో ముగిసిన రెండవ త్రైమాసికంలో బీమా ఉత్పత్తులపై ఫిర్యాదులు 45 శాతం పెరిగాయని.. ఇందులో ఎక్కువగా ఆరోగ్య బీమా పాలసీలపైనే ఉన్నాయని 'ఇన్సూరెన్స్ సమాధాన్' తన 2025 రిపోర్ట్‌లో వెల్లడించింది. బీమా రంగంలోని తీరుతెన్నులను విశ్లేషిస్తూ ఆ సంస్థ ఓ నివేదికను విడుదల చేసింది. ఆ వివరాలు.. ఫిర్యాదులు దాఖలు చేయడంలో 31 నుండి 40 సంవత్సరాల వయస్సు గల పాలసీదారులు అత్యంత చురుకుగా ఉన్నారు. దేశంలోఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 16 శాతం ఫిర్యాదులు చోటు చేసుకున్నాయి. పాలసీదారులకు తప్పుగా విక్రయించడం, క్లెయిమ్ వివాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది మార్చితో ముగిసిన మొదటి త్రైమాసికంలో 684 ఫిర్యాదులు నమోదు కాగా, రెండవ త్రైమాసికంలో 974 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఇది 45 శాతం పెరుగుదల. వివాదాస్పద క్లెయిమ్‌ల విలువ రూ.83.5 కోట్ల నుండి రూ.119.5 కోట్లకు పెరిగింది. ఇది 43 శాతం కంటే ఎక్కువ పెరగడం ఆందోళనకరం.

తప్పుగా విక్రయించడం..

తప్పు దారి పట్టించే బీమా ఉత్పత్తుల విక్రయాలపై ఫిర్యాదులు 11.2 శాతం పెరిగాయి. ఇందులో ఆరోగ్య బీమా ఫిర్యాదులు 68 శాతం పెరగ్గా.. జీవన బీమాపై 25.5 శాతం, సాధారణ బీమాపై 6.9 శాతం చొప్పున ఫిర్యాదులు పెరిగాయి. ఎండోమెంట్ పాలసీలు అత్యంత తప్పుగా విక్రయించిన వాటిలో ఎక్కువగా ఉన్నాయి. ఇవి పాలసీదారులను జరిమానాలు, తక్కువ రాబడి, మూలధన క్షీణతకు గురిచేస్తున్నాయని పాలసీదారులు ఫిర్యాదు చేశారు. పాలసీదారులు, ముఖ్యంగా యువ తరాలు, తమ హక్కుల కోసం నిలబడుతున్నారని ఇన్సూరెన్స్ సమాధాన్ సహవ్యవస్థాపకురాలు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శిల్పా అరోరా తెలిపారు. ఏజెంట్లపై అధిక కమిషన్లు, విక్రయ ఒత్తిడి కారణంగా తప్పుదారి పట్టించే విక్రయ ఫిర్యాదులు పెరుగుతున్నాయన్నారు.

ఆటో కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - విజయవాడ :

ఉచిత బస్సు పథకంతో కిరాయిలు కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో విజయవాడకు చెందిన ఓ ఆటో కార్మికుడు..ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల కథనం మేరకు..అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన పసుపులేటి సుబ్బారావు (23) ఆటో నడుపుకుండా జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య ధరణితోపాటు 18 నెలల బాబు ఉన్నాడు. సత్యనారాయణపురంలోని ఓ ఫైనాన్సర్ వద్ద ఆటోపై రూ.45 వేల రుణం తీసుకున్నారు. చక్రవడ్డీతో కలిపి రూ. లక్ష చెల్లించాలని, డబ్బులు చెల్లించకపోతే ఆటో స్వాధీనం చేసుకుంటానని ఫైనాన్సర్ వేధింపులకు పాల్పడ్డాడు. ఉచిత బస్సు పథకంతో కిరాయిలు తగ్గిపోవడంతో కిస్తీలు కూడా కట్టలేని పరిస్థితికి సుబ్బారావు వచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు.

సిపిఎం, సిఐటియు నేతల పరామర్శ

సుబ్బారావు మృతదేహాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు కె దుర్గారావు బుధవారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ. పది లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.

నెలఖారు కల్లా దేశ వ్యాప్తంగా

బిఎస్‌ఎన్‌ఎల్ 4జి సేవలు

- సిఎండి రాబర్ట్ జె రవి వెల్లడి

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ టెలికం కంపెనీ బిఎస్‌ఎన్‌ఎల్ విస్తరణలో దూకుడుగా వ్యవహరిస్తోంది. వినియోగదారులకు మెరుగైన నెట్‌వర్క్ అందించడానికి వేగంగా చర్యలు తీసుకుంటుంది. ప్రస్తుత సెప్టెంబర్ నెలాఖరు కల్లా దేశ వ్యాప్తంగా 4జిని పూర్తిగా అమలు చేసి, తమ వినియోగదారులందరికీ అప్‌గ్రేడ్ చేసిన నెట్‌వర్క్‌ను అందజేయనున్నామని బిఎస్‌ఎన్‌ఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ రాబర్ట్ జె రవి తెలిపారు. "సెప్టెంబర్ 27న దేశవ్యాప్తంగా 4జి స్వదేశీ సాంకేతికతను ప్రారంభిస్తున్నాము" అని రవి భారత్ డిజిటల్ ఇన్‌ఫ్రా సమ్మిట్ 2025లో వెల్లడించారు. ఆగస్టు 15న ఢిల్లీలో 4జి సేవలను అందుబాటులోకి తెచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సేవల కోసం ఇప్పటివరకు ఒక లక్ష మొబైల్ టవర్లను ఏర్పాటు, అప్‌గ్రేడ్ చేసింది. తన నెట్‌వర్క్ సామర్థ్యాన్ని మరింత పెంచి 5జి సేవలను అందించడానికి రూ.47,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టాలని యోచిస్తోంది. బిఎస్‌ఎన్‌ఎల్ 2024 జులై- సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.280 కోట్లు, అక్టోబర్ డిసెంబర్ త్రమైఆసికంలో రూ.280 కోట్ల నికర లాభాలను సాధించింది.

జెన్‌కో విద్యుదుత్పత్తికి ప్రాధాన్యత : ఎమ్‌డి నాగలక్ష్మి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి జెన్‌కో ఆధ్వర్యాన ఉన్న థర్మల్, జల, సౌర విద్యుదుత్పత్తికి అధిక ప్రాధాన్యత ఇస్తామని జెన్‌కో ఎమ్‌డి ఎస్ నాగలక్ష్మి తెలిపారు. జెన్‌కో ఎమ్‌డిగా విజయవాడలోని విద్యుత్‌సౌధలో బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జెన్‌కో డైరెక్టర్లు సుజయ్‌కుమార్, పి అశోక్‌కుమార్ రెడ్డి, వి ఉష, ఎపిపిడిసిఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావుతో సమావేశం నిర్వహించారు. జెన్‌కో యూనిట్ల నుంచి గరిష్ఠ విద్యుదుత్పత్తి సాధించేందుకు చర్యలు తీసుకోవాలని నాగలక్ష్మి చెప్పారు. నూతనంగా రాబోతున్న ప్రాజెక్టులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల పునరుద్ధరణ, ఆధునీకరణకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

దలాల్ స్ట్రీట్ నేల చూపులు

- నాలుగో రోజూ మార్కెట్ల పతనం

ముంబయి : దలాల్ స్ట్రీట్‌లో తీవ్ర నిరాశలు నెలకొన్నాయి. వరుస అమ్మకాల ఒత్తిడితో మార్కెట్లు నేల చూపులు చూస్తున్నాయి. ట్రంప్ టారిఫ్‌లు, హెచ్1బి వీసాలపై ఆందోళనలు ఇన్వెస్టర్లను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో వరుసగా నాలుగో రోజూ సూచీలు పతనమయ్యాయి. ముఖ్యంగా ఫైనాన్షియల్, ఐటి షేర్లు అమ్మకాల ఒత్తిడితో బుధవారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 386 పాయింట్లు లేదా 0.47 శాతం కోల్పోయి 81,716కు పడిపోయింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 113 పాయింట్లు లేదా 0.45 శాతం తగ్గి 25,057కు పరిమితమయ్యింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, బిఇఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు అధిక నష్టాలను చవి చూడగా.. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్‌టిపిసి, మారుతీ సుజుకీ, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభపడిన వాటిలో ఉన్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 0.98 శాతం, స్మాల్ క్యాప్ 0.67 శాతం చొప్పున నష్టపోయాయి.

ఈ ఏడాది 6.5 శాతం వృద్ధి : ఎస్‌అండ్‌పి అంచనా

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 6.5 శాతంగా కొనసాగవచ్చని గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ ఎస్‌అండ్‌పి అంచనా వేసింది. దేశీయ డిమాండ్, సాధారణ సానుకూల రుతుపవనాలను జిడిపికి మద్దతును ఇవ్వొచ్చని పేర్కొంది. ఆర్‌బిఐ మరో పావు శాతం వడ్డీ రేట్లను తగ్గించొచ్చని అంచనా వేసింది. ద్రవ్యోల్బణం 3.2 శాతంగా ఉండొచ్చని తెలిపింది. తక్కువ ద్రవ్యోల్బణం వడ్డీ రేట్ల కోతకు మద్దతును ఇవ్వొచ్చని తెలిపింది.

సంపాదకీయం

అర్థరహితం

వీటో అధికారంతో, కండబలంతో ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలకు ఆజ్యం పోస్తున్న అమెరికా, దాని అధ్యక్షుడు ట్రంప్... యుద్ధాలను తానే ఆపానంటూ గొప్పలు చెప్పుకోవడం అర్థరహితం, అనుచితం. ఐక్యరాజ్య సమితి 80వ వార్షికోత్సవ సమావేశాలు వేదికగా... ఏడు యుద్ధాలను ఆపానని చెప్పుకుంటూ... ఈ అంతర్జాతీయ సంస్థ యుద్ధాలను ఆపడానికి ఏమి చేసిందంటూ హూంకరించారు. ప్రపంచ శాంతికి పెద్దదిక్కుగా ఉన్న ఐరాసను అన్ని విధాలా బలహీనపరుస్తూ... అక్కడి తీర్మానాలకు పూచిక పుల్ల విలువ కూడా ఇవ్వకుండా చేస్తున్న పెద్దమనిషే ఈ వ్యాఖ్యలు చేయడం మరింత ఆందోళనకరం.

నానాజాతి సమితి 26 ఏళ్లకే అంతర్ధానం కాగా, ఆ స్థానంలో ఆవిర్భవించిందే ఐరాస. పూర్తిస్థాయిలో జవజీవాలు నింపుకుంటామంటూ 'యుఎన్ 80 ఇనీషియేటివ్' పేరుతో ఈ ఏడాది ఒక కార్యక్రమాన్ని కూడా ప్రారంభించింది. అది ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా... అడ్డుకుంటున్నది సంపన్న దేశాలే. ప్రపంచ పెద్దనంటూ పెత్తనం చేస్తున్న అమెరికాసహా 118 దేశాలు తమ చందాలను పూర్తిగా చెల్లించకపోవడం, సకాలంలో అందజేయకపోవడం వల్ల గత ఏడేళ్లుగా తీవ్ర ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ ఏడాది మార్చి 11 నాటికి తమ వంతు మొత్తం సొమ్మును చెల్లించింది 193 సభ్య దేశాల్లో 75 దేశాలే!

ట్రంప్ ఆపానంటూ గొప్పలు చెప్పుకున్న వాటిలో మొదటిది ఇండియా - పాక్ యుద్ధమే. దీనిని పాక్ అంగీకరిస్తుండగా, మన విదేశాంగ శాఖ అంగీకరించడం లేదు. విశ్వగురుగా చెప్పుకునే ప్రధాని మోడీ మౌనముద్ర పాటిస్తున్నారు. ఇక మిగిలిన వాటిలో ఇజ్రాయిల్ - ఇరాన్ యుద్ధం ఒకటి.

గాజా నుంచి ఇరాన్‌కు యుద్ధాన్ని విస్తరించేందుకు ఇజ్రాయిల్‌ను అనుమతించింది, పూర్తిస్థాయి ఆయుధ, ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నదే అమెరికా. స్వయంగా ఇరాన్ అణు కేంద్రాలపై నేరుగా బాంబుల వర్షం కురిపించింది ట్రంప్ ఏలుబడిలోనే. ఈ అండదండలు చూసుకునే అమెరికా మిత్ర దేశం ఖతార్ రాజధాని దోహాపై సైతం ఇజ్రాయిల్ దాడికి తెగించి, యుద్ధాన్ని విస్తరించింది. నాటో తరహాలో అరబ్ దేశాలు కూటమిగా ఏర్పడాలనే ప్రయత్నాలకు బీజం వేసింది ఈ పరిణామమే. ఇక గాజాలో పాలస్తీనా పౌరులను ముఖ్యంగా చిన్నారులు, మహిళల ఊచకోతకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌పై ప్రపంచమంతా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నా అన్ని అండదండలు అందిస్తోంది అమెరికాసహా పాశ్చాత్యదేశాలే. ఇజ్రాయిల్, పాలస్తీనా ఉండాలన్న రెండు దేశాల వైఖరికి మద్దతిస్తున్న దేశాల సంఖ్య పెరుగుతున్నా... వీటో చేస్తోంది అమెరికానే. ఇక ట్రంప్ ఆపినట్లు ప్రకటించిన యుద్ధాలన్నీ చిన్నచిన్న దేశాల మధ్య సరిహద్దు సమస్యలు, అంతర్గత సంక్షోభాలనే. ఒకవైపు నిధుల లేమితో సతమతమవుతున్న ఐరాసకు... మరో వైపు వీటో అధికారాన్ని దుర్వినియోగం చేయడం ద్వారా దాని శాంతి యత్నాలకు అడుగడుగునా సంకెళ్లు వేస్తున్నది అగ్రరాజ్యమే. ఇలా ఐరాసను కట్టిపడేసి డొల్ల సంస్థగా ఉందని, బలాన్ని ప్రదర్శించడం లేదని, నిర్వీర్యమైపోయిందని, ఉత్త మాటలతో సమస్యలు పరిష్కారమవుతాయా? లాంటి వ్యాఖ్యలు చేయడం... దాని యుద్ధకాంక్షకు అన్ని సందర్భాల్లోనూ ఐరాస వంతపాడటం లేదని, వ్యతిరేకంగా తీర్మానాలు చేసేందుకు ప్రయత్నిస్తోందనే అక్కసే. ట్రంప్ ఇన్ని తీవ్ర విమర్శలు చేస్తున్నా... శాంతి, సామరస్యాలే ప్రపంచ అభివృద్ధికి సోపానాలు అని ఐక్యరాజ్య సమితి జనరల్ సెక్రటరీ ప్రకటించడం ఆహ్వానించదగ్గ పరిణామం.

తప్పుడు ఆరోపణలు చేసి వెనిజులాను యుద్ధ నౌకలతో దిగ్బంధించడం, ఎయిర్ బేస్ ఇవ్వకపోతే యుద్ధం చేస్తానని ఆఫ్ఘనిస్థాన్‌ను హెచ్చరించడం, తన మిత్రదేశమైన డెన్మార్క్ గ్రీన్ లాండ్ ఇవ్వకపోతే యుద్ధం చేసైనా ఆక్రమిస్తానని ప్రకటించడం యుద్ధాలను ఆపడమా? అన్న ప్రశ్నకు బదులివ్వాల్సింది ట్రంపే. తైవాన్‌కు ఆయుధాలిస్తూ, ఇప్పుడు ఆఫ్ఘనిస్థాన్‌లో యుద్ధాన్ని రాజేయడం చైనాను సైతం యుద్ధంలోకి దింపడమే. అంతర్జాతీయ న్యాయాన్ని కాపాడటం కోసం ఏర్పాటుచేసిన ఐరాస సంస్థలే చట్టవిరుద్ధమని అమెరికా, ఇజ్రాయిల్ నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నాయి. ప్రపంచంలో సగానికిపైగా జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్న బ్రిక్స్ ప్లస్ కూటమి, షాంఘై సహకార సంస్థ లాంటివి మరింతగా బలపడటం అవసరం. సభ్యదేశాలన్నింటికీ సమానంగా అధికారాలు లేకపోవడం వల్లే అంతర్జాతీయ శాంతిని, భద్రతను పరిరక్షించడంలో ఐరాస విఫలమవుతుతోంది. ఐరాస, దాని అనుబంధ సంస్థలను తక్షణమే ప్రజాస్వామీకరించాలి. రష్యా నుంచి చమురు కొనుగోలు, సుంకాలు, వలసలు తదితర అంశాలపై ఐరాస వేదికగా మనదేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ట్రంప్ వ్యాఖ్యలు చేసిన తరువాతనైనా మనదేశ వైఖరిని పునరాలోచించుకోవడం అవసరం. ఐరాస ప్రజాస్వామికీకరణలో భాగస్వాములుగా మారాల్సిన బాధ్యత మన దేశానికి ఉంది.

మహనీయుల మాట

ఒక రాజకీయవేత్త తరువాతి ఎన్నికల గురించి ఆలోచిస్తాడు. రాజనీతిజ్ఞుడు తరువాతి తరం గురించి ఆలోచన చేస్తాడు.

- జేమ్స్ ఫ్రీమేన్ క్లార్కే
అమెరికా రాజకీయవేత్త.

విశ్లేషణ

పిపిపి మెడికల్ కాలేజీలు - ప్రమాదకర విధానం

డా.బి.గంగారావు

రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వైద్య రంగంలో ప్రమాదకర ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పిపిపి) విధానానికి తెర లేపింది. గత వైసిపి ప్రభుత్వంలో మంజూరయిన 10 ప్రభుత్వ వైద్య కళాశాలలు వీటికి అనుబంధంగా ఏర్పడే ఆసుపత్రులను ప్రవేట్ సంస్థల ఆధీనంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం మీద విమర్శలు గుప్పిస్తూ ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను ప్రైవేట్ శక్తుల చేతుల్లో పెట్టబోతున్నది.

వైసిపి ప్రభుత్వ కాలంలో మంజూరైన 17 వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పిపిపి పద్ధతిలో రూ.8548 కోట్ల నిధులు ఆమోదించగా కేవలం నాలుగేళ్లలో రూ.2225 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి ఐదు కళాశాలలనే అరకొరగా పూర్తి చేసిందని చంద్రబాబు ప్రభుత్వం విమర్శిస్తున్నది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కూటమి ప్రభుత్వం పిపిపి విధానాన్ని వైద్య రంగంలో అమలుకు పూనుకుందని చెబుతూనే ఈ విధానం ఎంతో గొప్పదని, ప్రజలకు చాలా మేలు కలుగుతుందని ప్రచారం చేస్తున్నది. పైపెచ్చు పిపిపి అంటే ప్రైవేటీకరణ కాదని కొత్తగా నిర్మిస్తున్న వైద్య కళాశాలలు, ఆసుపత్రులు అన్నీ ప్రభుత్వ అజమాయిషీలోనే ఉంటాయని, కావాలనే ప్రతిపక్ష పార్టీలు బురద జల్లుతున్నాయని ప్రజలను నమ్మించటానికి ప్రయత్నం చేస్తున్నది.

పిపిపి విధానాన్ని రాష్ట్రంలో ప్రజలు, అన్ని పక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. నిరసనలు, ఆందోళనలు సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల్సింది పోయి చాలా దౌర్జన్య పూరితంగా వ్యవహరిస్తున్నది. దేశంలో జాతీయ రహదారులన్నీ పిపిపి పద్ధతిలో ఉన్నాయని, అవి ప్రైవేటు వారి చేతుల్లోకి వెళ్ళలేదు కదా అని ముఖ్యమంత్రి ఏకంగా అడ్డగోలు వాదనలు చేస్తున్నారు. మొత్తం 10 వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టటానికి రాష్ట్ర కూటమి ప్రభుత్వం వేగంగా చర్యలు ప్రారంభించింది. ఒక్కో మెడికల్ కాలేజీలో 150 ఎంబిబిఎస్, 24 పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్ల ప్రాతిపదికన, 625 పడకల సామర్థ్యంగల ఆసుపత్రి నిర్మాణంతో మొదటి దశగా మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో ఇవ్వటానికి ప్రైవేటు సంస్థలను ఆహ్వానిస్తూ టెండర్ల ప్రకటన కూడా ప్రభుత్వం విడుదల చేసింది. పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం వైద్య కళాశాలలకు రెండో దశలో టెండర్లను పిలవడానికి ప్రయత్నం చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది.

టెండర్లలో పేర్కొన్న ఒప్పంద పత్రాన్ని పరిశీలిస్తే పిపిపి విధానం ఎంత ప్రమాదకరమో, ప్రజావనరులను ఈ ప్రభుత్వం తమకు కావలసిన వారికి ఎలా ధారాదత్తం చేస్తున్నదో అర్థమౌతుంది. ఒప్పంద పత్రంలో ప్రతిపాదిత అంశాలు 1. ఒప్పంద కాలపరిమితి 66 ఏళ్లు 2. ఏడాదికి ఎకరానికి లీజు కింద రూ.100 చొప్పున కాంట్రాక్టర్ ప్రభుత్వానికి చెల్లించాలి. 3. మొత్తం 625 పడకలలో 70 శాతం ఆరోగ్యశ్రీ కార్డు కలిగి ఉన్న వారికి కేటాయించాలి. వీరికి సెలెక్ట్ పేషంట్స్ అని పేరు పెట్టారు. 4. మిగిలిన 30 శాతం బెడ్ లను కమర్షియల్‌గా వినియోగించుకొని కార్పొరేట్ ఫీజులు వసూలు చేసుకోవచ్చు. 5. ఒప్పందం అయిన ఒక ఏడాది కాలంలో 100 ఎంబిబిఎస్ సీట్లతో కాలేజీని ప్రారంభించాలి. 6. మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యే వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఐదేళ్ల వరకు లేదా ఆసుపత్రి నిర్మాణం అయిన తరువాత జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం 80 శాతం పడకలు పేషెంట్లతో నిండేదాకా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రైవేట్ సంస్థ ఆధీనంలో ఉంటుంది. 7. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ప్రైవేట్ సంస్థకు ఇస్తూ ప్రభుత్వం ఒప్పందం చేస్తుంది. 8. సెలెక్ట్ పేషెంట్స్ కేటగిరీలో ఆసుపత్రిలో చేరి (ఇన్ పేషెంట్‌గా) వైద్యం లేదా శస్త్ర చికిత్సలు చేసుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ లేదా సిజిహెచ్ లేదా ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (పిఎంజెఎవై) రేట్లు ప్రకారం కాంట్రాక్టర్లకు ఫీజులు చెల్లిస్తుంది. 9. ప్రతి మూడేళ్లకు ఒకసారి డయాగ్నస్టిక్ చార్జీల రేట్లు, ఏడేళ్లకోసారి మిగిలిన అన్ని రకాల వైద్య, శస్త్ర చికిత్సల చార్జీలు పెంచుతుంది. 10. ఆరోగ్యశ్రీ కార్డ్ ఉన్న వారికి మాత్రమే ఉచితంగా వైద్యం చేయబడుతుంది. ఈ కేటగిరీలో పేషెంట్లకు శస్త్ర చికిత్సలు చేయాలంటే ముందుగా ప్రభుత్వం అనుమతి మంజూరు చేయాలి. 11. రక్త పరీక్షలు, పాథాలజీ, రేడియోలజీ వంటి పరీక్షలకు చార్జీలు చెల్లించాలి. 12. ఔట్ పేషెంట్ (ఓ.పి) లకు మాత్రమే ఉచితంగా వైద్యం చేస్తారు. 13. జనరిక్ మందులు మాత్రమే ఉచితంగా ఇవ్వాలి. 14. మెడికల్ కాలేజీతో పాటు నర్సింగ్, పారా మెడికల్, ఇతర అనేక రకాల మెడికల్ ట్రైనింగ్ కాలేజీలు కాంట్రాక్టర్ నెలకొల్పుకోవచ్చు. 15. మెడికల్ సీట్ల ఫీజులు ప్రభుత్వం నిర్ణయిస్తుంది.

> పిపిపి విధానం ప్రస్తుత 10 ప్రతిపాదిత ప్రభుత్వ వైద్య కళాశాలలకే పరిమితం కాదు. మిగిలిన 7 మెడికల్ కాలేజీలను కూడా త్వరలోనే ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పనున్నారు. అంతే కాదు, ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న వైద్య కళాశాలలన్నింటిని కూడా ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తారు. జిల్లా కేంద్రాల్లో ఉండే ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాంతీయ ఆసుపత్రులు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలన్నీ దశలవారీగా ప్రైవేట్ సంస్థలకి కట్టబెడతారు. ఇక కొత్తగా స్థాపించే ఆసుపత్రులు కూడా పిపిపి పద్ధతిలోనే చేపడతారు. మొత్తం ప్రభుత్వ ఆధీనంలో నడిచే వైద్య విద్య, ఆసుపత్రులు ఇతర అన్ని రకాల ఆరోగ్య సేవల నిర్వహణ బాధ్యత నుండి రాష్ట్ర ప్రభుత్వం తప్పుకొని ప్రైవేట్ సంస్థల పరం చేస్తోంది.



ఈ విధానంతో ప్రభుత్వం అందరికీ ఉచిత వైద్యం అందించాలనే బాధ్యత నుండి వైదొలుగుతున్నది. ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు అందిస్తున్న సేవలకు భిన్నంగా ఇవి ఉంటాయి. ప్రభుత్వ వైద్య సేవలు పొందటానికి మొదటిసారిగా ప్రభుత్వం ప్రజలను రెండు రకాలుగా విభజిస్తున్నది. ఆరోగ్యశ్రీ కార్డ్ ఉంటేనే ఉచితంగా పరీక్షలు, శస్త్ర చికిత్సలు, బెడ్ లేదా ఇన్ పేషెంట్ వైద్యం కోసం చేర్చుకుంటారు. ఒకవేళ పేదవాళ్ళయి ఆరోగ్యశ్రీ కార్డు లేక పోతే వారికి ఉచితంగా వైద్యం చేయరు. ప్రభుత్వం సకాలంలో వైద్య బిల్లులు కాంట్రాక్టర్‌కి చెల్లించకపోతే కాంట్రాక్టర్ ఉచిత వైద్యాన్ని నిలిపి వేయొచ్చు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వైద్య బిల్లులు చెల్లించటం లేదని ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటళ్లు తరచూ ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలు నిలిపివేస్తున్న విషయం తెలిసిందే. ప్రమాదానికి గురై చావు బతుకుల్లో ఉన్న వ్యక్తికి ఎమర్జెన్సీగా వైద్యం చేయరు. ప్రభుత్వం నుండి ఆమోదం వచ్చిన తరువాతే వైద్యం చేస్తారు. లేకపోతే కార్పొరేట్ ఫీజులు చెల్లించుకోవాలి. ఈ 10 చోట్లా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేట్ వ్యక్తుల పరం చేయనున్నారు. ఒకవేళ 625 బెడ్ల సామర్థ్యం నుండి 1000 బెడ్లకు ఆసుపత్రి విస్తరణ జరిగితే దానికి అనుగుణంగా పెరిగిన బెడ్‌లలో 70 శాతం సెలెక్ట్ పేషెంట్లకు కేటాయించరు. అవన్నీ కమర్షియల్ కింద కార్పొరేట్ ఫీజులు వసూలుకు ఉపయోగించుకుంటారు. సెలెక్ట్ పేషెంట్లకు కూడా యూజర్ చార్జీలు విధించొచ్చు.

కేంద్ర బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు పిపిపి పద్ధతిలో వందల వైద్య కళాశాలలు మంజూరు చేసింది. ఆంధ్ర రాష్ట్రానికి 17 కేటాయించింది. వీటిని పిపిపి పద్ధతిలోనే, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్మాణాలు, ఆపరేషన్, మెయింటినెన్స్ ఉండాలని షరతు విధించింది. ఒక్కో వైద్య కళాశాలకు దాని అనుబంధ ఆసుపత్రి నిర్మాణానికి సుమారు రూ.500 కోట్లు ప్రాజెక్టు వ్యయంగా నిర్ణయించారు. ఇందులో 40 శాతం చొప్పున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు (200౦200 కోట్లు) రూ.400 కోట్లు భరించాలి. మిగిలిన రూ. 100 కోట్లు పిపిపి పద్ధతిలో ప్రైవేట్ సంస్థల నుండి సేకరించాలి. అయితే కారణాలేమైనా వీటిని కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పిపిపి పద్ధతిలో కాకుండా గత రాష్ట్ర ప్రభుత్వమే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నిర్మించటానికి పూనుకుంది. ఈ వైద్య కళాశాలకు అవసరమైన భూములు కేటాయించినప్పటికి, నాబార్డు నుండి ఆసుపత్రుల నిర్మాణానికి కొంత రుణం మంజూరు అయినప్పటికినీ వీటిని సకాలంలో పూర్తి చేయడానికి తీవ్ర నిర్లక్ష్యం వహించింది. పూర్తయిన కళాశాలలు దానికి అనుబంధంగా ఉన్న ఆసుపత్రులు కూడా అరకొరగానే పూర్తి చేసింది. కేవలం ఆరు వైద్య కళాశాలల్లోనే అడ్మిషన్లు, ఆసుపత్రి సేవలు ప్రారంభమయ్యాయి.

అయితే ఆ కాలేజీలకు మంజూరైన ఎంబిబిఎస్ మెడికల్ సీట్ల భర్తీ మాత్రం... కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన విధంగా జీవో నెం 107, 108 విడుదల చేసి... సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లుగా భర్తీకి గత ప్రభుత్వం పూనుకుంది. మేనేజ్‌మెంట్ కోటా సీటుకి రూ.12 లక్షలు, ఎన్ఆర్ఐ కోటా సీటుకి ఏడాదికి రూ.20లక్షల చొప్పున నిర్ణయించి అమలుకు పూనుకుంది. కన్వీనర్ కోటాను కుదించడంతో పాటు జనరల్ కేటగిరి సీట్లకు కూడా భారీగా ఫీజులు నిర్ణయించింది. ఈ పద్ధతిని ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అధికారంలోకి వస్తే ఈ పద్ధతిని, సెల్ఫ్ ఫైనాన్స్ ఫీజులను పూర్తిగా రద్దు చేస్తామని, ఈ కళాశాలలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహణ చేపడుతుందని ప్రచారం చేసింది. పూర్తి కాని కళాశాలలను, ఆసుపత్రులను కూడా ప్రభుత్వమే పూర్తి చేసి ప్రభుత్వమే నిర్వహిస్తుందని వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకిచ్చిన వాగ్దానానికి తిలోదకాలిచ్చి సెల్ఫ్ ఫైనాన్స్ పద్ధతి రద్దు చేయకుండా గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగిస్తూ వైద్య విద్యార్థులపై తీవ్ర భారానికి నిస్సిగ్గుగా జై కొట్టింది. భవిష్యత్తులో కన్వీనర్ కోటా సీట్లు తగ్గిపోయి క్రమేణా సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లుగా మారిపోనున్నాయి. దీంతో సామాన్య, పేద, దిగువ తరగతి విద్యార్థులు మంచి ర్యాంకులు సంపాదించినా భారీ ఫీజులు చెల్లించుకోలేక వైద్య విద్యకు దూరమవుతారు.

దేశ వ్యాప్తంగా వైద్య రంగంలో 2020 నుండి కేంద్ర బిజెపి ప్రభుత్వం పిపిపి విధానాన్ని అమలు చేసేందుకు పూనుకుంది. ఈ విధానం ఇప్పటి వరకు అనుసరిస్తున్న విధానానికి పూర్తిగా భిన్నమైంది. 2020 వరకు దేశంలో ప్రభుత్వ, ప్రవేట్ వైద్య కళాశాలలే ఉండేవి. ఈ నూతన పిపిపి విధానంలో ప్రభుత్వమే ప్రైవేట్ సంస్థలకు వైద్య కళాశాలల స్థాపనకు అన్ని సదుపాయాలను సమకూరుస్తుంది. దీనికి మౌలిక సదుపాయాల కల్పనలో వైబులిటీ గ్యాప్ ఫండ్స్ (వైజిఎఫ్) అనే పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా చేపట్టే మౌలిక సదుపాయాలు అన్నీ పిపిపి లో ప్రైవేట్ సంస్థల ఆధీనంలోనే చేపట్టాలి. ఈ విధానం ఆంధ్ర రాష్ట్రంలో అమలు చేయటానికి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నది. గత బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లను కూడా వైబులిటీ గ్యాప్ ఫండ్ కింద కూడా కేటాయించింది.

పిపిపి విధానం ప్రస్తుత 10 ప్రతిపాదిత ప్రభుత్వ వైద్య కళాశాలలకే పరిమితం కాదు. మిగిలిన 7 మెడికల్ కాలేజీలను కూడా త్వరలోనే ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పనున్నారు. అంతే కాదు, ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న వైద్య కళాశాలలన్నింటిని కూడా ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తారు. జిల్లా కేంద్రాల్లో ఉండే ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాంతీయ ఆసుపత్రులు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలన్నీ దశలవారీగా ప్రైవేట్ సంస్థలకి కట్టబెడతారు. ఇక కొత్తగా స్థాపించే ఆసుపత్రులు కూడా పిపిపి పద్ధతిలోనే చేపడతారు. మొత్తం ప్రభుత్వ ఆధీనంలో నడిచే వైద్య విద్య, ఆసుపత్రులు ఇతర అన్ని రకాల ఆరోగ్య సేవల నిర్వహణ బాధ్యత నుండి రాష్ట్ర ప్రభుత్వం తప్పుకొని ప్రైవేట్ సంస్థల పరం చేస్తోంది.

రాష్ట్ర కూటమి ప్రభుత్వం కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలను తలకెత్తుకొని బిజెపితో అంటకాగుతూ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నది. ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ మొత్తాన్ని ప్రైవేట్ శక్తుల గుప్పెట్లో పెట్టడానికి సిద్ధమైంది. ఈ ప్రమాదకర విధానాన్ని వెనక్కి కొట్టటమే రాష్ట్ర ప్రజల ముందున్న కర్తవ్యం.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

వ్యాసం

పరీక్షలు-మార్కులు-పోటీలు

సి. వి. కృష్ణయ్య

మన చదువులే నాసిరకం చదువులు. ఆ చదువులకు పెట్టే పరీక్షలు మరింత నాసిరకం. అశాస్త్రీయం. అందరూ కలిసి ఆడుతున్న గొప్ప నాటకం. పిల్లల్ని మోసగించటం. ఈ పరీక్షలు పిల్లల్ని భయపెట్టడానికి అవమానించడానికి తప్ప ఎందుకూ పనికిరావు. పిల్లలు పరీక్షల గురించి వారికి వచ్చే మార్కుల గురించి ఎలాంటి ఆలోచనలతో ఉంటారు? వారి మనసుల్లో ఎలాంటి భయాలుంటాయి? ఎలాంటి నిర్ణయాలు చేసుకుంటారు? పెరిగి పెద్దవాళ్ళు అయ్యే కొద్దీ భవిష్యత్తు జీవితంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి? ఈ విషయాల గురించి వివరంగా చర్చిద్దాం. తర్కబద్ధంగా ఆలోచిద్దాం. సరైన నిర్ణయానికి వద్దాం.

పరీక్షలు రాసేటప్పుడు ఎవరూ చూడరు. ఎన్ని మార్కులు వస్తాయో ఎవరికీ తెలియదు. కానీ పరీక్షల మార్కులు చెబుతున్నారంటే మాత్రం పిల్లలు భయపడిపోతుంటారు.

రేపు సైన్స్ మాస్టర్ మార్కులు చెబుతారట. తక్కువ మార్కులు వస్తే పైకి లేపి అవమానంగా మాట్లాడతారు. ఇంట్లో వాళ్ళను కూడా తిడతారు. దేవుడా రేపు సైన్స్ మాస్టర్ జ్వరం వచ్చి సెలవు పెట్టాలి. లేకపోతే ఏదో ఒకటి జరిగి రాకపోతే...ఛీ ఛీ...అనుకుంటూ చెడ్డ ఆలోచనలకు చెంపలు వాయించుకున్నది నీలిమ.

సోషల్ మాస్టర్ మార్కుల పేపర్లు ఇస్తున్నారు. విజయ్‌కు 50 మార్కులు వచ్చాయి. "సార్ అన్ని ప్రశ్నలకు జవాబులు రాశాను. సగానికి సగం తక్కువ వేశారు. కుమార్‌కు మాత్రం ఫుల్ మార్కులు వేశారు. ఎందుకని"? అడిగాడు. "నువ్వు అధిక ప్రసంగివి. అంతా సొంతంగా రాశావు. పుస్తకంలో ఉన్నవి లేనివి కలిపి రాశావు. కుమార్ నేను ఇచ్చిన నోట్స్ కష్టపడి కంఠస్థం చేసి రాశాడు. అందుకే నీకు సగం మార్కులు. ఆమాత్రం వేసినందుకు సంతోషించు" అన్నారు. ఎవరు తెలివిగలవాడు? కంఠస్థం చేసినవాడా? సొంతంగా రాసినవాడా? ఇది అన్యాయం. టీచర్కు బుద్ధి లేదు. పక్షపాతం చూపించిండు.

ఇలా ప్రతి పిల్లవాడు ఏదో ఒక విధంగా ఈ పరీక్షల గురించి మార్కుల గురించి భయపడుతూనే ఉంటారు. అన్యాయం జరిగిందని అనుకుంటారు. ఈ భయాలు, అనుమానాలు, ఈ చేదు అనుభవాలు జీవితాంతం వెంటాడుతూనే ఉంటాయి. పరీక్షల భయం మార్కుల భయం పాతిక సంవత్సరాల వరకు, చదువు పూర్తయ్యే వరకు ఎదుర్కొంటూ ఉంటారు. ఇది ఒక అలవాటుగా మారిపోతుంది. ఆ తర్వాత భయం అనే భూతం శరీరంలో ప్రవేశించి దాగి ఉంటుంది. జీవితాంతం ప్రతిదానికి భయపడుతుంటారు. ఇతరులతో పోల్చుకొని న్యూనతకు గురి అవుతారు. తనకు అన్యాయం జరిగిందనే నిర్ణయానికి వస్తారు. ఈ ఆలోచనలన్నీ తనకు తెలియకుండానే మనసు పొరల్లో నిక్షిప్తమై ఉంటాయి. పోరాడడం సర్దుకుపోవడం రెండూ చేతకాదు. కుంగిపోతారు. ధైర్యంగా నిర్ణయాలు తీసుకునే శక్తి లేక ఇతరులపై ఆధారపడుతుంటారు. లేదా ఇతరులకు అనుచరులుగా తయారవుతారు. వాడు ఎంత చెడ్డవాడైనా వాళ్ళని అంటిపెట్టుకొని బతుకుతారు. ఇలాంటి వారి వలన సమాజం ముందుకు పోలేక అనేక రుగ్మతలతో రోగిష్టి సమాజంగా తయారవుతుంది.

ఈ మార్కులు అనేవి ఒకరిని గెలిపించి 99 మందిని ఓడిస్తాయి. క్లాసులో ఒక్కడికే ఫస్ట్ మార్కులు వస్తాయి. మిగిలిన వారంతా తనకంటే తక్కువ మార్కులు వచ్చినవాడిని చూసుకొని సంతోషిస్తారు. సంతృప్తి పడతారు. తనకంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారిని చూసి నేనింతేలే అని సరిపెట్టుకుంటారు. పిల్లలు తెలివితేటలను సూచించే ఈ మార్కులు ఆరు నెలల తర్వాత అదే పరీక్షలు పెట్టి చూడండి. మొదట వచ్చిన మార్కులు రానే రావు. అందులో సగం మార్కులు కూడా రావు. ఎందుకని? అవి నిజమైన తెలివితేటలు కావు. ఊపిరి బిగబట్టి జవాబులు కంఠస్థం చేసి పరీక్షల్లో కక్కేసి ఊపిరి పీల్చుకుంటారు. ఆ తర్వాత బుర్ర ఖాళీ అయిపోతుంది. అందుకే ఐన్‌స్టీన్ "స్కూల్లో చదివిన చదువు అంతా మర్చిపోయిన తర్వాత మిగిలినదే అసలైన జ్ఞానం" అంటాడు.

ఐన్‌స్టీన్ పరీక్షల గురించి కూడా ఒక మాట అన్నాడు. ఆయన చదువు పూర్తి అయిన తర్వాత మొట్టమొదట పత్రికలకు రాసిన వ్యాసంలో "పరీక్షలు రాయాలని పిల్లల్ని బలవంత పెట్టకూడదు. అది వారి మానసిక శారీరక ఆరోగ్యాలపై ప్రభావం చూపిస్తాయి" అంటారు.

మనం ఐన్‌స్టీన్ ఈ విశ్వం గురించి చెప్పిన భౌతిక సూత్రాలను నమ్ముతాము. ప్రకృతి సూత్రాలను ఉపయోగించుకుంటున్నాం. ఇప్పటి వరకు ఐన్‌స్టీన్ అంత తెలివిగలవాడు భూమి మీద పుట్టలేదంటారు. జ్ఞానాన్ని గురించి పరీక్షలు గురించి, ఆయన చెప్పిన మాటలు ఎందుకు పట్టించుకోము?

> చదువుల్లో మార్కులే ముఖ్యమైనప్పుడు ఆ మార్కులు సంపాదించడానికి చదువులు తయారవుతాయి. జ్ఞానం కోసం చదవడం గాక మార్కుల కోసం చదువుతారు. ఆ మార్కులు సంపాదించడానికి వక్ర మార్గాలు అన్వేషిస్తారు. 24 గంటలు కంఠస్తం చేస్తూ ప్రతిరోజూ పరీక్షలు రాస్తూ ప్రాక్టీస్ చేస్తారు. తాత్కాలికంగా మనసులో గుర్తుపెట్టుకోవడానికి మెదడు కూడా ఒక పద్ధతి అలవాటు చేసుకుంటుంది.



చదువుల్లో మార్కులే ముఖ్యమైనప్పుడు ఆ మార్కులు సంపాదించడానికి చదువులు తయారవుతాయి. జ్ఞానం కోసం చదవడం గాక మార్కుల కోసం చదువుతారు. ఆ మార్కులు సంపాదించడానికి వక్ర మార్గాలు అన్వేషిస్తారు. 24 గంటలు కంఠస్తం చేస్తూ ప్రతిరోజూ పరీక్షలు రాస్తూ ప్రాక్టీస్ చేస్తారు. తాత్కాలికంగా మనసులో గుర్తుపెట్టుకోవడానికి మెదడు కూడా ఒక పద్ధతి అలవాటు చేసుకుంటుంది. విద్యార్థి సోషల్‌లో జవాబులు ఎంతో బాగా రాస్తాడు. ప్రపంచంలో నేలల స్వభావాన్ని గురించి అద్భుతంగా రాస్తాడు. నువ్వు ఎప్పుడైనా ఒండ్రు మట్టి నేలలు చూసావా అంటే చూడలేదంటాడు. చెట్ల గురించి బ్రహ్మాండంగా రాస్తాడు. అంటు కట్టే పద్ధతి గురించి ఎంతో చక్కగా రాస్తాడు. కానీ నీకు అంటూ కట్టే పద్ధతి తెలుసా అంటే తెలియదంటాడు. ఆక్సిజన్ గురించి తెలుసు, దాని ప్రయోజనాలు తెలుసు. కానీ దాన్ని తయారు చేయడం తెలుసా అంటే చేతకాదంటాడు. అసలు పరీక్ష నాళికే చూసి ఉండడు. ఈ దండగ మారిన చదువుల వలన పోటీల వలన ఏం ప్రయోజనం?

పరీక్షల్లో మార్కుల కోసం పోటీ పడడం, ఉద్యోగాల కోసం పోటీ పడడం, వ్యాపారంలో లాభాల కోసం పోటీ పడడం, ఎంత ఎక్కువ సంపాదిస్తే అంత గొప్ప అయినప్పుడు సమాజంలో ఏ చెడ్డ పని అయినా దుర్మార్గమైనా ఎక్కువ సంపాదించడానికి పోటీ పడతారు. ఈ పోటీకి అంతం అనేది లేదు. ఆ పోటీ కూడా పడలేక చివరకు అందర్నీ కొనేస్తారు.

ఇప్పుడు చూడండి. ఎంతో ఆనందంగా ఆడుకునే ఆటలు కూడా పోటీలై, వ్యాపారమై, ఆ వ్యాపారస్తులు ఆటగాళ్లని కొనుక్కొని ఆడించే వరకు వచ్చింది. ఆటగాళ్లు ఇప్పుడు తమకోసం గాక తమ యజమాని కోసం ఆడుతున్నారు. ఇందులో కూడా మోసాలు. ఎదుటివారితో కలిసిపోయి ఆటగాడిని ఓడిపోమన్నప్పుడు ఓడిపోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఇది ఇలా ఉంటే ఈ ఆటల్లో ఎవరు గెలుస్తారనే దానిపై బెట్టింగులు ఊరురా వస్తాయి. ఆస్తులు పోగొట్టుకుంటారు. ఆటగాళ్లు బానిసలుగా మారిపోతారు. ఆటగాళ్లకు ఆత్మాభిమానం ఉండదు. ఎంత దౌర్భాగ్య పరిస్థితికి సమాజం దిగజారిపోతున్నదో చూస్తున్నాం కదా. ఇదంతా న్యాయమే అనుకుంటాం. ఓడిన ఆటగాడిని అమ్ముడు పోయినాడని తిడతారు. గెలిచినప్పుడు ఆకాశానికి ఎత్తిన వారే ఓడినప్పుడు అవమానిస్తారు. ఆటగాళ్లు కుంగిపోతారు. ఇలా ఈ పోటీలు సమాజాన్ని ఎంత వరకైనా దిగజారుస్తాయి. అసలు చదువులన్నీ మాయమైపోతాయి. జ్ఞానము, వివేకం, వికాసం, ధర్మం, న్యాయం ఇట్లాంటివి అన్నీ పడికట్టు పదాలుగా మారిపోతాయి. సమాజంలో వాటికి ఎలాంటి విలువ ఉండదు. విలువలు లేని సమాజం ఎలా తయారవుతుందో మనం చూస్తూనే ఉన్నాం గదా! ఒక పద్ధతి ఒక పాడు ఏమీ ఉండదు. అన్ని రకాల సంస్థలు అవినీతిమయంగా మారిపోతాయి. అంతా అమ్మకం కొనుగోళ్లే.

ఈ చదువులు, ఈ పరీక్షలు, ఈ పోటీలు ఇవన్నీ మారిందాక ఈ సమాజానికి విముక్తి లేదు. నిజమైన పరీక్షలు వేరే ఉంటాయి. అవి ప్రతి నిత్యం పిల్లలకు తెలియకుండా జరిగిపోతూ ఉంటాయి. అవి ఎలా ఉంటాయో వివరంగా మరోసారి చర్చిద్దాం.

/'జనవిజ్ఞానం' సౌజన్యంతో/

జనవాక్యం

ఒక్కో బాబా ఒక్కో రకం

ఢిల్లీలో చైతన్యానంద సరస్వతి అనే బాబా 17 మంది విద్యార్థినులపై లైంగిక దాడి చేసిన ఆరోపణల కారణంగా పరారయ్యాడు. బాబాలందరూ ఇంతే! ఒకడు రేపులకు పేరు. మరొకడు హత్యలకు పేరు. ఇంకొకడు భూ కుంభకోణాలకు పేరు. మరొకడు హోమో సెక్స్‌కి పేరు. ఇలా ఒక్కో బాబా ఒక్కో దానిలో ప్రత్యేకత కలిగి వున్నారు. చివరికి ఆశ్రమాలన్నీ వ్యభిచార కొంపలే! బాబాల చరిత్రలు చూస్తున్నాం. డేరా బాబా, ఆశారామ్ బాపూ, రాంపాల్ బాబా, నిత్యానంద స్వామి. పీవీ నరసింహారావు కాలంలో ఒక వెలుగు వెలిగి చివరికి జైలు పాలైన చంద్రస్వామి. అయితే ఇపుడు మన రాష్ట్ర ప్రభుత్వం నవంబరు 23న జరిగే పుట్టపర్తి సాయిబాబా శతజయంతిని రాష్ట్ర పండుగగా జరుపుతున్నది. ఈయనపైనా ఎన్నో ఆరోపణలున్నాయి. కొన్ని వందల మంది యువకులను చెరిచాడని ఆనాడు పత్రికలు సీరియల్‌గా ప్రచురించాయి. మ్యాజిక్కులను మహత్యాలుగా ప్రకటించుకొని వేల కోట్లు కూడబెట్టాడు. మోసగాడి కింద జైల్లో పెట్టాల్సిన బాబాకు జయంతులు జరపడం అవమానం. మరి ఇలాంటి బాబాల పుట్టిన రోజులను ప్రభుత్వం జరపుతూ ప్రజలకు ఏ రకమైన సందేశాలను ఇస్తున్నట్లు?

- నార్నె వెంకటసుబ్బయ్య

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

మళ్లీ పెరిగిన గోదావరి వరద

ప్రజాశక్తి - పోలవరం

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా తగ్గుతూ పెరుగుతూ వస్తున్న గోదావరి బుధవారం సాయంత్రానికి నెమ్మదిగా పెరుగుతూ వస్తుంది. పోలవరం ప్రాజెక్ట్ స్పిల్ వే నుంచి 5,52,343 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 30.400 మీటర్లు, దిగువన 21.170 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 30.800 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 20.750 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య 16.000 మీటర్లు నమోదైంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 34.80 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 9.43 మీటర్లు నమోదైనట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

పార్వతీపురానికి మరో వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

దూర ప్రాంత ప్రయాణ సౌకర్యం కల్పించేలా అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఉద్నా (సూరత్) - బరంపురం అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును మంజూరు చేసింది. అయితే ఈ రైలు రాయగఢ తరువాత విజయనగరంలోనే నిలిపివేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించడంతో బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యే బేబినాయన, విజయచంద్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంగా ఉన్న పార్వతీపురం, వాణిజ్య కేంద్రంగా ఉన్న బొబ్బిలిలో ఈ రైలుకు స్టాపేజీ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్‌ను విజయచంద్ర కలిసి ఈ రెండు ప్రాంతాల ప్రజల ఆకాంక్ష, డిమాండ్‌ను తెలియజేశారు. దీనిపై స్పందించిన రైల్వే బోర్డు చైర్మన్ బొబ్బిలి, పార్వతీపురం స్టాపేజీ కల్పించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో గంటల వ్యవధిలోనే కొత్త షెడ్యూల్‌ను రైల్వే శాఖ విడుదల చేయడం గమనార్హం. అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ఉద్నా నుంచి రాయపూర్, రాయగఢ, పార్వతీపురం, బొబ్బిలి మీదుగా బరంపురం మధ్య రాకపోకలు సాగిస్తుంది. ప్రయాణ నిడివి 30.45 గంటలు కాగా.. మొత్తం 31 స్టేషన్లలో స్టాపేజీ కల్పించారు. దీనిపై ఉమ్మడి విజయనగరం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పనులకు ఆటంకం పేరుతో వర్కర్‌పై కేసు..!

- రాత్రంతా పనిచేసినా కార్మికునికి దక్కని గుర్తింపు
- కార్పొరేషన్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరం కలెక్టరేట్ వెనుక భాగంలో ఉన్న ఆర్ఎంహెచ్ హైస్కూల్ వాటర్ ట్యాంక్ పైప్‌లైన్ వెల్డింగ్ పనులు రాత్రంతా మేలుకుని పనులు చేయించిన వర్కర్‌పైనే కేసులు పెట్టించిన ఘనత అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో చోటు చేసుకుంది. పనులకు ఆటంకం కల్పించారని ఆరోపిస్తూ ఏకంగా పోలీసులకు ఫిర్యాదు చేయడం విస్మయానికి గురి చేస్తోంది. గతంలో ఫిట్టర్ గౌరీ శంకర్ కమలానగర్‌లోని డ్రెస్ సర్కిల్ సమీపంలో కుళాయి మరమ్మతులు చేస్తూ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైరు తగిలి గాయపడ్డారు. మూడు నెలలు చికిత్సలు పొంది ఇప్పుడే కోలుకున్నారు. వర్కర్ కం ఫిట్టర్‌గా పనిచేసే గౌరీ శంకర్... కార్పొరేషన్ అధికారుల సూచన మేరకు ఆర్ఎంహెచ్ వాటర్ ట్యాంకులో సోమవారం రాత్రంతా మేలుకుని పగిలిన పైపులైన్‌కు వెల్డింగ్ పనులు చేశారు. మంగళవారం వేకువజాము వరకు పని చేసి 75 శాతం పూర్తి చేశాడు. ఇక 25 శాతం పనులు మిగిలున్నాయి. కాగా వెల్డర్ మంగళవారం ఉదయం ఉరవకొండలో పైప్‌లైన్ మరమ్మతుకు వెళ్లడంతో పని నిలిచిపోయింది. మంగళవారం సాయంకాలం సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్‌తో కలిసి ఆర్ఎంహెచ్ వాటర్ ట్యాంక్ లీకేజీ పనులను పరిశీలించారు. అర్ధాంతరంగా పనులు నిలిచి ఉండటం గమనించి కారణమేమిటని ట్యాప్ ఇన్స్‌పెక్టర్‌తో ఆరా తీశారు. వెల్డర్ రాని కారణంగా పనులు నిలిచిపోయాయని ఆయన తెలియజేశారు. పనులు నిలిపేసి వెళ్లిన వెల్డర్ రాకుంటే మరొకరిని పిలిచి పనులు చేయించాలి కానీ, నీటి సరఫరాకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించటం తగదని అధికారులు హెచ్చరించారు. దీంతో ట్యాప్ ఇన్స్‌పెక్టర్ మహబూబ్ బాషా మరో వెల్డర్‌ను మాట్లాడి పనులు చేయించేందుకు తీసుకొచ్చారు. అంతకుముందు పనులు చేసిన వెల్డర్ విషయం తెలుసుకుని సంబంధిత అధికారితో మాట్లాడారు. కార్పొరేషన్‌లో క్రమం తప్పకుండా తాను పనులు చేస్తున్నాని, బిల్లులు ఆలస్యంగా వస్తున్నా సర్దుకుంటున్నానని తెలియజేశారు. రాత్రంతా పని చేసినా గుర్తించకుండా ఉన్న కొద్దిపాటి పని కోసం ఇతరులను పిలిపించడం సరికాదని ట్యాప్ ఇన్స్‌పెక్టర్‌కు తెలిపారు. ఈ సమయంలో ఆ పనులు చేసేందుకు వచ్చిన మరో వెల్డర్ చేయకుండానే వెనుదిరిగారు. వర్కర్ కం ఫిట్టర్ గౌరీ శంకర్ పనులు జరగకుండా అడ్డుకున్నారంటూ ఉన్నతాధికారులకు ట్యాప్ ఇన్స్‌పెక్టర్ ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గౌరీశంకర్‌పై ఫిర్యాదు చేశారు. కాగా ఈ విషయంపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్ ప్రజాశక్తితో మాట్లాడారు. వర్కర్‌కు భయం ఉండాలని మాత్రమే ఫిర్యాదు చేశామని, కేసు నమోదు కాలేదని చెప్పుకొచ్చారు.

రాత్రి వేళ వాటర్ ట్యాంక్ పైప్‌లైన్ వెల్డింగ్ పనులు చేస్తున్న కార్మికులు

అధికారుల తీరుపై సిఐటియు ఆగ్రహం

విధి నిర్వహణలో ప్రాణాపాయ స్థితి ఎదుర్కొని అంకితభావంతో పనిచేసే కార్మికులపై సహృదయంతో వ్యవహరించాల్సింది పోయి కేసులు పెట్టేలా పోలీసులకు ఫిర్యాదు చేయటం ట్యాప్ ఇన్స్‌పెక్టర్‌కు తగదని సిఐటియు నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

కోలాహలంగా సిరిమాను తరలింపు

- దారి పొడవునా నీరాజనాలు
- ఉత్సవాల్లో భాగస్వాములు కావాలి : మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-గంట్యాడ/విజయనగరంటౌన్

పైడితల్లి అమ్మవారి పండగ, విజయనగరం ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గంట్యాడ మండలం కొండ తామరాపల్లి గ్రామంలో గుర్తించిన పైడితల్లి అమ్మవారికి ప్రతిరూపంగా భావించే సిరిమాను చెట్టును మంత్రి శ్రీనివాస్ బుధవారం సతీసమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాత్రికుల జయజయద్వానాల మధ్య చెట్టుకు గొడ్డలితో గాట్లు పెట్టి సిరిమాను తయారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అనంతరం అక్కడి నుంచి విజయనగరంలోని పూజారి నివాసముంటున్న హుకుంపేటకు సిరిమానును తరలించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడుతూ..అమ్మవారి సిరిమాను పండగను, విజయనగరం ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అమ్మవారు రాష్ట్రాన్ని చల్లగా చూడాలని, పరిశ్రమలు ఏర్పాటై యువతకు ఉద్యోగాలు రావాలని మంత్రి ఆకాంక్షించారు.

ఆధార్ కోసం రోజుల తరబడి నిరీక్షణ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం (తిరుపతి)

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్న గిరిజనులకు స్పెషల్‌డ్రైవ్‌గా ఆధార్ క్యాంపులను తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండల కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. బుధవారం వరదయ్యపాలెం సచివాలయం -2లో ఆధార్ అప్డేట్ క్యాంపు ఏర్పాటు చేశారు. అయితే దరఖాస్తులో తహశీల్దార్ సంతకం లేని కారణంగా గిరిజనులకు ఆధార్ నమోదు చేసే ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఆధార్ అప్డేట్ కోసం కేంద్రం వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. మండలంలో 1300 మంది గిరిజనులు ఉండగా, దాదాపు 700 మందికి ఆధార్‌కార్డులు లేని పరిస్థితి. వరదయ్యపాలెం మండల పరిధిలో దాదాపు 20 పైగా గిరిజన ప్రాంతాలు ఉన్నాయి. గోపాలపురం కాలనీ, హైస్కూల్ సెంటర్, అనీల్‌సెంటర్, రామిరెడ్డిపాలెం, కాంబాకం, జి.ఆర్ దరఖాస్తు, అంబూరు, శాతంబేడు, తాగేలి, సిఆర్‌సి కండ్రిగ, బత్తులవల్లం, కాంబాకం, కంచరపాలెం, పాండూరు, వికెఆర్‌వై కాలనీ, చెన్నవారిపాలెం తదితర 20 సెంటర్లలో ఆధార్ అప్‌డేట్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకూ ఆధార్ పొందని 17 ఏళ్ల లోపు వారికి, కొన్ని కారణాలతో ఆధార్ పోగొట్టుకున్న వారికి ఈనెల 22 నుంచి 27 వరకూ ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయుల వరకూ ఈ సమాచారాన్ని స్థానికంగా ఉన్న గిరిజనులకు అందజేసి ఈ క్యాంపులను విజయవంతం చేయాలన్నది లక్ష్యం. అయితే అధికారుల సమన్వయ లోపంతో గిరిజనులు రోజుల తరబడి కేంద్రాల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి.

అధికారుల్లో సమన్వయ లోపం

గిరిజనులకు ఆధార్ సంబంధించి ఎటువంటి సమస్యలైనా పరిష్కరించడానికి మండలంలో వారం రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో క్యాంపులను ఏర్పాటు చేశారు. ఎక్కువమంది గిరిజనులకు ఆధార్ కార్డులను అందించాలనే ధ్యేయంతో గిరిజన సంక్షేమ శాఖ ఈ క్యాంపులను ఏర్పాటు చేసింది. వరదయ్యపాలెం మేజర్ పంచాయతీలో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్యాంపు ఏర్పాటు చేసిన తేదీ కంటే ముందు రోజే ఆధార్‌కార్డు అప్‌డేట్ కోసం కావాల్సిన అన్ని పత్రాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకుంటే క్యాంపు రోజు త్వరగా పని పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. అలాకాకుండా సచివాలయ సిబ్బంది క్యాంపు ఏర్పాటు చేసిన రోజే సంబంధిత పత్రాలను ప్రింట్ చేయడంతో తహశీల్దార్ అందుబాటులో లేక ఆధార్ ఇవ్వలేదని తెలుస్తోంది. సచివాలయ సిబ్బందికి, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయ లోపంతో సామాన్య గిరిజనులు దినసరి కూలిని వదులుకుని రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఆధార్ లేని కారణంగా సంక్షేమ పథకాలు అందడం లేదని, రోజువారి కూలి పనులకు వెళ్లే తామకు ఆధార్ కార్డులు ఇచ్చి పింఛన్, రేషన్‌కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని వారు కోరుతున్నారు.

డిజిటల్ అరెస్టు పేరుతో రూ.51 లక్షలు అపహరణ

- మహిళను మోసగించిన సైబర్ నేరగాళ్లు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. వృద్ధ మహిళను డిజిటల్ అరెస్టు పేరుతో మోసం చేసి ఆమె వద్ద నుంచి రూ.51 లక్షలు అపహరించారు. ఈ ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు ఆర్ఆర్.పేట ప్రాంతానికి చెందిన వృద్ధురాలు మేక రమాదేవి భర్తతో కలిసి జీవిస్తుంది. వీరి పిల్లలు విదేశాల్లో స్థిరపడ్డారు. రమాదేవి కూడా గ్రీన్ కార్డ్ హోల్డర్‌గా ఉన్నారు. ఈ క్రమంలో గత కొన్ని రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ఆమెకు ఫోన్ చేసి మీ ఆధార్ నెంబర్‌పై సిమ్ కొనుగోలు చేసి అసాంఘిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని ఫిర్యాదులు అందాయని తెలిపారు. అనంతరం వీడియో కాల్‌లో ఎస్ఐ దుస్తుల్లో ఉన్న ఒక వ్యక్తి తాను బెంగళూరుకు చెందిన పోలీసు అధికారినని, మీపై ముంబై ప్రాంతంలో బ్యాంకు ఖాతాలు ఉన్నాయని, వాటి ద్వారా నేరస్తులకు నగదు బదిలీ అయిందని, మీపై కేసులు నమోదయ్యాయని బెదిరింపులకు గురిచేశాడు. వాటికి సంబంధించిన నకిలీ పత్రాలను కూడా వాట్సాప్ ద్వారా ఆమెకు షేర్ చేశాడు. అంతటితో ఆగకుండా నకిలీ అరెస్టు పత్రాలను కూడా ఆమెకు పంపారు. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నామని తెలిపారు. దీంతో రమాదేవి భయభ్రాంతులకు గురై వెంటనే ఆ కేసు నుంచి బయట పడేయమని వారిని కోరారు. అందుకు దఫాదఫాలుగా రూ.51 లక్షలు వారికి చెల్లించారు. చివరకు తాను మోసపోయినట్లు గుర్తించి బుధవారం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు రెండో పట్టణ సిఐ అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐరాస పనిచేయడం లేదు : ఎస్కలేటర్ ఘటనపై ట్రంప్

తోసిపుచ్చిన ఐరాస

న్యూయార్క్ : ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎక్కిన ఎస్కలేటర్ హఠాత్తుగా ఆగిపోయింది. దీనికి ట్రంప్ వీడియోగ్రాఫరే కారణమై ఉండవచ్చునని ఐరాస తెలిపింది. ట్రంప్, అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ వస్తున్న దృశ్యాలను చిత్రీకరించడానికి వీడియోగ్రాఫర్ ఎస్కలేటర్‌పై వెనక్కి ప్రయాణించారని, పైకి చేరుకున్న తర్వాత అనుకోకుండా సేఫ్టీ ఫంక్షన్‌ను నొక్కి ఉండవచ్చునని ఐరాస ప్రతినిధి చెప్పారు. ఈ ఘటనను ట్రంప్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. 'ప్రథమ మహిళ సరిగా నిలబడకపోతే పడిపోయి ఉండేది' అని నవ్వుతూ అన్నారు. అయితే ట్రంప్ దంపతులు ఎస్కలేటర్ ఎక్కగానే ఎవరో ఉద్దేశపూర్వకంగా దానిని ఆపేశారని శ్వేతసౌధం ఆందోళన వ్యక్తం చేసింది.

ఐరాస సర్వసభ్య సమావేశంలో చేసిన ప్రసంగంలో ఎస్కలేటర్ ఘటనను తేలికగా తీసుకున్న ట్రంప్ ఆ తర్వాత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్కలేటర్ పనిచేయడం లేదని, టెలిప్రాంప్టర్ లోపభూయిష్టంగా ఉన్నదని ఆరోపించారు. ఈ సంఘటనను సాకుగా చూపి ఐరాసను పనిచేయని సంస్థగా ఆయన చిత్రీకరించారు. 'ఐరాసలో నాకు లభించింది ఎస్కలేటర్ అనుభవం మాత్రమే. అది పైకి వచ్చేటప్పుడు మధ్యలోనే ఆగిపోయింది' అని చెప్పారు. కాగా అమెరికా ప్రతినిధి బృందంలోని ఓ వీడియోగ్రాఫర్ ఎస్కలేటర్ పైభాగంలోని స్టాప్ మెకానిజాన్ని నొక్కారని ఐరాస సెక్రటరీ జనరల్ ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ వివరించారు.

AMARAVATI DEVELOPMENT CORPORATION LIMITED (ADCL)
54-15-1, Venkateswara Nagar, Near Yalamanchili Complex, Sonovision Building, Ring Road, Vijayawada, NTR Dist, Andhra Pradesh-520008. CIN Number: U93000AP2015SGC105535

E-PROCUREMENT -SHORT TENDER NOTICE

NIT No. 05/CE/ADC/Engg/2025-26 Dated: 24-09-2025

Providing G.I ChainLink Mesh Fencing at the helipad, AP Secretariat on Malkapuram Park in Amaravati capital city area - Estimated Cost-20.50 Lakhs. The bid can be downloaded on **"ap-eprocurement"** portal @ **tender.apeprocurement.gov.in from 25.09.2025 to 03.10.2025** and due date for submission of **Bid on 03.10.2025, bid opening on 03.10.2025.** For any further clarifications, Contact **Sri. K.Basaveswararao, Executive Engineer, ADCL, Vijayawada, Ph.No: 9849906836**

Sd/- Chief Engineer, ADCL, Vijayawada

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీ సిఆర్డీఏ)
లెనిన్ సెంటర్, గవర్నరుపేట్, విజయవాడ - 520002

బహిరంగ ప్రకటన

1. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో, నిర్మించబడుచున్నఅమరావతి రాజధాని నగరంలో ఏపిసిఆర్‌డిఏ వారి 'ప్రాజెక్ట్ ఆఫీస్' మరియు 'జ్యుడీషియల్ కాంప్లెక్స్' ప్రాజెక్ట్ ప్రతిపాదనలకు EIA నోటిఫికేషన్ 2006 మరియు దాని తదుపరి సవరణల పరంగా, పర్యావరణ ప్రభావ అంచనా అథారిటీ (SEIAA), A.P. వర్యావరణ అనుమతి (EC) ఆర్డర్ నెం. SEIAA/AP/INFRA2/EC/GU/04/2025/1335/261.20 & 261.14, తేదీ: 12.05.2025 ను మంజూరు చేసింది. **పర్యావరణ అనుమతి వివరాలు** APCRDA **website:www.apcrda.in లో అందుబాటులో ఉన్నాయి.**

బహిరంగ ప్రకటన

2. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో, నిర్మించబడుచున్నఅమరావతి రాజధాని నగరంలో ఏపిసిఆర్‌డిఏ వారి AIS సెక్రటరీ బంగ్లాలు', 'మంత్రుల బంగ్లాలు' మరియు 'న్యాయమూర్తుల బంగ్లాలు' ప్రాజెక్ట్ ప్రతిపాదనలకు EIA నోటిఫికేషన్ 2006 మరియు దాని తదుపరి సవరణల పరంగా, పర్యావరణ ప్రభావ అంచనా అథారిటీ (SEIAA) A.P. పర్యావరణ అనుమతి (EC) ఆర్డర్ నెం. SEIAA/AP/INFRA2/EC/GU/04/2025/1334/261.19 & 261.13 తేదీ: 12/05/2025. ను మంజూరు చేసింది. **పర్యావరణ అనుమతి వివరాలు** APCRDA **website:www.apcrda.in లో అందుబాటులో ఉన్నాయి.**

Sd/- **Addl.Commissioner, APCRDA,** Vijayawada

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనమైనది)
IDFC FIRST Bank
CIN: L65110TN2014PLC097792
రిజిష్టర్డు ఆఫీసు:- కెఆర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హారింగ్టన్ రోడ్, చెట్పెట్, చెన్నై-600031. టెలి: +91 44 4564 4000, ఫ్యాక్స్: +91 44 4564 4022

అనుబంధం IV (రూల్ 8(1)
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైనది)** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **తేది: 13.04.2024 నాటి** డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులు: **1. తియ్యగూర రాజశేఖర్ రెడ్డి, 2. తియ్యగూర శ్రీదేవి** లను సదరు డిమాండ్ నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా **12.04.2024** నాటికి నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు: **రూ.15,09,997.89 పై.లు (రూపాయలు పదిహేను లక్షల తొమ్మిది వేల తొమ్మిది వందల తొంబై ఏడు మరియు ఎనభై తొమ్మిది పైసలు మాత్రమే)** లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు/హామీదారులు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటరెస్టు (ఎన్ఫోర్సుమెంటు) రూల్సు, 2002 యొక్క రూలు 8తో చదువబడే చట్టం యొక్క సెక్షను 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **22 సెప్టెంబర్ 2025న స్వాధీనంచేసుకున్నారు.**

ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైనది)**నకు **రూ.15,09,997.89 పై.లు (రూపాయలు పదిహేను లక్షల తొమ్మిది వేల తొమ్మిది వందల తొంబై ఏడు మరియు ఎనభై తొమ్మిది పైసలు మాత్రమే)** ల మొత్తాలును, దానిపై వడ్డీతోసహా చెల్లింపులుచేయుటకులోబడి ఉంటుంది.

సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

స్థిరాస్తుల వివరణ

గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-డిస్ట్రిక్ట్, గుంటూరు హామ్లెట్, రెడ్డిపాలెం గ్రామపంచాయతి ఏరియా, గుంటూరు గ్రామంలో డి.నం.364, ఎక.5-76సెంట్లకుగాను ప్లాట్ నం.6 యొక్క ఉత్తరం వైపు 255చ.గ.లు అనగా., సైటు విస్తీర్ణం 105చ.గ.లుతో, డోర్ నం.132-5-471, అసెస్మెంట్ నం.1021195199 (పన్ను రసీదు ప్రకారం) దానిలో అన్ని ఫిక్చర్స్& ఫిటింగ్‌తో గల ఆస్తి యొక్క మొత్తం భాగం. **సరిహద్దులు: తూర్పు:** 18అ.ల వెడల్పు రోడ్డు, **పడమర:** 18అ.ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** పిట్టు శివారెడ్డి ఆస్తి, **దక్షిణం:** కత్తెరపల్లి రాజశేఖర్ రెడ్డి & కూటిరెడ్డి ఆస్తి.

తేది: 22.09.2025
ప్రదేశం: గుంటూరు.
రుణ ఖాతా నం. 47488784.

సం/-
అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో సమ్మిళితమైంది)

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అసెట్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం.26-15-150, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం, ఎ.పి. ఫోన్: 0891-2537792. ఇ-మెయిల్: ubin0817295@unionbankofindia.bank

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూలు 6(2)/8(6) క్రింద అమ్మకం గురించి (30 రోజుల నోటీసు) తెలియచేస్తూ ఋణగ్రహీతకు నోటీసు

టు:

ఋణగ్రహీత(లు) : 1) శ్రీ పెనుమల రవీంద్ర కుమార్, తండ్రి: పెనుమల కాంత రాజు, డి నెం.248, బలరాం నగర్, రోడ్ నెం.3, మినీట్యాంక్ బండ్ వెనుక, సఫిల్‌గూడ, మల్కాజ్‌గిరి, హనుమాన్‌పేట్, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, తెలంగాణ-500047. మరొక చిరునామా : శ్రీ పెనుమల రవీంద్ర కుమార్, తండ్రి : పెనుమల కాంత రాజు, చిన తాడినాడ గ్రామం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-522333. 2) శ్రీమతి నల్లి రిబ్కా, భర్త : శ్రీ పెనుమల రవీంద్ర కుమార్, డి నెం.248, బలరాం నగర్, రోడ్ నెం.3, మినీ ట్యాంక్ బండ్ వెనుక, సఫిల్‌గూడ, మల్కాజ్‌గిరి, హనుమాన్‌పేట్, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, తెలంగాణ-500047. హామీదారు/సహ-పూచీదారు : శ్రీ పెనుమల రామకృష్ణ, C/o. వరప్రసాద్, హెచ్ నెం.1-19-288, RTC కాలనీ, యేలేశ్వరం, కాకినాడ జిల్లా-533429. మరొక చిరునామా : శ్రీ పెనుమల రామకృష్ణ, తండ్రి : వెంకటరావు, హెచ్ నెం.54-12-16, వార్డు నెం.3, APHB కాలనీ, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా-534260. మరొక చిరునామా : శ్రీ పెనుమల రామకృష్ణ, తండ్రి : వెంకటరావు, ఫ్లాట్ నెం.405, 3వ అంతస్తు, పి జె విహార్ అపార్ట్‌మెంట్, యర్రవరం రోడ్డు, యేలేశ్వరం, కాకినాడ జిల్లా-533429.

డియర్ సార్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలిసిన బకాయి వసూలు కొరకు శ్రీ పెనుమల రవీంద్ర కుమార్ గారి అకౌంట్‌కు సంబంధించిన శ్రీ పెనుమల రవీంద్ర కుమార్ గారికి చెందిన ఆస్తి అమ్మకం.

బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తములను నోటీసులో తెలిపిన నిర్ణీతకాలంలోగా చెల్లించవలసినదిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యేలేశ్వరం బ్రాంచ్ (ఇప్పుడు అసెట్ రికవరీ బ్రాంచ్, విశాఖపట్నంకు బదిలీ చేయబడినది)** సెక్యూర్డ్ క్రెడిటార్ వారు మీకు డిమాండ్ నోటీసు **తేది.03.02.2024** న జారీచేసినారు. అయినప్పటికీ మీరు సదరు నోటీసులో సూచించిన నిర్ణీత కాలంలోగా బకాయి మొత్తము చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు-2002 యొక్క 8వ రూలుతో కూడిన సదరు చట్టం 13(4) సెక్షన్ క్రింద స్థిర సెక్యూర్డ్ ఆస్తులను అధీకృత అధికారి గారు ఆస్తిని **తేది.24.07.2024** న స్వాధీన పరుచుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీన పరచుకున్న తరువాత కూడా మీరు బ్యాంకు యొక్క బకాయి మొత్తము చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి 30 రోజులు తరువాత బహిరంగ ఇ-వేలం నిర్వహించుట ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించవలసిన అవసరం ఉంటుంది. ఇ-వేలం తేదీ మరియు సమయంతో పాటు ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం నిర్వహించు సర్వీస్ ప్రొవైడర్ వివరములు మీకు విడిగా తెలియజేయబడతాయి. కాబట్టి, అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా మీరు బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తముతో పాటు దానిపై తదుపరి వడ్డీ, బ్యాంకు వారికి సంభవించిన ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలు చెల్లించినచో, అస్తి అమ్మకంపైన తదుపరి చర్యలు చేపట్టబడవు మరియు సదరు చట్టం 13(8) సెక్షన్ పరిధిలో మీ తనఖా ఆస్తులను మీరు విడిపించుకోవచ్చును.

షెడ్యూలు స్థిరాస్తి వివరములు

(రిజిష్టర్డ్ సేల్ డీడ్ నెం.42/2018, తేది.04.01.2018) : ఆంధ్రప్రదేశ్, కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు ఎస్ఆర్ఓ పరిధి, యేలేశ్వరం నగర పంచాయితీ, యేలేశ్వరం గ్రామం, ఆర్ ఎస్ నెం.451/1A3 నందు మొత్తం విస్తీర్ణం 1190.89 చ॥గ॥లులోని అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటాతో ఉన్న విస్తీర్ణం 38.00 చ॥గ॥లుతో "పి జె విహార్" అపార్ట్‌మెంట్ నందు కామన్ ఏరియాలు & బాల్కనీలతో కలిపి ప్లింత్ ఏరియా 950 చ॥అ॥లుతో 4వ అంతస్తులోని ఫ్లాట్ నెం.505 తో ఉన్న రెసిడెన్షియల్ ఫ్లాట్ మరియు 100 చ॥అ॥ల కార్ పార్కింగ్‌తో కలిపి **శ్రీ పెనుమాల రవీంద్ర కుమార్, తండ్రి : కాంత రాజు గారికి చెందినది. ఆస్తి హద్దులు : తూర్పు:** ఎగ్జిక్యూటెంట్ యొక్క ఆస్తి, **పడమర :** కెనాల్, **దక్షిణం :** రోడ్డు, **ఉత్తరం :** టి. మల్లిఖార్జున రావు గారి ఆస్తి. **ఫ్లాట్ నెం.505 హద్దులు : తూర్పు:** ఓపెన్ టు స్కై, **పడమర:** కామన్ కారిడార్, **దక్షిణం :** ఫ్లాట్ నెం.506, **ఉత్తరం :** ఫ్లాట్ నెం.504.

తేది: 18.09.2025, స్థలం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం
ఫారమ్ నెం.VI (ఎ)

Ref: B1/97/2025 **ది.23-09-2025**

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమాళి 2014లో రూల్ 19, సబ్ రూల్(1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్‌లో చూపబడిన ఏలూరు జిల్లా, బుట్టాయిగూడెం మండలం, కురస కన్నప్పగూడెం గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా వరరామచంద్రపురం మండలం, చొక్కనపల్లి గ్రామము, చింతూరు డివిజన్, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాశితులకు ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం డివిజన్, బుట్టాయిగూడెం మండలం, కురస కన్నప్పగూడెం గ్రామం నందు భూమికి భూమి కేటాయించు నిమిత్తం అవసరమై ఉన్నదని శ్రీ స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు భావించినందున భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము-2013 నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనల ననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఎరుక నిమిత్తము ఇందుమూలముగా నోటీసు జారీ చేయబడినది.

ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏమియూ లేవు.

స్పెషల్ కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-1, కొవ్వూరు వారికి, వారి సిబ్బందికి, పనివారికి ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-1, కొవ్వూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం/ కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది. పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా ప్రత్యేక కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-1, కొవ్వూరు వారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: ఏలూరు మండలం: బుట్టాయిగూడెం గ్రామం: కురస కన్నప్పగూడెం

వ. సంఖ్య	ఎల్.పి. నెం.	సర్వే నెం.	వివరణ	భూసేకరణ క్రింద విస్తీర్ణం	సంబంధిత ఆసామీ పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరములు
1	2	3	4	5	6	7				8
1	44	13	స.పుంజ	1.076	పాకనాటి రాజశేఖర్ తండ్రి: ఆదినారాయణ	ఎల్.పి. నెం. 63	ఎల్.పి. నెం. 45	ఎల్.పి. నెం. 46	ఎల్.పి. నెం. 43	కొబ్బరి-55,మామిడి-65, తాడి-21, డ్రిప్ పైపులైను
2	45	14	స.పుంజ	2.537	పాకనాటి రాజశేఖర్ తండ్రి: ఆదినారాయణ	ఎల్.పి. నెం. 189,43 44,46	కోటరామ చంద్ర పురం గ్రామం	ఎల్.పి. నెం. 47, 51	కోటరామ చంద్ర పురం గ్రామం	కొబ్బరి-274,మామిడి -90, జామాయిల్-9, టేకు-1,చింత-5, బోరు, డ్రిప్ పైపులైను
3	123	40	స.పుంజ	3.747	పాకనాటి చంద్రశేఖర్ తండ్రి: ఆదినారాయణ	ఎల్.పి. నెం. 121	కోటరామ చంద్ర పురం గ్రామం	ఎల్.పి. నెం. 124	ఎల్.పి. నెం. 118	పామాయిల్-248, కొబ్బరి-168,వేప-16, సీతాఫలం-6,బోరు-1, డ్రిప్,పనస-2,కుంకుడు -2,మామిడి-2,చింత-9, తాటి-12,టేకు-9,డ్రిప్
4	43	13	స.పుంజ	1.147	పాకనాటి చంద్రశేఖర్ తండ్రి: ఆదినారాయణ	ఎల్.పి. నెం. 63	ఎల్.పి. నెం. 45	ఎల్.పి. నెం. 44	ఎల్.పి. నెం.42, 187, 189, 188	మామిడి-58, కొబ్బరి-85, చింత-8, తాడి-9, టేకు-6,జీడిమామిడి-2, వేప-4, బోరు, డ్రిప్
5	122	15	స.పుంజ	1.055	పాకనాటి చంద్రశేఖర్ తండ్రి: ఆదినారాయణ	ఎల్.పి. నెం. 55	కోట రామ చంద్ర పురం గ్రామం	ఎల్.పి. నెం. 118	ఎల్.పి. నెం 54, 53, 51	పామాయిల్-85,కొబ్బరి-75,చింత-23,టేకు-13, జామాయిల్-1,వేప-18 తాటి-8,సీతాఫలం- -11, డ్రిప్
6	46	13	స.పుంజ	1.27	పాకనాటి విజయభాస్కర్ తండ్రి: ఆదినారాయణ	ఎల్.పి. నెం. 63, 70	ఎల్.పి. నెం. 45	ఎల్.పి. నెం. 48	ఎల్.పి. నెం 44	కొబ్బరి-62, మామిడి-28, జీడిమామిడి-6, తాడి-3, టేకు-5,పనస-6, నేరేడు-1,బోరు-1, సర్వీసు కనెక్షన్-1
7	69	20	స.పుంజ	3.354	పాకనాటి విజయభాస్కర్ తండ్రి: ఆదినారాయణ	ఎల్.పి. నెం. 75, 74	ఎల్.పి. నెం. 65, 70	ఎల్.పి. నెం. 71, 72	ఎల్.పి. నెం 66, 68	తాడి-26, వేప-8, టేకు-2, మునగ-13
	మొత్తం:			14.186						

సం/- **కె.సతీష్**
స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ)
ఆర్.ఎం.సి. యూనిట్-1, కొవ్వూరు

సం/- **యస్.సరళావందనం,** భూసేకరణాధికారి మరియు
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం

Chola
Enter a better life

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: చోళాక్రెస్ట్, సి54 & 55, సూపర్ బి-4, తిరువికా ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032, తమిళనాడు

ఇ-వేలం అమ్మకపు ప్రకటన (ఇ-బిడ్డింగ్ ద్వారా మాత్రమే అమ్మకం)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) మరియు 9(1) క్రింద జారీచేసిన స్థిరా సెక్యూర్డ్ అసెట్స్ యొక్క అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి సాధారణంగా మరియు **కాలమ్ (ఎ)**లో సూచించిన ప్రత్యేకంగా రుణగ్రహీతకు/హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా ఏమనగా **కాలమ్ (సి)**లో వివరించిన దిగువ స్థిరాస్తులను సెక్యూర్డ్ క్రెడిటార్ తనఖాపెట్టబడినవి/చార్జ్ చేయబడినవి వాటిని హౌసింగ్ **చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** సెక్యూర్డు క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి ద్వారా **కాలమ్ (డి)** వివరించినట్లు స్వాధీనంలోకి తీసుకున్నారు. అవి దిగువ పేర్కొన్న వివరాల ప్రకారం **'ఎక్కడ ఎలా ఉన్నది & అక్కడ అలాగే" మరియు "ఏదైతో ఎలా ఉందో అలాగే"** ప్రాతిపదికన విక్రయించబడును.

ఇందుమూలంగా సంబంధిత రుణగ్రహీత(లు)/తాకట్టుదారులు (మరణించారు)/ చట్టబద్ధ వారసులు, చట్టబద్ధ ప్రతినిధుల **(తెలిసిన లేదా తెలియని),** ఎగ్జిక్యూటర్స్, అడ్మినిస్ట్రేటర్స్, వారసులు మరియు సంబంధిత రుణగ్రహీత(లు)/తాకట్టుదారులు (మరణించిన) యొక్క అసైన్స్‌లకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని 8(6) క్రింద **కాలమ్ (ఎ)**లో సూచించినట్లుగా ఉంటుంది. అమ్మకంలోని వివరణాత్మక నియమ నిబంధనల కొరకు దయచేసి **చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** సెక్యూర్డు క్రెడిటార్స్ యొక్క వెబ్‌సైట్ అనగా https://www.cholamandalam.com & www.auctionfocus.inలో కల్పించిన లింకును రిఫర్ చేయండి.

క్ర. సం.	[A] రుణ ఖాతా నెంబరు/ రుణగ్రహీత(లు)/తనఖాదారు(ల)/ హామీదారుల పేరు	[B] రికవరీ చేయబడు బాకీపడిన బకాయిలు (సెక్యూర్డు డెట్స్)	[C] స్థిరాస్తి/ సెక్యూర్డు అసెట్ యొక్క వివరణ	[D] స్వాధీనతా రకం	[E & F] రిజర్వు ధర (రూ.లో) / ధరావత్తు (రూ.లో)	[G] వేలం తేది & సమయం
1.	Loan A/c. No(s). : LAP1VJI000048698 1) శ్రీ/శ్రీమతి బేబీ ప్రొద్దుటూరి 2) శ్రీ/శ్రీమతి కోటేశ్వర ప్రొద్దుటూరి (అలియాస్) కోటేశ్వరరావు ప్రొద్దుటూరి **చిరునామా:** 32-24-9, మొగల్‌రాజపురం, సిఎస్ఐ స్కూల్ రోడ్, విజయవాడ (అర్బన్), ఆంధ్ర ప్రదేశ్-520010. **ఇక్కడ కూడా:** ఆర్ఎస్ నెం.819-10 / డోర్ నెం.2-45, కాటూరు ఎస్‌సి కాలనీ మెయిన్ రోడ్, అసెస్ట్ నెం.140, కాటూరు గ్రామం, వుయ్యూరు మండలం, క్రిష్ణా జిల్లా-521164, ఆంధ్రప్రదేశ్, ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి కాటూరు-521164.	**19.09.2025** నాటికి బకాయిలు **రూ.23,99,462/-** (రూపాయలు ఇరవై మూడు లక్షలు తొంభై తొమ్మిది వేల నాలుగు వందల అరవై రెండు మాత్రమే)	కాటూరు గ్రామం, కాటూరు గ్రామ పంచాయతీ పరిధి, వుయ్యూరు మండలం, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రీ, కృష్ణా జిల్లా పరిధిలోని డోర్ నెం.2-45, అసెస్‌మెంట్ నెం.140, ఆర్.సి.సి. బిల్డింగ్ తో ఆర్ఎస్ నెం.819-10లో 336.7 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఆర్.సి.సి. భవనం యొక్క ఆస్తి మొత్తం. **సరిహద్దులు: తూర్పు:** దేవరపల్లి యేసుపాదం ఆస్తి 47.6అ.లు, **దక్షిణం:** పంచాయతీ సిమెంట్ రోడ్డు 63.6 అ.లు, **పడమర:** బుర్రే సుధాకర్‌ఆస్తి 47.8అ.లు, **ఉత్తరం:** 3.0 అ.ల వెడల్పు సొంత మార్గం 63.6 అ.లు. అన్ని సౌలభ్య హక్కులతో.	[illegible]	**రూ. 15,75,000/-** (రూపాయలు పదిహేను లక్షలు డెబ్బై ఐదు వేలు మాత్రమే) / **రూ.1,57,500/-** (రూపాయలు ఒకలక్ష యాభై ఏడువేల ఐదు వందలు మాత్రమే)	**13.10.2025** మ.02.00 గంటల నుండి సా.04.00 గంటల వరకు (టెండర్ డాక్యుమెంట్ ప్రకారం 5 నిమిషాల చొప్పున ఆటోమేటెడ్ పొడిగింపులతో),

తనిఖీచేయు తేది & సమయం: 10.10.2025న ఉ.11.00 గం.ల నుండి సా.4.00గం.లు | **కనీస బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/-**

బిడ్/ ధరావత్తు/ పాల్గొనడానికి అభ్యర్ధన లేఖ సమర్పించడానికి చివరి తేదీ: **11.10.2025న సా.05.00గం.ల వరకు**

• రుణ ఒప్పందం, యాదృచ్ఛిక ఖర్చులు, ఖర్చులు, ఛార్జీలు మొదలైన వాటితో వర్తించే తదుపరి వడ్డీతో పాటు చెల్లింపు తేదీ మరియు / లేదా దాని అమలు తేదీ వరకు.

ఆస్తి తనిఖీకి సంబంధించిన ఏదైనా సహాయం కోసం లేదా బిడ్ డాక్యుమెంట్ పొందడం కోసం మరియు ఏవైనా ఇతర సందేహాల కోసం, దయచేసి **చోళ మండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ**కి చెందిన అధికారులైన శ్రీ పరిమి శ్రీధర్, అతని మొబైల్ నెం.7337482233, ఇ-మెయిల్ ఐడి: Parimisv@chola.murugappa.com /**శ్రీమతి కోమల్ శర్మ, మొబైల్ నెం.8870464652** పై సంప్రదించండి. **చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ మరియు ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**కి చెందిన అధీకృత అధికారికి సంబంధించిన అత్యుత్తమ జ్ఞానం మరియు సమాచారం మేరకు పై స్థిరాస్తులు/ సెక్యూర్డు అసెట్స్‌కు సంబంధించి రుణభారాలు లేవు.

తేది: 24-09-2025
ప్రదేశం: క్రిష్ణా, ఆంధ్రప్రదేశ్

సం/-
అధీకృత అధికారి
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరపున

విద్యుత్ క్రాస్ సబ్సిడీకి మంగళం?

- కాస్ట్ టు సర్వ్‌పై కేంద్రప్రభుత్వం ఆలోచన
- రాష్ట్రాలతో సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులకు అందించే క్రాస్ సబ్సిడీకి మంగళం పాడి వినియోగదారులపై భారాలు మోపేందుకు కేంద్రప్రభుత్వం ఆలోచన చేస్తోంది. రాష్ట్రాలచేత దీనిని బలవంతంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తోంది.విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాల్లో ఉన్నాయనే పేరుతో కాస్ట్ టు టారీఫ్ పేరుతో వినియోగదారులపై భారాలు మోపే ఆలోచన చేస్తోంది. పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారుల నుంచి అధిక టారిఫ్‌లు వసూలు చేసి వ్యవసాయ, గృహ వినియోగదారులకు డిస్కంలు క్రాస్ సబ్సిడీ కింద తక్కువ ధరకు విద్యుత్ అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఫుల్ కాస్ట్ టారీఫ్ పేరుతో మొత్తాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేయాలని చూస్తోంది. ప్రస్తుత్తం 30 యూనిట్లు ఉపయోగించే వినియోగదారుడికి యూనిట్ ధర రూ.5.58లు డిస్కంలు వసూలు చేయాలి. కానీ క్రాస్ సబ్సిడీ ద్వారా అతనికి యూనిట్‌ను రూ.1.90లకే డిస్కమ్‌లు



అందిస్తున్నాయి. ఇప్పుడు ఈ క్రాస్ సబ్సిడీని ఎత్తివేసి రూ.5.58లను వినియోగదారుడి నుంచి వసూలు చేయాలనే ప్రయత్నం జరుగుతోంది.

క్రాస్ సబ్సిడీ 225 యూనిట్ల విద్యుత్ వినియోగించే వినియోగదారుడి వరకు ఇది అమలవుతోంది. ఇప్పుడు ఈ విధానాన్ని ఎత్తివేసి మొత్తం వసూలు చేయాలనే ప్రయత్నం చేస్తోంది. కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ నేతత్వంలో ఈ నెల 16న మంత్రుల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఫుల్ కాస్ట్ టారీఫ్ అమలు చేయాలని మంత్రి రాష్ట్రాలను కోరాడమే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యుత్ నియంత్రణ కమిషన్లు సమన్వయంతో సంస్కరణలు అమలు చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఈ సంస్కరణలను అమలు చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఈ విధానం అమలయితే గృహ వినియోగదారులపై పెద్దఎత్తున భారాలు పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఎఫ్‌పిపిసిఎ, ట్రూఅప్‌ల పేరుతో డిస్కంలు భారాలపై భారాలు మోపుతున్నాయి. ఇప్పుడున్న బిల్లులు మూడింతలు పెరుగుతాయి. నవంబర్, డిసెంబర్‌లలో డిస్కంలు తమ ఆదాయ, వార్షిక నివేదిక(ఎఆర్ఆర్)లను విద్యుత్ నియంత్రణ మండలికి సమర్పిస్తాయి. ఈ సమయంలో ఇలాంటి నిర్ణయం ప్రకటించి డిస్కంలు, విద్యుత్ నియంత్రణ మండలిని మానసికంగా సిద్ధం చేసే ఆలోచన కేంద్రప్రభుత్వం చేస్తోందని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. కేంద్రం రాష్ట్రాలపై సంస్కరణలను రుద్దడం ఫెడరలిజం స్ఫూర్తిని దెబ్బతీస్తోందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణానదికి కొనసాగుతున్న వరద

- బ్యారేజి వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 4.29 లక్షల క్యూసెక్కులు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

కృష్ణానదికి మరోసారి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. దీంతో విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. ఇక్కడ ఇన్ ఫ్లో, అవుట్‌ఫ్లో 4.29 లక్షల క్యూసెక్కులుగా ఉంది. బ్యారేజి 70 గేట్లలో 69 గేట్లను పైకెత్తి ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ఉధృతి 4.50 లక్షల క్యూసెక్కుల వరకు పెరిగే అవకాశం ఉన్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు అంచనా చేశారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో కృష్ణా నదిలో అత్యవసర సహాయక చర్యల కోసం నది ఘాట్లలో ముందస్తు జాగ్రత్తగా ఐదు ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలను ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర



విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ వెల్లడించారు. అధికార యంత్రాంగానికి ప్రత్యేక సూచనలు జారీ చేయడంతోపాటు ఘాట్ల వద్ద యాత్రికుల కదలికలను పోలీసు, నీటిపారుదల, మున్సిపల్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నది వద్ద బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

అర్హత సాధించినా దక్కని ఉద్యోగం

- అమరావతికి రావొద్దని డిఇఒ ఫోన్
- బాధిత మహిళా ఆవేదన

ప్రజాశక్తి-హిందూపురం

సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో నివాసం ఉంటున్న బుక్కపట్నం మండలం ధూపంపల్లికి చెందిన వరలక్ష్మి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డిఎస్‌సి పరీక్షలో ఆంగ్ల సబ్జెక్ట్ స్కూల్ అసిస్టెంట్‌లో 101వ ర్యాంకు సాధించి, ఎంపిక జాబితాలో 85 నంబర్‌లో ఉన్నారు. దీంతో ఆమెకు ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికైనట్లు విద్యాశాఖ అధికారులు సమాచారం ఇచ్చారు. అమరావతిలో నియామక ఉత్తర్వులు తీసుకునేందుకు బయలుదేరి, కార్యక్రమం వాయిదాతో వెనుతిరిగారు. బుధవారం అమరావతికి బయలుదేరాల్సి ఉండగా మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఆమెకు ఫోన్ చేశారు. అమరావతికి రావలసిన అవసరం లేదని డిఇఒ ప్రసాద్ బాబు ఆమెకు వివరించారు. దీంతో ఆమె ఒక్కసారిగా ఖంగుతింది. అర్హత సాధించినప్పటికీ తనకు ఉద్యోగం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబును కలిశారు. ఇది తన పరిధిలో లేదని రీజనల్ జాయింట్ డైరెక్టర్ పరిధిలో ఉందని ఆయన చేతులెత్తేశారు. ఈ విషయంపై వరలక్ష్మీ మాట్లాడుతూ... 2025 డిఎస్‌సిలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ సబ్జెక్టులో సెలెక్ట్ కావడం జరిగిందన్నారు. ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తయి, ఈనెల 10న విజయవాడ రమ్మని చెప్పారన్నారు. గుంటూరులో జరిగే మీటింగ్‌కు హాజరు కావాలని డిఇఒ ఆఫీస్ నుంచి సమాచారం వచ్చిందన్నారు. అయితే మంగళవారం రాత్రి డిఇఒ ఫోన్ చేసి సెలెక్ట్ కాలేదు. మీకంటే ముందు ర్యాంకు ఉన్న ఆంజనేయులు అనే అభ్యర్థికి ఉద్యోగం ఇచ్చామని చెప్పారన్నారు. అయితే తాను టిజిటిలో 250 ర్యాంకు సాధించానని ఆ ర్యాంకు ప్రకారం జోన్-4లో తీసుకున్నప్పటికీ టాప్ లిస్టులో రెండవ స్థానంలో 250 ర్యాంకుతో టిజిటి పోస్ట్‌కు తనకు అర్హత ఉందని చెప్పారు అందులో ఉద్యోగం ఇవ్వాలని అధికారులను కోరుతున్నప్పటికీ ఏ ఒక్కరు కూడా తన అభ్యర్థనను ఆలకించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆగని దుకాణాలు, తోపుడు బండ్ల తొలగింపు

- విశాఖలో వీధిన పడుతున్న వేలాది కుటుంబాలు
- చిరు వ్యాపారుల హక్కులను అణగదొక్కడం తగదు
- సిఎం, చీఫ్ సెక్రటరీకి మాజీ ఐఎఎస్ శర్మ లేఖ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో చిరు వ్యాపారుల దుకాణాల తొలగింపులో 'బుల్‌డోజర్' చర్యలకు దిగుతున్న నగర పాలకులు, రాష్ట్ర ప్రభుత్వ తీరు తీవ్ర దుమారం రేపుతోంది. రోడ్డు పక్కన చిన్నపాటి వ్యాపారాలతో జీవించే పేదల ఊపిరి (ఉపాధి)ని 'ఆపరేషన్ లంగ్స్ 2.0' పేరుతో కొద్ది రోజులుగా తీసేస్తున్నారు. విశాఖ నగరంలో ఇప్పటి వరకూ నాలుగు వేల పైచిలుకు దుకాణాలను, తోపుడు బండ్లను అధికారులు తొలగించేశారు. ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం పెల్లుబుకుతున్నా టిడిపి కూటమి సర్కారు లెక్కచేయడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల విశాఖకు పలుమార్లు గ్లోబల్ సదస్సులకొచ్చి ఇచ్చిన ఆదేశాలివేనా ? అంటూ ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం పట్ల 'కూటమి' ఎలా మొండి వైఖరితో ఉందో దుకాణాల వ్యవహారంలోనూ అదే కనిపిస్తోంది. విశాఖ నగరంలో ఎక్కడా చిందర వందరగా దుకాణాలు, జనం ఉండకూడదన్న ఆలోచనతో ఈ దుస్సాహసం ప్రభుత్వం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

వీధి వ్యాపారుల హక్కులను అణగదొక్కడమే : ఇఎఎస్.శర్మ

కేంద్ర ప్రభుత్వం 2014లో దేశ వ్యాప్తంగా వీధి వ్యాపారుల హక్కుల గుర్తింపు, రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తెచ్చి, వారి సంక్షేమం కోసం ప్రధానమంత్రి స్వనిధి పథకాన్ని అమలు చేసినా జివిఎంసి అధికారులు వారి హక్కులను అణగదొక్కాలని చూడడం దారుణమని మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ పేర్కొన్నారు. ప్రభుత్వ తీరుపై బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు, చీఫ్ సెక్రటరీకి ఆయన లేఖ రాశారు. 'వీధి వ్యాపారులు ఫుట్‌పాత్‌లు, రోడ్డు పక్కన చిరు వ్యాపారాలతో జీవనోపాధి పొందుతారు. ప్రభుత్వం అలాంటి చిన్న కుటుంబాల విషయంలో

కొమ్మాది శివశక్తి నగర్‌లో దుకాణాన్ని తొలగించి తీసుకెళ్తున్న జివిఎంసి సిబ్బంది

నిర్లక్ష్యం తగదు. రాజ్యాంగంలో 21వ ఆర్టికల్ కింద వారి జీవన హక్కు ఉంది. కేంద్రం 2014లో అందుకే ఒక ప్రత్యేక చట్టం చేసింది. ఆ ప్రకారం వారి వ్యాపారాలకు నగరంలో అనుమతులు ఇవ్వాలి. వారిని తొలగించి నిర్వాసితులను చేయడం తగని పని. విశాఖలో అధికారులు చిన్న షాపులను క్రూరంగా తొలగించడం రాజ్యాంగ విరుద్ధం. ప్రైవేట్ కంపెనీలు, ధనికుల మీద చూపించే ప్రేమ నిస్సహాయులైన వీధి వ్యాపారులు, చిన్నకారు ప్రజలపై చూపకపోవడం బాధాకరం. రూ. వేలాది కోట్లు గడిస్తున్న టిసిఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రైవేట్ కంపెనీలకు 99 పైసలకు రూ.కోట్లు విలువ చేసే భూములు ఇచ్చి మురికివాడ ప్రజల జీవనోపాధిని దెబ్బతీస్తారా ? కూటమి ప్రభుత్వంలో పెద్దవాళ్లకు ఒక న్యాయం, చిన్నవారికి ఒక న్యాయమా ?. సిఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించి పెద్ద భవనాలను నిర్మించే రాజకీయ నాయకుల మీద, ప్రభుత్వ భూములను ఆక్రమించుకునే ధనికుల మీద ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా రాజ్యాంగం ప్రకారం నడచుకుని చిరు వ్యాపారుల, ప్రజల హక్కులను రక్షిస్తారని ఆశిస్తున్నాను' అని ఆ లేఖలో ఇఎఎస్.శర్మ పేర్కొన్నారు.

కర్ణాటకలో 'ఒజి' విడుదలకు తొలగిన అడ్డంకులు

ప్రజాశక్తి-అమరావతి

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ నటించిన ఒజి సినిమా కర్ణాటకలో రిలీజ్ చేసేందుకు న్యాయపరమైన అడ్డంకులు తొలగిపయాయి. కర్ణాటకలో సినిమా ప్రదర్శనను నిలిపేస్తూ నెల్లూరు కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూ హైకోర్టు జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఆదేశాలిచ్చారు. కర్ణాటకలో ఒజి సినిమా ప్రదర్శన హక్కుల కోసం తాను చిత్ర నిర్మాత అయిన డివివి ఎంటర్టైన్మెంట్‌కు నగదు చెల్లించానని చెప్పి జెపిఆర్ ఫిలిమ్స్ ఎమ్‌డి నెల్లూరు కోర్టులో దావా వేశారు. దీంతో కర్ణాటకలో ఒజి సినిమా ప్రదర్శనను నిలిపేస్తూ ఈ నెల 18న వెలువడిన ఉత్తర్వులను డివివి ఎంటర్టైన్మెంట్స్ హైకోర్టులో సవాల్ చేసింది.

రాజధాని అమరావతిలోని సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

అక్టోబర్ 2 నాటికి పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా

- సిఆర్‌డిఎ కార్యాలయాన్ని పరిశీలించిన మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం రాయపూడి వద్ద నిర్మిస్తున్న సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయ భవనాన్ని బుధవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. అక్టోబర్ 2వ తేదీ దసరా పండుగ రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాలయాన్ని ప్రారంభిస్తారని భావిస్తున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భవనానికి విద్యుత్ అంతరాయాలు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కూడా చేయాలన్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా సబ్ స్టేషన్‌ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. సిఆర్‌డిఎ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సిఆర్‌డిఎ పరిధిలో విద్యుత్ ప్రమాదాలకు తావు లేకుండా అధునాతన భూగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బాధ్యతాయుతంగా అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా చంద్రబాబు తీర్చిదిద్దుతున్నారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సోలార్ ప్యానెల్స్, విండ్ టర్బైన్ల తయారీ కూడా చేపడుతున్నామని వివరించారు. జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది ప్రజలే కానీ.. న్యాయస్థానం కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఆర్‌డిఎ, విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.

మోహిత్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

తుడా ఛైర్మన్ హోదాలో మోహిత్ రెడ్డి మద్యం ముడుపుల సొమ్మును తరలించేందుకు తుడా వాహనాలను అధికారికంగా వాడుకున్నారని సిట్, సిఐడి తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదించారు. లాగ్ బుక్ మార్చి 3, 4, 5 తేదీల్లో అధికారిక వాహనం తిరుపతి పరిసరాల్లోనే ఉన్నట్లుందని, ఆ రోజు వాహనం హైదరాబాద్ వెళ్లినట్లు టోల్ ప్లాజా సిసిటివి ఫుటేజ్ స్పష్టం చేస్తోందని అన్నారు. మోహిత్ రెడ్డి పూర్వ నేరచరిత్ర, ఈ కారణాలతో ముందస్తు బెయిల్‌ను కొట్టేయాలని కోరారు. మద్యం కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసిపి నేత చెవిరెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డి వేసిన పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. తప్పుడు కేసు పెట్టారని రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది సి నాగేశ్వరరావు వాదించారు. ఓటర్లకు డబ్బు పంచితే అది ఇసి పరిధిలోని కేసు అవుతుందన్నారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం
ఫారమ్ నెం.VI (ఎ)
Ref: B1/99/2025 ది.23-09-2025
(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమాళి 2014లో రూల్ 19, సబ్ రూల్(1) ననుసరించి)
ప్రాధమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్‌లో చూపబడిన ఏలూరు జిల్లా, బుట్టాయిగూడెం మండలం, కొవ్వాడ గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా వరరామచంద్రపురం మండలం, చొక్కనపల్లి గ్రామము, చింతూరు డివిజన్, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాశితులకు ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం డివిజన్, బుట్టాయిగూడెం మండలం, కొవ్వాడ గ్రామం నందు భూమికి భూమి కేటాయించు నిమిత్తం అవసరమై ఉన్నదని శ్రీ స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు భావించినందున భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము-2013 నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనల ననుసరిచి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఎరుక నిమిత్తము ఇందుమూలముగా నోటీసు జారీ చేయబడినది.

ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏమియూ లేవు.

స్పెషల్ కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-1, కొవ్వూరు వారికి, వారి సిబ్బందికి, పనివారికి ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాధమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-1, కొవ్వూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం/ కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా ప్రత్యేక కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-1, కొవ్వూరు వారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు
జిల్లా: ఏలూరు మండలం: బుట్టాయిగూడెం గ్రామం: కొవ్వాడ

వ. సంఖ్య	ఎల్.పి. నెం.	సర్వే నెం.	వివరణ	భూసేకరణ క్రింద విస్తీర్ణం	సంబంధిత ఆసామీ పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరములు
1	2	3	4	5	6	7				8
1	11	4/1	స.పుంజ	7.00	మల్లిన రామచంద్రరావు తండ్రి: వీరన్న	స.నెం. 1	రాజా నగరం గ్రామము	స.నెం. 4/2A, 4/2B, 13	R.S. No. 2, 3	తాడి-479 (2 సం॥ వయసు) కొబ్బరి-16 (పెద్దవి), కొబ్బరి-58(చిన్నవి), టేకు-4, కరెంట్ సర్వీస్-1, ఫెన్సింగ్, వెదురు -10, డ్రిప్-1
2	1	13/1A1A	స.పుంజ	1.00	కొయ్యలమూడి నిర్మల భర్త: దొరబాబు	స.నెం. 4/1	స.నెం. 14	స.నెం. 13/1	స.నెం. 4/1	ఫెన్సింగ్-10 పోల్స్
3	4	2/1A1A	స.పుంజ	1.00	కొయ్యలమూడి నిర్మల భర్త: దొరబాబు	స.నెం. 1	స.నెం. 3	స.నెం. 4/1	స.నెం. 2/1	ఖాళీస్తలం
మొత్తం				9.00						

సం/- కె.సతీష్
స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ)
ఆర్.ఎం.సి. యూనిట్-1, కొవ్వూరు

సం/- యస్.సరళావందనం, భూసేకరణాధికారి మరియు
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం
ఫారమ్ నెం.VI (ఎ)
Ref: B1/91/2025 ది.23-09-2025
(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమాళి 2014లో రూల్ 19, సబ్ రూల్(1) ననుసరించి)
ప్రాధమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్‌లో చూపబడిన ఏలూరు జిల్లా, బుట్టాయిగూడెం మండలం, కోయరాజమండ్రి గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా వరరామచంద్రపురం మండలం, చొక్కనపల్లి గ్రామము, చింతూరు డివిజన్, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాశితులకు ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం డివిజన్, బుట్టాయిగూడెం మండలం, కోయరాజమండ్రి గ్రామం నందు భూమికి భూమి కేటాయించు నిమిత్తం అవసరమై ఉన్నదని శ్రీ స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు భావించినందున భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము-2013 నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనల ననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఎరుక నిమిత్తము ఇందుమూలముగా నోటీసు జారీ చేయబడినది.

ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏమియూ లేవు.

స్పెషల్ కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-1, కొవ్వూరు వారికి, వారి సిబ్బందికి, పనివారికి ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాధమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-1, కొవ్వూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం/ కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది. పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా ప్రత్యేక కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-1, కొవ్వూరు వారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు
జిల్లా: ఏలూరు మండలం: బుట్టాయిగూడెం గ్రామం: కోయరాజమండ్రి

వ. సంఖ్య	ఎల్.పి. నెం.	సర్వే నెం.	వివరణ	భూసేకరణ క్రింద విస్తీర్ణం	సంబంధిత ఆసామీ పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరములు
1	2	3	4	5	6	7				8
1	702	196/2	స.పుంజ	1.16	ముప్పిన నాగేశ్వరరావు తండ్రి: లక్ష్మయ్య	ఎల్.పి. నెం. 492	ఎల్.పి. నెం.705, 796, 1348	ఎల్.పి. నెం. 701	ఎల్.పి. నెం. 703	ఖాళీ స్థలం
2	1088	281/1	స.పుంజ	3.09	దగ్గు వెంకట మహేశ్వరరావు తండ్రి: సుబ్బారావు	ఎల్.పి. నెం. 1083	ఎల్.పి. నెం.1089, 1090	ఎల్.పి. నెం.1085, 1086, 1087	ఎల్.పి. నెం. 1091, 1096	ఖాళీ స్థలం
3	1083	281/1	స.పుంజ	2.41	దగ్గు సత్యనారాయణ తండ్రి: సుబ్బారావు	ఎల్.పి. నెం. 1025	ఎల్.పి. నెం.1088, 1096	ఎల్.పి. నెం.1027, 1081, 1082, 1084, 1085	ఎల్.పి. నెం. 1097, 1017	ఖాళీ స్థలం
4	1206	334/1A1, 334/2B	స.పుంజ	1.63	ముదునూరి ప్రసన్న తండ్రి: వెంకట రాము	ఎల్.పి. నెం. 1205	ఎల్.పి. నెం. 1208	ఎల్.పి. నెం. 1207	ఎల్.పి. నెం.1204, 1200	ఖాళీ స్థలం
5	813	161/1 161/1	స.పుంజ	1.60	చిత్రాజుల వెంకట రామ బ్రహ్మాచార్యులు తండ్రి: మంగయ్యచార్యులు	ఎల్.పి. నెం. 814	ఎల్.పి. నెం.867, 876, 869	ఎల్.పి. నెం.831, 832,833 834	ఎల్.పి.నెం. 808,803, 802,877, 807,809	ఖాళీ స్థలం
	877					ఎల్.పి.నెం. 802	ఎల్.పి.నెం. 876	ఎల్.పి.నెం. 813	ఎల్.పి.నెం. 878	
6	1085	326/1A, 326/1	స.పుంజ	2.15	దగ్గు వెంకటరావు తండ్రి: దొరయ్య	ఎల్.పి.నెం. 1084	ఎల్.పి.నెం. 1086	ఎల్.పి.నెం. 1029	ఎల్.పి.నెం. 1083	ఖాళీ స్తలం
7	1074	327/1B	స.పుంజ	1.03	పారేపల్లి ముసలయ్య తండ్రి: వెంకన్న	ఎల్.పి.నెం. 1073	ఎల్.పి.నెం. 1075	ఎల్.పి.నెం. 1070	ఎల్.పి.నెం. 1030	ఖాళీ స్తలం
8	181	126	స.పుంజ	4.00	బండి వరలక్ష్మి భర్త: రామకృష్ణ	ఎల్.పి. నెం. 182, 178	ఎల్.పి. నెం. 200, 205	ఎల్.పి. నెం. 183, 1334	ఎల్.పి.నెం. 177,179, 180,201, 202,203, 204	ఖాళీ స్తలం
9	456	187/1	స.పుంజ	3.65	కుంజం పద్మావతి	ఎల్.పి. నెం.448 454, 455	ఎల్.పి. నెం. 532	ఎల్.పి. నెం. 447, 533	ఎల్.పి. నెం. 457	బోరు-1, తాడి-5, వేప-5, టేకు-5
మొత్తం:				20.72						

సం/- కె.సతీష్
స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ)
ఆర్.ఎం.సి. యూనిట్-1, కొవ్వూరు

సం/- యస్.సరళావందనం, భూసేకరణాధికారి మరియు
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం
ఫారమ్ నెం.VI (ఎ)
Ref: B1/93/2025 ది.23-09-2025
(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమాళి 2014లో రూల్ 19, సబ్ రూల్(1) ననుసరించి)
ప్రాధమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్‌లో చూపబడిన ఏలూరు జిల్లా, బుట్టాయిగూడెం మండలం, చీమలవారిగూడెం గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా వరరామచంద్రపురం మండలం, చొక్కనపల్లి గ్రామము, చింతూరు డివిజన్, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్వాశితులకు ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం డివిజన్, బుట్టాయిగూడెం మండలం, చీమలవారిగూడెం గ్రామం నందు భూమికి భూమి కేటాయించు నిమిత్తం అవసరమై ఉన్నదని శ్రీ స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు భావించినందున భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము-2013 నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనల ననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఎరుక నిమిత్తము ఇందుమూలముగా నోటీసు జారీ చేయబడినది.

ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏమియూ లేవు.

స్పెషల్ కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-1, కొవ్వూరు వారికి, వారి సిబ్బందికి, పనివారికి ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాధమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-1, కొవ్వూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం/ కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది. పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా ప్రత్యేక కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-1, కొవ్వూరు వారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు
జిల్లా: ఏలూరు మండలం: బుట్టాయిగూడెం గ్రామం: చీమలవారిగూడెం

వ. సంఖ్య	ఎల్.పి. నెం.	సర్వే నెం.	వివరణ	భూసేకరణ క్రింద విస్తీర్ణం	సంబంధిత ఆసామీ పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరములు
1	2	3	4	5	6	7				8
1	186	51/1	స.పుంజ	1.069	పాకనాటి విజయభాస్కర్ తండ్రి: ఆదినారాయణ	ఎల్.పి. నెం.157, 173	ఎల్.పి. నెం. 189	కురస కన్నప్ప గూడెం గ్రామం	ఎల్.పి. నెం. 156, 158	ఖాళీ స్థలం
2		51/2	స.పుంజ							ఖాళీ స్థలం
3	188	51/3	స.పుంజ	0.875	పాకనాటి రాజశేఖర్ తండ్రి: ఆదినారాయణ	ఎల్.పి. నెం. 189	ఎల్.పి. నెం. 166	ఎల్.పి. నెం. 191	ఎల్.పి. నెం. 187	ఖాళీ స్థలం
4		51/6								బోరు-1,పైపులైను-1, ఎలక్ట్రికల్ పోల్-1, డ్రిప్-1
5	187	51/6	స.పుంజ	0.869	పాకనాటి చంద్రశేఖర్ తండ్రి: ఆదినారాయణ	ఎల్.పి. నెం.189	ఎల్.పి. నెం.166	ఎల్.పి. నెం.188	ఎల్.పి. నెం.165	డ్రిప్, కొబ్బరి-5
6	191	51/6	స.పుంజ	2.71	రెడ్డెం కృష్ణారావు తండ్రి: లక్ష్మయ్య	ఎల్.పి. నెం. 189	ఎల్.పి. నెం. 171	ఎల్.పి. నెం. 172	ఎల్.పి. నెం. 188, 166, 167, 168	ఖాళీ స్థలం
మొత్తం				5.523						

సం/- కె.సతీష్
స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ)
ఆర్.ఎం.సి. యూనిట్-1, కొవ్వూరు

సం/- యస్.సరళావందనం, భూసేకరణాధికారి మరియు
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం



ప్రముఖ కన్నడ నవలా రచయిత ఎస్.ఎల్.భైరప్ప ఇక లేరు

బెంగళూరు : ప్రముఖ కన్నడ నవలా రచయిత, తత్వవేత్త ఎస్ఎల్ భైరప్ప (94) కన్నుమూశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల 38 నిమిషాలకు గుండెపోటుతో కన్నుమూశారు. పదవీ విరమణ తర్వాత భైరప్ప మైసూరులో నివసిస్తున్నారు. వయసురీత్యా అనారోగ్య సమస్యల కారణంగా చికిత్స కోసం ఇటీవల ఆయన బెంగళూరుకు వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం ఆయనకు గుండెపోటు రావడంతో వెంటను ఆయన్ను బెంగళూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు.వంశవృక్ష, దాతు, పర్వ, మందార వంటి ప్రసిద్ధ నవలలను ఆయన రచించారు. ఆయన రచనలు చాలా వరకు ఆంగ్లం ఇతర భాషలలోకి అనువదించారు. ఆయన పద్మభూషణ్, పద్మశ్రీ, సరస్వతి సమ్మాన్, సాహిత్య అకాడమీ అవార్డులను, పలు ఇతర అవార్డులను అందుకున్నారు. నాయీ-నేరలు, మాటదాన, వంశవృక్ష, తబ్బలియు నీనాదే మగనే వంటి ఆయన రచనలు సినిమాలుగా చిత్రీకరించారు. గృహభంగం, దాతు వంటివి టివి సిరీస్‌లుగా రూపొందించబడ్డాయి.

ఎస్ భైరప్ప మృతి పట్ల సాహితీ స్రవంతి తీవ్ర సంతాపాన్ని తెలియజేసింది. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపింది. ఈ మేరకు సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, ప్రధాన కార్యదర్శి కె. సత్యరంజన్ ఒక ప్రకటన విడుదల చేశారు.

సిపిసి పాఠశాలను సందర్శించిన సిపిఎం బృందం

బీజింగ్ : ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్న సిపిఎం ప్రతినిధి బృందం అక్కడి చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) శాశ్వత పాఠశాలను సందర్శించింది. పాఠశాల ఉపాధ్యక్షులు గాంగ్ వీబిన్‌తో చర్చలు జరిపింది. సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ ప్రస్తుత ప్రపంచంలో మార్క్సిజం ప్రాధాన్యత తదితర అంశాలపై పార్టీ అభిప్రాయాలను వెల్లడించారు. ఎంఎ బేబీ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల ప్రతినిధి బృందం సోమవారం అర్ధరాత్రి బీజింగ్‌కు బయలుదేరిన సంగతి తెలిసిందే. ఈ బృందంలో బేబీతోపాటు పొలిట్‌బ్యూరో సభ్యులు మహ్మద్ సలీం, జితేంద్ర చౌదరి, ఆర్.అరుణ్ కుమార్, కేంద్ర కమిటీ సభ్యులు కె.హేమలత, సి.ఎస్.సుజాత వున్నారు. ఈ నెల 30 వరకు ఈ బృందం చైనాలో పర్యటించనుంది.

సగం భారం రాష్ట్రాలదే

అయినా గుర్తింపు లేదు

- హేతుబద్ధీకరణలో ఇంత జాప్యమా
- జిఎస్‌టి సంస్కరణలపై స్టాలిన్

చెన్నై : జిఎస్‌టి సంస్కరణల ద్వారా పౌరులకు కల్పించిన ఉపశమనంలో సగం భారాన్ని రాష్ట్రాలే భరిస్తున్నాయని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ చెప్పారు. అయినప్పటికీ రాష్ట్రాలకు తగిన గుర్తింపు లభించడం లేదని విమర్శించారు. జిఎస్‌టి పన్ను రేట్ల తగ్గింపులో జరిగిన జాప్యంపై ప్రధాని నరేంద్ర మోడీని నిలదీశారు. రాష్ట్రాలకు న్యాయబద్ధంగా అందాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు తీవ్ర పదజాలంతో స్టాలిన్ ఓ ప్రకటన విడుదల చేశారు. పన్నులు తగ్గించాలంటూ రాష్ట్రాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్రం పట్టించుకోలేదని, హిందీని బలవంతంగా రుద్దడాన్ని ప్రతిఘటించిన తమిళనాడు వంటి రాష్ట్రాలను శిక్షిస్తోందని విమర్శించారు. 'జిఎస్‌టి సంస్కరణలు, ఆదాయపన్ను మినహాయింపుల ద్వారా భారతీయులకు రెండున్నర లక్షల కోట్ల రూపాయలు ఆదా అవుతాయని ప్రధాని మోడీ చెబుతున్నారు. అయితే ప్రతిపక్ష

పార్టీలు మొదటి నుంచే ఈ డిమాండ్ చేస్తున్నాయి. ఎనిమిది సంవత్సరాల క్రితమే ఈ చర్యలు తీసుకొని ఉంటే దేశవ్యాప్తంగా అనేక కుటుంబాలు లక్షల కోట్ల రూపాయలు ఆదా చేసుకొని ఉండేవి' అని స్టాలిన్ గుర్తు చేశారు. ఉపశమన భారంలో రాష్ట్రాలు సగం భరిస్తున్నప్పటికీ గుర్తింపు లేకుండా పోతోందని ఆయన వాపోయారు. ఈ వాస్తవాన్ని కేంద్రం గుర్తించడం లేదని చెప్పారు. అంతేకాకుండా రాష్ట్రాలకు న్యాయంగా రావాల్సిన నిధులను కూడా నిరాకరిస్తోందని ధ్వజమెత్తారు. హిందీని రుద్దడాన్ని అంగీకరించనందునే తమిళనాడుకు సమగ్ర శిక్ష నిధులు ఇవ్వలేదని తెలిపారు. ఈ అన్యాయం ఎప్పుడు అంతమవుతుందని ప్రశ్నించారు.

సమాఖ్యను గౌరవించాలని కేంద్రానికి స్టాలిన్ సూచించారు. తమ హక్కుల రక్షణ కోసం, ప్రజల కోసం పనిచేస్తున్న రాష్ట్రాలను శిక్షిస్తే దేశం అభివృద్ధి చెందదని చెప్పారు. 'సమాఖ్యను గౌరవించండి. నిధులు విడుదల చేయండి. ప్రజలకు న్యాయంగా చెందాల్సిన వాటాను వారికి అందించి ప్రయోజనం పొందనివ్వండి' అని మోడీ ప్రభుత్వానికి స్టాలిన్ హితవు పలికారు.

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోయిస్టులు మృతి

రాంచీ : జార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో ఎన్‌కౌంటర్ చోటు చేసుకున్నది. భద్రతా దళాలతో జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. అనంతరం ఘటనా స్థలం నుంచి పోలీసులు ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. వీరిని నిషేధిత జార్ఖండ్ జన ముక్తి పరిషత్ (జెజెఎంపి)కి చెందినవారిగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. ఈ నెలలో జార్ఖండ్‌లో ఇది రెండో ఎన్‌కౌంటర్ కావటం గమనార్హం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ జాగ్వార్, గుమ్లా పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్‌ను జరిపాయి. ఈ క్రమంలో భద్రతా దళాలకు మావోయిస్టులు తారసపడ్డారు. ఇరు గ్రూపుల మధ్య భీకర కాల్పులు చోటు చేసుకున్నట్టు సమాచారం. బిష్ణుపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కెచ్‌కీ గ్రామం దగ్గరలోని అటవీ ప్రాంతంలో ఉదయం 8 గంటలకు ఎన్‌కౌంటర్ చోటు చేసుకున్నది. ఈ కాల్పుల్లోనే ముగ్గురు జెజెఎంపి మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం నుంచి మూడు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. సెర్చ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నట్టు తెలిపారు. మృతుల్లో ఒకరిపై రూ.5 లక్షల రివార్డు ఉన్నట్టు పోలీసు వర్గాలు చెప్పాయి. చనిపోయిన మావోయిస్టులను లోహర్‌డగా జిల్లాకు చెందిన లాలూ లోహ్రా, సుజిత్ ఒరౌన్, లాతేహార్‌కు చెందిన చోటూ ఒరౌన్‌లుగా గుర్తించినట్టు గుమ్లా జిల్లా ఎస్పీ హరిస్ బిన్ జమాన్ చెప్పారు. జార్ఖండ్‌లోని హజారీబాఘ్ జిల్లాలో ఈనెల ప్రారంభంలో భద్రతా బలగాలు జరిపిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు అగ్రశ్రేణి మావోయిస్టులు మృతి చెందిన విషయం విదితమే. ఇందులో కేంద్ర కమిటీ సభ్యులు సహదేవ్ సోరెన్‌పై రూ.1 కోటి, స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు రఘునాథ్ హెంబ్రామ్‌పై రూ.25 లక్షలు, కమిటీ సభ్యులు వీర్‌సేన్ గంఝూపై రూ.25 లక్షల రివార్డు ఉన్నది. ఈ ఏడాది జార్ఖండ్‌లో ఇప్పటి వరకు మొత్తం 32 మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేసినట్టు జార్ఖండ్ పోలీసులు తెలిపారు.

భారీగా మావోయిస్టుల లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లో 71 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దంతెవాడ జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్ వద్ద వీరు లొంగిపోయిన వీరిలో 50 మంది పురుషులు, 21 మంది మహిళలు ఉన్నట్టు సమాచారం.

డల్లాస్‌లో కాల్పులు : ముగ్గురు మృతి

డల్లాస్: అమెరికాలోని డల్లాస్‌లో ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేంద్రం సమీపంలో జరిగిన కాల్పుల ఘటనలో ముగ్గురు మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో కాల్పులకు పాల్పడిన వ్యక్తి కూడా ఉన్నాడని స్థానిక పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం, బుధవారం ఉదయం సుమారు 6:40 గంటల సమయంలో నార్త్ స్టెమన్స్ ఫ్రీవేలోని 8100 బ్లాక్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) విభాగానికి చెందిన డిటెన్షన్ కేంద్రం పక్కనే ఉన్న భవనం నుంచి దుండగుడు కాల్పులు ప్రారంభించాడు. ఈ దాడిలో కార్యాలయంలో ఉన్న ఒక వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కాల్పుల్లో గాయపడిన మరో ఇద్దరిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఒకరు మరణించారు. కాల్పులు జరిపిన వ్యక్తి కూడా కూడా మరణించినట్లు పోలీసులు తమ అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా ధ్రువీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, ప్రాథమిక విచారణ కొనసాగుతోందని తెలిపారు.

అమెరికాకు లొంగిపోయే ప్రసక్తే లేదు

- ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ

టెహ్రాన్ : అణ్వాయుధ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న ఇరాన్‌పై త్వరలోనే తిరిగి ఆంక్షలు విధిస్తామంటూ యూరోపియన్ నేతలు చేస్తున్న హెచ్చరికలపై ఆ దేశ సుప్రీం నేత అయతొల్లా ఖమేనీ స్పందించారు. అణ్వాయుధాలను తయారు చేయాలనే ఆలోచన ఏదీ తమకు లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో అమెరికాతో నేరుగా చర్చలు జరిపే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అమెరికాతో చర్చలు హానికరమని, అవి చివరి ముగింపు అవుతాయని వ్యాఖ్యానించారు. ఆంక్షల నుంచి తప్పించుకోవాలంటే చర్చలు జరపాల్సి ఉంటుందని ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ చెప్పినప్పటికీ అమెరికాతో సంప్రదింపులు జరపడానికి ఇరాన్‌కు కారణమేమీ లేదని ఖమేనీ చెప్పారు. 'యురేనియంను శుద్ధి చేసే విషయంలో మనం పురోగతి సాధించాం. అణ్వాయుధాలను అభివృద్ధి చేయాలని అనుకుంటున్న దేశాలు యురేనియంను 90 శాతం శుద్ధి చేస్తే మనం దానిని 60 శాతానికే పరిమితం చేశాం' అని ఖమేనీ మంగళవారం జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ తెలిపారు. యురేనియం శుద్ధిని ఆయుధ గ్రేడ్ స్థాయికి పెంచబోమని పునరుద్ఘాటించారు. తమకు అలాంటి ఆయుధాల అవసరం లేదని, అణ్వాయుధాలను కలిగి ఉండాలన్న కోరిక లేదని చెప్పారు. అమెరికాతో చర్చలు జరిపి ప్రయోజనమేమీ లేదని అంటూ వాటి ఫలితాన్ని వాషింగ్టన్ ముందుగానే ప్రకటించిందని గుర్తు చేశారు. 'చర్చల ఫలితమేమిటంటే అణు కార్యకలాపాలను, యురేనియం శుద్ధిని నిలిపివేయడం. ఇది చర్చించడం ఎలా అవుతుంది? అది ఆదేశించడం, తన నిర్ణయాన్ని రుద్దడం అవుతుంది' అని విమర్శించారు. అమెరికాతో చర్చలు నష్టదాయకమని చెబుతూ 'సంప్రదింపులు జరపకపోతే ఏదో చేస్తామని వారు బెదిరిస్తున్నారు. వారు ఆ పని చేస్తారు. అలాంటి చర్చలకు అంగీకరించడం అంటే ప్రమాదాన్ని కొనితెచ్చుకోవడమే అవుతుంది' అని తెలిపారు. బెదిరింపులకు భయపడినట్లు, లొంగిపోయినట్లు అవుతుందని చెప్పారు.

'ఇరాన్ యురేనియంను శుద్ధి చేయకూడదని అమెరికా చెబుతుంది. దాని అర్థం ఏమిటి? మా దేశం ఏ ఘనత కోసం అయితే కష్టపడి పని చేసిందో దానిని నాశనం చేయడం. అలాంటి పని చేయమని సలహా ఇచ్చే వారు ఎవరైనా సరే... వారిని చెంపదెబ్బ కొడతాం. దానిని ఎట్టి పరిస్థితులలోనూ అంగీకరించం' అని ఖమేనీ అన్నారు. ఇరాన్ అణు స్థావరాలపై గతంలో జరిగిన దాడులను ప్రస్తావిస్తూ 'వారు వచ్చి ఇరాన్ అణు స్థావరాలపై ఇక్కడా అక్కడా బాంబు దాడులు చేశారు. శుద్ధి అనేది ఓ సైన్స్. దానిని నాశనం చేయలేరు. బాంబులు, బెదిరింపులు వంటి చర్యలతో సైన్స్‌ను నిర్మూలించడం అసంభవం' అని చెప్పారు.

ఖమేనీ ప్రసంగాన్ని ఇరాన్ టీవీ ప్రసారం చేసింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ న్యూయార్క్‌లో ఐరాస సర్వసభ్య సమావేశానికి హాజరైన సమయంలోనే ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

ఒంటరవుతున్న అమెరికా!

- గాజాపై మరోసారి సమావేశమైన భద్రతా మండలి
- మండలి సభ్యుల్లో పెరుగుతున్న అసహనం

ఐక్యరాజ్య సమితి : ఫ్రాన్స్ సహా పలు దేశాలు పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించిన మరుసటి రోజే ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి మరోసారి గాజా విషయమై సమావేశమైంది. గాజా యుద్ధాన్ని ఎలా ముగించాలి, పశ్చిమాసియా ఘర్షణలను ఎలా పరిష్కరించాలనే అంశంపై అమెరికాకు, ఇతర దేశాలకు మధ్య గల భిన్నాభిప్రాయాలు ఈ సమావేశంలో మరోసారి వ్యక్తమయ్యాయి.

గాజా సంక్షోభాన్ని చర్చించేందుకు జరిగిన ఈ ప్రత్యేక సమావేశంలో ఒకరి తర్వాత మరొకరు ఇజ్రాయిల్ సాగిస్తున్న మిలటరీ దాడులు, గాజాలో నెలకొన్న బీభత్స పరిస్థితుల గురించి ప్రసంగించారు. వేలాదిమంది పాలస్తీనియన్లు చనిపోయారని, జనాభాలో దాదాపు 90శాతం మంది నిర్వాసితులయ్యారని, మెజారిటీ ప్రాంతాలన్నీ శిథిలాల కుప్పలుగా మారాయని, ఆకలితో ప్రజలు అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కాల్పుల విరమణ జరగాలని, మానవతా సాయాన్ని పెద్ద మొత్తంలో అనుమతించాలని పలు దేశాలు పిలుపునిచ్చాయి. ఇంత జరుగుతున్నా అంతర్జాతీయ సంస్థ నుండి ఎలాంటి కార్యాచరణ కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఇజ్రాయిల్‌కు రక్షణ కవచంలా అమెరికా వ్యవహరిస్తుండడమే అందుకు ప్రధాన కారణంగా వుంది. గత వారంలో భద్రతా మండలి గాజాలో కాల్పుల విరమణకు తీర్మానం చేసింది. 14మంది సభ్యులు అనుకూలంగా ఓటు వేయగా, అమెరికా వీటో చేసింది. ఈ తీర్మానం హమాస్‌ను ఖండించలేదని అమెరికా పేర్కొంది. పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించేందుకు తాజాగా జరుగుతున్న చర్యలను కూడా వాషింగ్టన్ వ్యతిరేకిస్తోంది.

ఏకాకవుతున్న అమెరికా

గాజాపై గత వారమే భద్రతా మండలి సమావేశమై



తీర్మానం చేసినా దాన్ని అమెరికా వీటో చేసినా వారం తిరక్కుండానే మళ్లీ భద్రతా మండలి సమావేశమైందంటేనే గాజాపై అమెరికాతో గల విభేదాలు ఎంతలా వున్నాయో, ఎంతగా ఏకాకవుతుందో స్పష్టమవుతోంది. మిత్రపక్షమైన ఇజ్రాయిల్‌ను రక్షించుకోవడానికి అమెరికా వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విముఖత వ్యక్తమవుతోంది. మరోవైపు గాజాలో అమానుషాలకు ఇజ్రాయిల్‌ను జవాబుదారీ చేయాలంటూ అంతర్జాతీయ డిమాండ్లు వెల్లువెత్తుతున్నా అమెరికా పట్టించుకోవడం లేదు.

ఎక్కడ చూసినా గాజాపైనే చర్చ

సోమవారం ప్రపంచనేతలు ఒక్కొక్కరుగా న్యూయార్క్ చేరుకోవడం ఆరంభించినప్పటి నుండి ఎక్కడ చూసినా, ఎవరు మాట్లాడినా గాజానే ప్రధాన అంశమైంది. అమెరికా మిత్రపక్షాలతో సహా ఒక దేశం తర్వాత మరొకటిగా జనరల్ అసెంబ్లీలో, భద్రతా మండలిలో, ద్వైపాక్షిక సమావేశాల్లో దీనిపైనే చర్చించారు, ప్రస్తావించారు. అమాయకులైన ప్రజలు వేలాదిగా చనిపోవడం, దాదాపు రెండేళ్ళుగా సాగుతున్న సుదీర్ఘ యుద్ధంతో పాలస్తీనా చిన్నారులపై పడుతున్న ప్రతికూల ప్రభావాల పట్ల వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మండలి సమావేశాలకు ఇజ్రాయిల్ హాజరు కాలేదు. అమెరికా రాయబారి స్పందిస్తూ దీనికన్నా హమాస్‌ను నిర్మూలించే అంశంపై మండలి దృష్టి పెడితే బాగుండేదని వ్యాఖ్యానించారు.

రెండేళ్లలో 80 సమావేశాలు

2023 అక్టోబరు 7న దాడి జరిగినప్పటి నుండి ఇప్పటివరకు ఈ రెండేళ్ల కాలంలో భద్రతా మండలి గాజా యుద్ధంపై 80సమావేశాలు జరిపింది. ఆ సమావేశాలన్నింటిలో గాజా కాల్పుల విరమణ తీర్మానాలను అమెరికా వీటో చేస్తూనే వచ్చింది.

పెరుగుతున్న అసహనం

దాదాపు ఏకగ్రీవంగా సభ్య దేశాలన్నీ ఆమోదించిన తీర్మానాన్ని కేవలం ఒకే ఒక శాశ్వత సభ్య దేశం వీటో చేయగలిగినట్లైతే ఇక ఐక్యరాజ్య సమితిలోనే అత్యంత శక్తివంతమైన విభాగమైన, అంతర్జాతీయ శాంతి భద్రతలకు బాధ్యత వహించే భద్రతా మండలికి గల సామర్ధ్యం, కాలానుగుణ్యతపైనే అనుమానాలు, ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పదే పదే కొనసాగుతున్న ఈ అభ్యంతరాలు, అడ్డంకులు భద్రతా మండలిని తీవ్ర అసహనానికి గురి చేస్తున్నాయి.

ఐరాస వేదికపై కాశ్మీర్‌ను ప్రస్తావించిన టర్కీ అధ్యక్షుడు

టర్కీ అధ్యక్షుడు తైయిప్ ఎర్డోగన్ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల వేదికపై మరోసారి కాశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. తీవ్రవాదాన్ని ఎదుర్కొనే విషయమై భారత్, పాక్‌ల మధ్య సహకారం వుండేలా చూడడం చాలా అవసరమని అన్నారు. ఐక్యరాజ్య సమితి తీర్మానాల ప్రాతిపదికన, చర్చల ద్వారా కాశ్మీర్ అంశం పరిష్కారమవాలని ఆశిస్తున్నామని వ్యాఖ్యానించారు.

భూముల రక్షణకు ఐక్య పోరాటాలు

(మొదటి పేజీ తరువాయి)

వారితో పనులు చేయించుకుంటున్నారని చెప్పారు. శ్రీశైలం, సోమశిల, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల నిర్వాసితులకు ఇప్పటికీ పునరావాసం కల్పించలేదని చెప్పారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పేదల భూముల్ని బలవంతంగా లాక్కుంటుంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. మాజీ సిఎం జగన్‌కు 2 వేల ఎకరాల భూమి ఉందని, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలకు వందల ఎకరాల్లో భూములున్నాయని, వారి భూములను ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నిచారు. ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహారాష్ట్రలో ఎఐకెఎస్ చేసిన పోరాటం తరహాలో రాష్ట్రంలో కూడా పోరాటం చేయాలన్నారు. కనీసం ఇద్దరు వామపక్ష పార్టీ నాయకులనైనా అసెంబ్లీకి పంపి ఉంటే ప్రజల సమస్యలు ప్రస్తావనకు వచ్చి ఉండేవన్నారు. ఎఐఎడబ్ల్యుయు కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ.. రైతులు చేస్తున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. పోరాట కేంద్రాలను తమ ఎంపీలతో కలిసి సందర్శించనున్నట్లు తెలిపారు. రైతు సంఘం నాయకులు బి.బలరామ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం భూ సంస్కరణలను అమలు చేయడం లేదన్నారు. జస్టిస్ పున్నయ్య కమిటీ సిఫార్సులు, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల ప్రకారం పేదలకు భూములు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బరావు అధ్యక్షత వహించారు. మహాధర్నా సందర్భంగా భూసేకరణ బాధిత రైతులు, నాయకులు అసెంబ్లీకి వెళ్లేందుకు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులను తప్పించుకుని లెనిన్ సెంటర్, అప్సర సెంటర్ మీదుగా 5వ నెంబరు రూట్‌లోకి ర్యాలీగా వెళ్లి ఆంధ్రా ఆసుపత్రి కూడలి వద్ద నిరసన తెలిపారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వై.కేశవరావు, ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో కీచక బాబా

- విద్యార్థినులపై లైంగిక వేధింపులు
- 17 మంది బాధితుల ఫిర్యాదు

న్యూఢిల్లీ : ఢిల్లీలో ఓ కీచక బాబా బాగోతాలు బయటకు వచ్చాయి. పలువురు విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు శ్రీ శారదా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ స్వామి చైతన్యానంద సరస్వతి ఎలియాస్ పార్థ సారథిపై ఆరోపణలు వచ్చాయి. బాధిత విద్యార్థినుల వాంగ్మూలాల ఆధారంగా పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు. ఆయనను పట్టుకోవటానికి పోలీసులు బృందాలు గాలింపు చర్యలను తీవ్రం చేశాయి. ఇప్పుడు ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీలోని వసంత్ కుంజ్ ప్రాంతంలో గల ఓ ప్రముఖ ఆశ్రమానికి పార్థసారథి డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన డైరెక్టర్‌గా ఉన్న విద్యాసంస్థలో ఆర్థికంగా బలహీన వర్గాలు (ఇడబ్ల్యుఎస్) కేటగిరిలో స్కాలర్‌షిప్‌లతో కొందరు విద్యార్థినులు పోస్ట్-గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ డిప్లొమా కోర్సులు చదువుతున్నారు.

నిందితుడు తమను లైంగిక వేధింపులకు గురి చేసేవాడని విద్యార్థినులు ఆరోపించారు. ఇక్కడ చదువుతున్న మొత్తం 32 మంది విద్యార్థినుల వాంగ్మూలాలను రికార్డు చేసిన పోలీసులు.. ఇందులో 17 మంది ఆ బాబాపై ఆరోపణలు వినిపించారని తెలిపారు. ఆయన తమపై అసభ్యకరమైన భాషను వాడేవాడనీ, అభ్యంతరకర సందేశాలు పంపేవాడనీ, శారీరకంగా కలవాలంటూ బలవంతం చేసేవాడని బాధితులు తెలిపారు. స్వామి చైతన్యానంద డిమాండ్లకు ఒప్పుకోవాలని మహిళా ఫ్యాకల్టీ, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కూడా తమపై ఒత్తిడి తెచ్చారని బాధితులు వాపోయారు. ఆశ్రమంలో పని చేసేకొందరు వార్డెన్లు తమను బాబాకు పరిచయం చేశారని వివరించారు. అంతేకాదు.. విద్యార్థినులను గదికి రమ్మనేవాడు. విదేశీ టూర్లు అంటూ వారిని ఆకర్షించే ప్రయత్నాలు చేసేవాడు. చెప్పినట్టు వినకపోతే మార్కులు తగ్గిస్తాననీ, ఫెయిల్ చేయిస్తానని బెదిరించేవాడు.

ఈ నిందితుడు విద్యార్థినులతో జరిపిన సందేశాలు బయటకు వచ్చాయి. బాధితుల వాంగ్మూలాల ఆధారంగా నిందితుడిపై లైంగిక వేధింపులు, ఇతర అభియోగాల కింద కేసును నమోదు చేసినట్టు పోలీసు ఉన్నతాధికారి అమిత్ గోయెల్ చెప్పారు. పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడి నివాసంతో పాటు బాధితులు పేర్కొన్న స్థలాల్లో కూడా సోదాలు నిర్వహించారు. కాగా నిందితుడు మాత్రం పరారీలో ఉన్నాడు.

సహాయ, పునరావాస చర్యల్లో చురుగ్గా పాల్గొనండి

- పార్టీ శాఖలకు సిపిఎం విజ్ఞప్తి
- కోల్‌కతా వరదల్లో మృతి చెందినవారికి సంతాపం

న్యూఢిల్లీ : కుండపోత వర్షాలు, ఆకస్మిక వరదలతో అతలాకుతలమవుతున్న కోల్‌కతాలో బాధిత ప్రజలకు సహాయ, పునరావాస చర్యలు అందించడంలో చురుగ్గా పాల్గొనాల్సిందిగా రెడ్ వలంటీర్లకు సిపిఎం పిలుపునిచ్చింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. కోల్‌కతా నగరంలో కురిసిన భారీ వర్షాల ఫలితంగా విద్యుద్ఘాతంతో, ఇతర ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు సిపిఎం తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేసింది. కోల్‌కతా నగర వ్యాప్తంగా తీవ్ర విధ్వంసాన్ని, నష్టాన్ని కలిగించిన ఈ వరదలు కేవలం కుండపోత వర్షాల వల్లనే సంభవించినవి కావని, తృణమూల్ ప్రభుత్వం ప్రజల కన్నా లాభాలకే ప్రాధాన్యతనిచ్చి, ప్రభుత్వ మౌలిక సదుపాయాలన్నింటినీ ఉద్దేశపూర్వకంగా తుడిచిపెడుతూ వచ్చిందని, ఒక పద్ధతి ప్రకారం చోటు చేసుకున్న ఈ నిర్లక్ష్యం ఫలితంగానే ఈ పరిస్థితులు ఎదురయ్యాయని పొలిట్‌బ్యూరో విమర్శించింది.

మరింత అధ్వానంగా మారుతున్న కోల్‌కతా వరద ముప్పును పరిష్కరించడంలో తృణమూల్ కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం, బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాల నేరపూరిత వైఫల్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని పొలిట్‌బ్యూరో ప్రకటన పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్యతలు వేరేచోట వున్నాయి. ఒకపక్క కార్పొరేట్ల కోసం స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, సుందరీకరణ కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నారు. మరోపక్క డ్రెయిన్లు పూడుకుపోయి, ప్రకృతిసిద్ధమైన జలాశయాలు నిండిపోయి, చిత్తడి నేలలు ధ్వంసమై, విపత్తు నిర్వహణా సన్నద్ధత అనేది కేవలం ప్రకటనలకే పరిమితమవుతోంది. ఈ వర్షాలు, వరదల్లో మరణించిన వారి కుటుంబాలకు తక్షణమే తగిన నష్టపరిహారం చెల్లించాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. యుద్ధ ప్రాతిపదికన సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని కూడా కోరింది. తక్షణమే బాధిత ప్రజలకు సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపట్టడంలో పాల్గొనాల్సిందిగా పశ్చిమ బెంగాల్‌లోని అన్ని శాఖలకు పొలిట్‌బ్యూరో పిలుపునిచ్చింది. ఇటువంటి కష్టకాలంలో చురుకుగా సేవలందించేందుకు రెడ్ వలంటీర్లు పాల్గొనాలని కోరింది.

5 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్

- జమ్మూ కాశ్మీర్‌లో నాలుగు, పంజాబ్‌లో ఒకటి
- అక్టోబరు 24న ఎన్నిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జమ్మూ కాశ్మీర్‌లో చాలాకాలం నుంచి ఖాళీగా ఉన్న నాలుగు రాజ్యసభ స్థానాలకు, పంజాబ్‌లో ఖాళీగా ఉన్న ఒక స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. బుధవారం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. దాదాపు నాలుగేళ్లుగా నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వీటితోపాటు పంజాబ్‌లో ఒక రాజ్యసభ స్థానానికి కూడా ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఇసి తెలిపింది. అయితే జమ్మూ కాశ్మీర్‌లో ఖాళీగా ఉన్న నాలుగు రాజ్యసభ స్థానాలకు మూడు వేర్వేరు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆ నాలుగు రాజ్యసభ స్థానాలు మూడు వేర్వేరు ద్వైవార్షిక సైకిళ్లలో ఉన్నాయని, కాబట్టి చట్ట ప్రకారం ఆ నాలుగు స్థానాలకు వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు 'ఎకె వాలియా వర్సెస్ కేంద్ర ప్రభుత్వం (1994)' కేసులో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించింది. ఖాళీ అయిన రాజ్యసభ స్థానాలు వేర్వేరు కేటగిరీలకు సంబంధించినవై ఉన్నప్పుడు ఆయా స్థానాలకు ఎన్నికలు వేర్వేరుగా నిర్వహించాలని నాడు ఢిల్లీ హైకోర్టు తీర్పు చెప్పింది. జమ్మూ కాశ్మీర్‌లో రెండు రాజ్యసభ స్థానాలు 2021 ఫిబ్రవరి 15న ఖాళీ కాగా, మరో రెండు స్థానాలు 2021 ఫిబ్రవరి 10 కంటే ముందు ఖాళీ అయ్యాయి. ఫిబ్రవరి 2021లో అప్పటి ఎంపిలు మీర్ మొహ్మద్ ఫయాజ్, షంషేర్ సింగ్, గులాం నబీ ఆజాద్, నజీర్ అహ్మద్ లావే పదవీకాలం ముగియడంతో జమ్మూ కాశ్మీర్‌లోని నాలుగు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఆ సమయంలో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రపతి పాలనలో ఉండటం, అసెంబ్లీ లేకపోవడంతో, ఆ నాలుగు స్థానాలకు ఎన్నికలు నిర్వహించలేదు. అలాగే ఆప్ ఎంపి సంజీవ్ అరోరా తన పదవికి రాజీనామా చేసి రాష్ట్ర కేబినెట్‌లో చేరడంతో పంజాబ్‌లో ఒక స్థానం ఖాళీ అయింది. ఈ 5 స్థానాలకు ఇప్పుడు ఎన్నికలు జరగబోతున్నాయి. అక్టోబరు 24న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఓట్లను లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు.

గాజా మానవతా సాయం బోట్లపై డ్రోన్లతో దాడులు

- గుర్తు తెలియని వస్తువుల జారవిడత, పెద్ద ఎత్తున పేలుళ్లు

ఏథెన్స్ : విచక్షణారహితంగా ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడులతో దయనీయమైన పరిస్థితుల్లో వున్న గాజా ప్రజానీకానికి మానవతా సాయం అందించే లక్ష్యంతో బయలుదేరిన సహాయక బోట్లపై ఇజ్రాయిల్ డ్రోన్లతో విరుచుకుపడింది. ప్రస్తుతం గ్రీస్ తీరంలో వున్న ఈ బోట్లపై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పలు డ్రోన్లతో దాడులు జరిగాయి. పెద్దగా పేలుళ్ళ శబ్దాలు వినిపించాయని ఎయిడ్ ఫ్లోటిల్లా నిర్వాహకులు, పాలస్తీనా అనుకూల కార్యకర్తలు తెలిపారు. "పలు డ్రోన్లు గుర్తు తెలియని వస్తువులను జారవిడిచాయి. కమ్యూనికేషన్లు స్తంభించిపోయాయి. అనేక బోట్ల నుండి పెద్ద ఎత్తున పేలుళ్ల శబ్దాలు వినిపించాయి." అని గ్లోబల్ సుముద్ ఫ్లోటిల్లా ఒక ప్రకటనలో తెలిపింది. ఎవరైనా మరణించారా లేదా అన్నది తెలియరాలేదు. తమను భయ భ్రాంతులకు గురిచేసేందుకే ఈ దాడులు జరుగుతున్నాయని, అయినా సరే తమను ఎవరూ అడ్డగించలేరని ఆ ప్రకటన పేర్కొంది. ఐదు బోట్లపై దాడులు జరిగాయని జర్మనీ మానవ హక్కుల కార్యకర్త, ఫ్లోటిల్లా సభ్యురాలు యాస్మిన్ ఏసెర్ ఒక వీడియోలో తెలిపారు. తాము కేవలం మానవతా సాయాన్ని అందించే లక్ష్యంతోనే బయలుదేరామని, తమ వద్ద ఎలాంటి ఆయుధాలు లేవని ఆమె తెలిపారు. ఎవరికీ తాము ఎలాంటి హాని కలిగించే పరిస్థితి లేదన్నారు. వేలాదిమంది ప్రజలను చంపుతూ, మొత్తంగా జనాభాను ఆకలితో మాడ్చి చంపుతున్నది ఇజ్రాయిల్ అని ఆమె విమర్శించారు. తమ కార్యకర్తలు 15 నుండి 16 డ్రోన్లను చూశారని ఏసెర్ చెప్పారు. రాత్రి 1.43గంటల సమయంలో పేలుళ్ళ శబ్దాలు రికార్డయినట్లు మరో వీడియో పేర్కొంది. గుర్తు తెలియని వస్తువులను విసురుతూ నాలుగు బోట్లను లక్ష్యంగా చేసుకున్నారని బ్రెజిల్ కార్యకర్త తియాగో అవిల్లా చెప్పారు. ఈ నెల ఆరంభంలో బార్సిలోనా నుండి గ్లోబల్ సుముద్ ఫ్లోటిల్లా బయలుదేరింది. గాజాకు మానవతా సాయం అందకుండా ఇజ్రాయిల్ అమలు చేస్తున్న ఆంక్షల నేపథ్యంలో వారికి అవసరమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో ఈ బోట్లు బయలుదేరాయి. ప్రస్తుతం ఈ బృందంలో 51 బోట్లు వున్నాయి. గ్రీక్ ద్వీపమైన క్రీట్ వద్ద చాలా బోట్లు ప్రస్తుతం వున్నాయి. ట్యునీషియాలో ఇప్పటికే రెండుసార్లు డ్రోన్లు దాడులు జరిగాయి.

సాయం అందనివ్వం : ఇజ్రాయిల్

ఆ బోట్లను గాజా చేరనివ్వబోమని, ఆ సాయం వారికి అందనివ్వబోమని ఇజ్రాయిల్ పేర్కొంది. జూన్, జులై మాసాల్లో సముద్ర మార్గం ద్వారా గాజాకు చేరడానికి జరిగిన ప్రయత్నాలను ఇజ్రాయిల్ అడ్డుకుంది. గాజా విషయంలో అంతర్జాతీయంగా తీవ్ర ఒత్తిళ్లువస్తున్నా ఇజ్రాయిల్ వాటిని బేఖాతరు చేసి తన ఇష్టమొచ్చిన రీతిలో వ్యవహరిస్తోంది.

ఎస్ఐఆర్ ప్రజాస్వామ్యానికి అతిపెద్ద ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

గురించి నేడు తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి బదులుగా, ఈసీ అఫిడవిట్లను డిమాండ్ చేస్తోందని తెలిపారు. లక్షలాది మంది ప్రజల ఓట్లను తొలగించడానికి దేశవ్యాప్తంగా కుట్ర జరుగుతోందని, బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్))ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్‌ను ప్రస్తావిస్తూ ఆయన ఆరోపించారు. ఓటు దొంగతనం అంటే దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, అత్యంత వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, బలహీనులు, పేదలకు చెందిన రేషన్లు, పెన్షన్లు, మందులు, పిల్లల స్కాలర్‌షిప్‌లు, పరీక్ష ఫీజులను దొంగిలించడమేనని ఖర్గే విమర్శించారు. 'ఓటర్ అధికార్ యాత్ర' బీహార్ ప్రజలలో అవగాహన పెంచిందని చెప్పారు. ఆర్థిక మాంద్యం, నిరుద్యోగం, రాజ్యాంగ సంస్థలను లక్ష్యంగా చేసుకుని బలహీనపరచడం వంటి అనేక సమస్యలతో భారత్ పోరాడుతోందని ఖర్గే తెలిపారు. " రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఇంకా నెరవేరలేదు. యువత ఉపాధి లేకుండా తిరుగుతోంది. నోట్ల రద్దు, జిఎస్‌టి వ్యవస్థ పట్టాలు తప్పాయి. ఎనిమిదేళ్ల తరువాత కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్న విధంగా జిఎస్‌టిలో సంస్కరణలను ప్రవేశపెట్టారని అన్నారు. మహాత్మా గాంధీ 100 ఏళ్ల నాటి 'స్వదేశీ' మంత్రాన్ని మోడీ ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ లేకుండా బీహార్‌లో 'డబుల్ ఇంజిన్' ఖాళీగా ఉందని అన్నారు.

జీవన సౌరభం

అజ్ఞానం కన్నా నిర్లక్ష్యమే ఎక్కువ నష్టాన్ని కలిగిస్తుంది.

మీ కోసం

సూదిలో దారం సులభంగా ఎక్కాలంటే దారాన్ని గమ్‌టేపులో చుట్టి చిన్న ముక్కలా మొనతేలేలా కత్తిరించుకోవాలి. ఇప్పుడు ఈ టేప్ ముక్కను సూది రంధ్రం గుండా పోనిస్తే దాంతో పాటే దారం కూడా వచ్చేస్తుంది.

మార్పు

రవి వాళ్ళ నాన్నకు విజయవాడ నుంచి తెనాలికి బదిలీ అయింది. రవి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతానని పట్టు పడితే 'సరే రేపు వెళదాం నేను మా కార్యాలయంలో రిపోర్ట్ చేసి వస్తాను' అన్నాడు వాళ్ల నాన్న. తరువాత రోజు, ఇద్దరూ ప్రభుత్వ పాఠశాలకు వెళ్ళారు. హెడ్ మాస్టర్ వాళ్ళని చూడగానే 'ఏ తరగతిలో చేర్చాలి, మీరు ఏమి చేస్తారు?' అని అడిగారు. 'సర్ నేను నీటిపారుదల శాఖలో ఇంజినీర్‌ని' అని రవి వాళ్ల నాన్న చెప్పగానే హెడ్ మాస్టర్ షాక్ అయ్యారు.

'ప్రభుత్వ పాఠశాలలోనే మీ అబ్బాయిని ఎందుకు చేర్పిస్తున్నారు' అని హెడ్ మాస్టర్ అడిగినప్పుడు రవి తండ్రి నవ్వుతూ 'ప్రభుత్వ పాఠశాలలోనే శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారు. చక్కగా బోధిస్తారు అని నా నమ్మకం. ఫలితాలు కూడా బాగుంటాయి. పైగా మా అబ్బాయి కూడా మీ పాఠశాలే ఇష్టపడుతున్నాడు. మా వాడికి 10వ తరగతిలో ప్రవేశం ఇవ్వండి' అన్నారు. ఆ సమాధానం విన్న హెడ్ మాస్టర్, సంతోషంతో రవిని స్కూల్లో చేర్పించుకున్నారు. రవి వాళ్ల నాన్న చేసిన పని చూసి తోటి ఉద్యోగులు కూడా తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని అనుకున్నారు. అలా చాలా తక్కువ కాలంలోనే ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు ఆ బడిలో చేరారు.

– కనుమ ఎల్లారెడ్డి,
తాడిపత్రి,
93915 23027.



మా గురువులు

తల్లిదండ్రుల తర్వాత పూజింపపడేవారు
ఎన్నో విద్యాబుద్ధులు నేర్పేవారు
మనల్ని తమ బిడ్డలుగా భావించేవారు
మనకు మంచి దారిని చూపేవారు
మన విద్యా వికాసానికి
ఎదుగుదలకు మన చేత అడుగులు వేయించేవారు
మన జీవన గమనానికి మార్గదర్శకులు
ఓర్పు, సహనాలకు నిలువుటద్దాలు
ఎప్పటికైనా మన గొప్ప స్థానాల్ని కోరుకునేవారు
తప్పులకు శిక్షిస్తూ, మన ఎదుగుదలకు
అభినందిస్తూ
మన జ్ఞానాన్ని పెంపొందిస్తూ
మనల్ని విజ్ఞానవంతులు చేయడానికి,
శ్రమిస్తూ, అలసిపోయినా, నీరసించినా
మన అభివృద్ధిని కోరుకునేవారు గురువులు
మన భవిష్యత్తు కోసం
ఎంతో శ్రమించే గొప్ప దివిటీలు మన గురువులు!

– ఆర్. జశ్విత,
10వ తరగతి
అరవింద మోడల్ స్కూల్,
మంగళగిరి.

నేను గీసిన బొమ్మ

లక్ష్య,
2వ తరగతి,
దక్ష స్కూలు,
కాకినాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అందరూ ఒకటై .. పండుగల సందడై ...

ఇది భారతదేశం. ఇక్కడ అన్ని మతాలూ సమానం. సంస్కృతి, సాంప్రదాయాలు ప్రత్యేకంగా కనిపించినా, వేడుకలు, ఉత్సవాలు వేర్వేరుగా ఉన్నా అన్ని మతాల వారు వాటిని ఐక్యంగా నిర్వహించుకోవడం ఇక్కడ అనాదిగా వస్తున్న ఆచారం. అలా ఇప్పుడు దసరా పండుగకి ఊరూవాడా ముస్తాబయ్యింది. రంగురంగుల దీపకాంతులతో, కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుద్కాంతులతో వీధులన్నీ కొలువుతీరాయి. బట్టలు, నగలు, మిఠాయి కొట్లన్నీ జనంతో కిటకిటలాడుతున్నాయి. ఇవన్నీ పండుగని మరింత అందంగా మారుస్తున్నాయి. అయితే పండుగ అంటే వీటన్నింటికంటే ముఖ్యంగా గుర్తుకురావాల్సింది మత సామరస్యం. ఏ కాస్త అవకాశం వచ్చినా మతం పేరుతో విద్వేష వ్యాఖ్యలు చేసే పాలకులు పెరిగిపోతున్న ప్రస్తుత కాలంలో పండుగంటే కుల, మత భేదం లేకుండా మనుషులంతా కలిసి చేసుకునే ఆనందాల వేడుక అని నిరూపించాలి. అలా మన దేశంలో దశాబ్దాల తరబడి హిందూ–ముస్లిం కలిసి చేసుకునే దసరా పండుగ.. మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది.

పశ్చిమ బెంగాల్ : ఈ రాష్ట్రంలో హుగ్లీ ప్రాంతంలో నివసించే నంది అనే హిందూ కమ్యూనిటీ దసరా సందర్భంగా ప్రతి ఏడాది ముస్లిం కుటుంబాలకి అన్నదానం చేస్తోంది. 200 సంవత్సరాలకు పైగా ఈ ఆనవాయితీని అనుసరిస్తున్న ఈ కమ్యూనిటీ పెద్ద 80 ఏళ్ల సతిపతి నంది దీనిపై ఇలా వ్యాఖ్యానించారు. 'ఇది సహజంగా పాటిస్తున్న సాంప్రదాయం. భారతదేశం హిందూ–ముస్లిం సమకాలీన సమాజం' అంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దుర్గాపూజకి ప్రత్యేకంగా ఏర్పాటు చేసే 'దుర్గా పండళ్లు' దసరా పండుగకి మరింత శోభని తీసుకువస్తాయి. అలా ఇక్కడ సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన ప్రతి 'దుర్గా పండల్'లో ముస్లిం సోదరుల భాగస్వామ్యం తప్పకుండా ఉంటోంది.

రాంచీలోని కర్బలా చౌక్ శ్రీశ్రీ దుర్గా మందిర్ పండల్

జార్ఖండ్ : రాంచీలోని కర్బలా చౌక్‌లో నిర్వహించే దసరా పండుగని హిందూ–ముస్లిం సోదరులు కలిసిమెలిసి జరుపుకుంటారు. 30 ఏళ్లుగా ఈ సాంప్రదాయాన్ని అక్కడ కొనసాగిస్తున్నారు. 'శ్రీశ్రీ దుర్గా మందిర్' పేరుతో ఏర్పాటుచేసే దుర్గా పండల్ నిర్మాణంలో పండల్ అలంకరణ చేయడంలో, భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో, సాయంత్రాలు నిర్వహించే వేడుకల్లో పెద్ద పెద్ద డప్పులు కొట్టడంలో ఏ కార్యక్రమంలో చూసినా ముస్లిం సోదరులు కనిపిస్తారు. కమిటీ నిర్వాహకుడు అఫ్రోజ్ అలమ్ ఈ సాంప్రదాయంపై ఈవిధంగా వ్యాఖ్యనించారు. 'దసరా అంటే గుర్తుకు రావాల్సింది కేవలం ఆరాధనే కాదు. ఈ దేశంలో ప్రజలంతా సోదరభావంతో ఎలా కలసిమెలిసి ఉంటున్నారో చెప్పే గొప్ప వేడుకగా ఇది గుర్తుకురావాలి. 1995 నుండి ఈ పండుగని మేమంతా కలిసి నిర్వహించుకుంటున్నాం' అంటున్నారు.

ఇక్కడే దుర్గా పూజని నిర్వహించే పురోహితుడు అర్జున్ దుబే కూడా దీనిపై మాట్లాడారు. 'హిందూ–ముస్లిం కలసి ఓ కమ్యూనిటీగా ఏర్పడి దసరా పండుగ నిర్వహించుకోవడం ఇక్కడ జరుగుతోంది. ఈ ప్రాంతంలో మేము 200 కుటుంబాలే ఉన్నాం. అయినా ఇక్కడి ముస్లిం సోదరులు మాకు అండగా నిలబడి దసరా పండుగని ఓ వేడుకలా నిర్వహిస్తున్నారు. మేము ఇక్కడ మైనార్టీలం. అయినా దేశంలో ఒక వర్గం ప్రజలు అనుకుంటున్నట్లు మా ఇరుగుపొరుగు ముస్లిం సోదరులతో మాకు ఎప్పుడూ ఇబ్బందులు రాలేదు. చాలా ప్రశాంతంగా మేము ఇక్కడ కలిసిమెలిసి జీవిస్తున్నాం. పండుగలన్నీ సంబరంగా చేసుకుంటాం' అంటున్నారు.

'అజంతా శిల్పాలయం'లో సిద్ధమవుతున్న దుర్గా ప్రతిమలు

అసోం : రంగియా ప్రాంతంలో నిర్వహించే దసరా పండుగ నిర్వహణలో ముస్లింల పాత్ర ప్రత్యేకమైనది. దుర్గా పండళ్లకి దేవీ విగ్రహాలను సరఫరా చేసే పురాతన శిల్పాలయం 'అజంతా శిల్పాలయ'కి ముడిసరుకుని అందించే సరఫరాదారుల్లో అత్యధిక మంది ముస్లింలే ఉంటున్నారు. '1950 నుండి ఈ ప్రక్రియ కొనసాగుతోంద'ని శిల్పాలయ యజమాని నంద్‌పాల్ అంటున్నారు. 'అబ్దుల్ రహమాన్ ప్రతిమలకి అవసరమైన మట్టి, బియ్యంపొట్టు వంటి వాటిని చాలాకాలంగా సరఫరా చేస్తున్నారు. నేను, ఆయన ఇప్పుడు ముసలివాళ్లం అయ్యాం. ఈ సాంప్రదాయం మా తరువాతి తరం కూడా కొనసాగించడానికి సిద్ధంగా ఉంది' అని నంద్‌పాల్ చెబుతున్నప్పుడు అతని కళ్లు సంతోషంతో మెరిశాయి. 'శిల్పాలయ'కి అబ్దుల్‌తో పాటు, ఖబీర్, అహ్మద్ కూడా ముడిసరుకును సరఫరా చేసేవారిలో ఉన్నారు.

ఒరిస్సా–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు : బర్ఘాహ్ జిల్లాలోని సొహెలా ప్రాంతం దసరా పండుగని మత సామరస్య వేడుకగా 75 ఏళ్లకి పైగా నిర్వహిస్తోంది. 1944లో ఏర్పడ్డ దసరా ఉత్సవ కమిటీలో ముస్లింలు కీలక సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కమిటీ నిర్వాహకులు కాంగ్రెస్, బిజెపి పార్టీల మాజీ సభ్యులు ప్రకాష్‌చంద్ర, ఎండీ రఫీక్ ఈ వేడుకల గురించి ముక్తకంఠంతో ఇలా అంటున్నారు...: 'దేశంలో చాలా చోట్ల హిందూ–ముస్లిం వర్గాల మధ్య విభేదాలు సృష్టించాలని చాలామంది ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇక్కడి సమాజం ఎప్పుడూ రాజీపడలేదు. ప్రతి సంవత్సరం మేమంతా కలిసి ఈ పండుగ నిర్వహించుకుంటాం. మా వారసత్వాన్ని ఇప్పుడు యువతరం కూడా ముందుకు తీసుకెళ్లడం చాలా ఆనందంగా ఉంది' అంటున్నారు.

ఒడిషా : కటక్‌లో నిర్వహించే దుర్గాపూజకి దేవీ విగ్రహాలకి అలంకరించే జరీ చీరలను ముస్లిం సోదరులు తయారు చేస్తున్నారు. 'జరీ మేధ' పేరుతో ముస్లిం కళాకారులు తరతరాలుగా ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. యువకులకి కూడా ఈ కళలో శిక్షణ ఇస్తున్నారు. భువనేశ్వర్, రూర్కెలా తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన దేవీ ప్రతిమలకి జరీ ఆకృతులని సరఫరా చేసే సయ్యద్ అస్లామ్ అలీ దీని గురించి ఇలా మాట్లాడారు. '10 నుండి 22 అడుగుల జరీ మేధని మేము తయారు చేస్తాం. దుర్గా పూజకి 6 నెలల ముందు నుండే మా పని ప్రారంభమౌతుంది. భద్రక్, ధెన్కాల్, బెహ్రాంపూర్ నుండే కాక, కలకత్తా, హైద్రాబాద్ నుండి కూడా మాకు ఆర్డర్లు వస్తాయి' అని చెబుతున్నారు. ఈ ఏడాది హైద్రాబాద్ జగన్నాథ్ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన గణేష్ ప్రతిమకి అబ్దుల్ 10 అడుగుల 'జరీ మేధ'ని అందించినట్లు చెప్పారు. 35 ఏళ్లుగా ఈ పనిలో నిమగ్నమైన అబ్దుల్ తన 10 వయస్సు నుండే తండ్రి సయ్యద్ దగ్గర ఈ కళని ఒంటబట్టించుకున్నారు.

జరీ మేధ తయారీలో అబ్దుల్

దేశంలో చాలా చోట్ల ఏ పండుగ జరిగినా హిందూ– ముస్లిం సోదరభావంతో వాటిని నిర్వహించుకోవడం కనిపిస్తోంది. మన దేశం మత సామరస్యానికి ప్రతీక అనడానికి ఇంతకంటే ఉదాహరణ మరొకటి లేదు.

'ఓజీ' కోసం తప్పుకున్న 'మిరాయ్'

పవన్ కళ్యాణ్ నటించిన 'ఓజీ' చిత్రం నేడు (సెప్టెంబరు 25) విడుదలవుతోంది. హైదరాబాద్‌లో ఈ ఒక్క రోజే ఈ సినిమా కోసం 550 స్పెషల్ షోలను థియేటర్ యాజమాన్యాలు ప్లాన్ చేశాయి. ఇప్పటికే వాటన్నింటినీ హౌస్‌ఫుల్‌గా ప్రకటించారు. ఇతర చిన్న థియేటర్ల యాజమాన్యాలు కూడా ఇతర సినిమాల షెడ్యూళ్లను తక్షణమే మార్చేస్తున్నాయి. ఇటీవలే విడుదలై ప్రేక్షకులను అలరిస్తున్న 'మిరాయ్' సినిమా నిర్మాతలు ఒక నిర్ణయం తీసుకున్నారు. మిరాయ్ నిర్మాత టి.జి. విశ్వప్రసాద్, హీరో తేజ సజ్జా 'ఓజీ'కి స్క్రీన్ క్లియర్ చేశారు. దీంతో సెప్టెంబర్ 25న, 'మిరాయ్' సినిమా స్క్రీన్‌పై ప్రదర్శించబడదు. సెప్టెంబర్ 26 (శుక్రవారం) నుండి కేటాయించిన స్క్రీన్లలో 'మిరాయ్' సినిమాను ప్రదర్శించనున్నారు.

'భూతం ప్రేతం' టైటిల్‌తో ...

రాజేష్ ధృవ దర్శకత్వంలో ఓ ప్రాజెక్ట్ రాబోతోన్నది. సృజన ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బి. వెంకటేశ్వర రావు నిర్మించిన ఈ చిత్రంలో యాదమ్మ రాజు, గల్లీబాయ్ భాస్కర్, బిగ్ బాస్ ఇమాన్యుయేల్, బల్వీర్ సింగ్, గడ్డం నవీన్, పవన్ శెట్టి, రాజేష్ ధృవ, రాధిక అచ్యుత్ రావు నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, ఫస్ట్‌లుక్, గ్లింప్స్‌ను అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి 'భూతం ప్రేతం' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. టైటిల్ రిలీజ్ చేసిన అనంతరం అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. 'భూతం ప్రేతం' టైటిల్, ఫస్ట్ లుక్ చాలా బాగుంది. సినిమా టీంకు ఆల్ ది బెస్ట్. పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అన్నారు. ఈ ఏడాదిలోనే ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది.

సంక్రాంతి తర్వాతే 'కరుప్పు'

తమిళ కథానాయకుడు సూర్య నటించిన 'చిత్రం 'రెట్రో' ఇటీవలే విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. మరో రెండు సినిమాల్లో ఆయన నటిస్తున్నారు. అందులో 'కరుప్పు' సినిమా ఒకటి. నటి త్రిష నాయికి. ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. సాయి అభయంకర్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఇందులో నటి శ్వాసిక, ఇందిరెన్స్, యోగి బాబు, శివదా, సుప్రీత్‌రెడ్డి తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే డివోషనల్ అంశాలతో సాగే సోషియల్ కథాచిత్రంగా 'కరుప్పు' రూపొందుతోంది. ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. సంక్రాంతి సందర్భంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు గతంలో ప్రకటించారు. అయితే ఈ సినిమా వాయిదా పడే అవకాశం ఉన్నట్లుగా సమాచారం. సంక్రాంతికి విజయ్ కథానాయకుడుగా నటించిన జననాయకన్ విడుదల కానుంది. ఆపై శివకార్తికేయన్, రవి మోహన్, శ్రీ లీల, అధర్వ కలిసి నటిస్తున్న 'పరాశక్తి' కూడా రానుంది. సంక్రాంతి కోసం తెలుగులో ఇప్పటికే భారీగానే సినిమాలు ఉన్నాయి. అందుకే సూర్య నటించిన 'కరుప్పు' సినిమా సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్‌గా విడుదల చేయాలని చిత్ర యూనిట్ భావిస్తున్నట్లు తాజా సమాచారం.

సాయి పల్లవి, అనిరుధ్, ఎస్‌జే సూర్యలకు కలైమామణి

సాహిత్యం, సంగీతం, నాటకం వంటి రంగాల్లో కృషి చేసిన వారికి తమిళనాడు ప్రభుత్వం అందించే కలైమామణి అవార్డులను 2021, 2022, 2023 సంవత్సరాలకు గాను ప్రకటించింది. అక్టోబర్‌లో చెన్నైలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. రాష్ట్రంలో అత్యున్నత పౌర పురస్కారంగా 1954 నుంచి ఈ అవార్డులను అందిస్తున్నారు. నటి సాయి పల్లవి, దర్శకుడు–నటుడు ఎస్.జె.సూర్య, దర్శకుడు లింగుసామి (2021), నటుడు విక్రమ్ ప్రభుతో పాటు మరో ముగ్గురు (2022), సంగీత స్వరకర్త అనిరుధ్ రవిచందర్, నటుడు మణికందన్ (2023) ఉన్నారు. 2021– 2023 సంవత్సరాలకు సంబంధించి ఈ అవార్డు కోసం మొత్తం 90 మంది కళాకారులు ఎంపికయ్యారు. కొరియోగ్రాఫర్, నటుడు శాండీతో పాటు నేపథ్య గాయని శ్వేతా మోహన్ వంటి స్టార్లు ఉన్నారు. జాతీయ పురస్కారాల విభాగంలో నేపథ్య గాయకుడు కె.జె.ఏసుదాస్‌కు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి పురస్కారాన్ని ప్రకటించారు. 1954లో తమిళనాడు ప్రభుత్వం స్థాపించిన తమిళనాడు ఈశై నాటక మండలి ద్వారా ఈ అవార్డు ప్రారంభించించారు. కమల్‌హాసన్, రజినీకాంత్, ఇళయరాజా, ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం, వైఎస్ సుధా రఘునాథన్, వైజయంతీమాలా వంటి ప్రముఖులు ఈ అవార్డును ఇప్పటికే పొందారు.

2026లో 'జైలర్ 2'!



రజినీకాంత్, నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబోలో వచ్చిన 'జైలర్' చిత్రానికి కొనసాగింపుగా జైలర్ 2 వస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలె ఈ చిత్ర షూటింగ్ కోసం చిత్రబృందం కేరళకు వెళ్లింది. ఈ సందర్భంగా అభిమానులతో మాట్లాడిన రజినీకాంత్ 2026 జూన్ తర్వాతే జైలర్ 2 విడుదల ఉంటుందని చెప్పినట్లు తెలుస్తోంది. మీడియా చిట్‌చాట్‌లో రజినీకాంత్ మాట్లాడుతూ.. 'జైలర్ 2ను 2026 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. షూటింగ్ చాలా అద్భుతంగా కొనసాగుతోంద'ని చెప్పారు. తాజా సమాచారం ప్రకారం ఈ ఏడాది డిసెంబర్ లేదా వచ్చే ఏడాది జనవరి కల్లా జైలర్ 2 ప్రొడక్షన్ పనులన్నీ పూర్తి కానున్నాయి. అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు కానున్నాయి. జైలర్ ఫస్ట్ పార్టులో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, తమన్నా కీలక పాత్రల్లో నటించారు. సీక్వెల్‌లో శివరాజ్‌కుమార్, మోహన్ లాల్ పాత్రలు రిపీట్ కానున్నారు. మిగిలిన పాత్రల వివరాలు తెలియాల్సివుంది. ఈ సీక్వెల్‌ను కూడా ఫస్ట్ పార్టును తెరకెక్కించిన సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు

ఫైనల్‌కు టీమిండియా

- అభిషేక్ అర్ధసెంచరీ
- బంగ్లాపై 41పరుగుల తేడాతో గెలుపు
- నేడు పాక్–బంగ్లా మధ్య కీలక పోరు
- గెలిచిన జట్టుకు ఫైనల్ బెర్త్

దుబాయ్: ఆసియాకప్ క్రికెట్ టోర్నీ ఫైనల్లోకి భారత జట్టు దూసుకెళ్లింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన టీమిండియా బుధవారం జరిగిన సూపర్–4 రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై 41 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 168పరుగులు చేయగా.. అనంతరం బంగ్లాదేశ్ జట్టు 19.3ఓవర్లలో 127పరుగులకు ఆలౌటైంది. బంగ్లా జట్టు ఓపెనర్ సైఫ్ హసన్(69) అర్ధసెంచరీకి తోడు ఎమేన్(21) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. టీమిండియా బౌలర్లు కుల్దీప్‌కు మూడు, వరుణ్ చక్రవర్తి, బుమ్రాకు రెండేసి, తిలక్ వర్మ, అక్షర్ పటేల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను ఓపెనర్ అభిషేక్ శర్మ ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. 25బంతుల్లోనే అర్ధసెంచరీ బాదిన అభిషేక్.. మొత్తమ్మీద 37బంతుల్లో 8ఫోర్లు, 5సిక్సర్లతో 75 పరుగులతో రాణించాడు. మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్(29) కూడా రాణించాడు. అభిషేక్–గిల్ కలిసి తొలివికెట్‌కు 6.2ఓవర్లలో 77పరుగులు జతచేశారు. ఆ తర్వాత గిల్ ఔటైనా.. అభిషేక్ తన ధనా ధన్ ఇన్నింగ్స్‌ను కొనసాగించాడు. అభిషేక్ శర్మ ఔటయ్యే సమయానికి భారతజట్టు 11.1ఓవర్లలో 112పరుగులు చేసింది. ఆ తర్వాత టీమిండియా స్కోర్‌బోర్డు నెమ్మదించింది. చివర్లో హార్దిక్ పాండ్యా(38; 29బంతుల్లో 4ఫోర్లు, సిక్సర్) రాణించాడు. దీంతో భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్లు నష్టపోయి 168 పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. శ్రీలంక బౌలర్లు రిషాద్ హొసైన్‌కు రెండు, సైఫుద్దీన్, ముస్తాఫిజుర్, తంజిమ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అభిషేక్ శర్మకు లభించింది.

నేడు బంగ్లాదేశ్, పాకిస్తాన్ జట్ల మధ్య కీలక పోరు జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు ఫైనల్ బెర్త్ దక్కనుంది. ఈ క్రమంలో ఇరుజట్ల మధ్య జరిగే గురువారం జరిగే మ్యాచ్‌పై అందరి దృష్టి నెలకొంది. 26న జరిగే చివరి, నామమాత్రపు లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు శ్రీలంకతో తలపడనుంది. ఆ జట్టు వరుసగా రెండో ఓటములతో టోర్నీనుంచి ఇప్పటికే నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా)...
భారత్ : 168/6(20 ఓవర్లలో)
అభిషేక్ శర్మ 75, హార్దిక్ 38, రిషాద్(2/27)
బంగ్లాదేశ్ : 127ఆలౌట్(19.3ఓవర్లలో
సైఫ్ హసన్ 69; కుల్దీప్(3/18), వరుణ్ (2/29)

ప్రణయ్‌కు గాయం

కొరియా ఓపెన్ నుంచి నిష్క్రమణ

సియోల్: కొరియా ఓపెన్ సూపర్–500లో భారత షట్లర్లకు నిరాశ తప్పలేదు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో హెచ్‌ఎస్ ప్రణయ్ గాయపడి టోర్నీనుంచి నిష్క్రమించగా... ఆయష్ శెట్టి, కిరణ్ జార్జి మెయిన్ డ్రా తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో హెచ్‌ఎస్ ప్రణయ్ 8–16తో ఇండోనేషియాకు చెందిన ఛికో అరా చేతిలో వెనుకబడి ఉన్న దశలో టోర్నీ నుంచి నిష్క్రమిం చాడు. అంతకుముందు 5–8పాయింట్లతో ఉన్న దశలోనూ గాయంతో ఇబ్బంది పడ్డ 33ఏళ్ల ప్రణయ్ చికిత్స తీసుకొని మళ్లీ ఆడినా ప్రయోజనం లేకపోయింది. ఇక ఆయుష్ శెట్టి 18–21, 18–21తో చైనీస్ తైపీకి చెందిన సూ–లీ–యంగ్ చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. ఈ మ్యాచ్ కేవలం 47నిమిషాల్లోనే ముగిసింది. ఇక కిరణ్ జార్జి 14–21, 22–20, 14–21తో మాజీ ప్రపంచ ఛాంపియన్ లో–కెన్–యూ(కొరియా) చేతిలో పోరాడి ఓడాడు. ఇక మహిళల సింగిల్స్‌లో 20ఏళ్ల అనుపమ ఉపాధ్యాయ 16–21, 15–21తో 8వ సీడ్ ఇండోనేషియాకు చెందిన వార్దాని చేతిలో పరాజయాన్ని చవిచూసింది. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో మోహిత్–లక్షిత జంట 7–21, 14–21తో జపాన్‌కు చెందిన యుచి షింగామి చేతిలో ఓటమిపాలయ్యారు.

తడబడ్డ బ్యాటర్లు

ఇండియా–ఎ 194ఆలౌట్

సాయి సుదర్శన్(75పరుగులు)

అహ్మదాబాద్: ఆస్ట్రేలియా–ఎతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్ట్‌లో ఇండియా–ఎ బ్యాటర్లు తడబడ్డారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా–ఎ 420 పరుగులకు ఆలౌట్ కాగా.. అనంతరం ఇండియా–ఎ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 194పరుగులకే ఆలౌటైంది. దీంతో ఆస్ట్రేలియా–ఎకు 226పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఓవర్‌నైట్ స్కోర్ 9వికెట్ల నష్టానికి 384పరుగులతో రెండోరోజైన బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా–ఎ చివరి వికెట్‌కు మరో 36పరుగులు జత చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా–ఎకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్ కెఎల్ రాహుల్ (11) స్వల్ప స్కోర్‌కే పెవీలియన్‌కు చేరాడు. ఆ తర్వాత జగదీశన్(38), సాయి సుదర్శన్ (75) కలిసి 100పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత ఇండియా–ఎ బ్యాటర్లు వరుసగా పెవీలియన్‌కు క్యూ కట్టారు. ఆయుశ్ బడోనీ(21), ప్రసిధ్ కృష్ణ(16) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్ చేశారు. దీంతో భారత ఇన్నింగ్స్ 52.5 ఓవర్లలో 194పరుగులకే పరిమితమైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియాను సిరాజ్–హర్‌ప్రీత్ బ్రార్ కట్టడి చేశారు. దీంతో ఆ జట్టు 16పరుగులకే 3వికెట్లు కోల్పోయింది. 242పరుగుల ఆధిక్యతలో నిలిచింది.

టాప్‌లోనే అభిషేక్

ఐసిసి టి20 ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్ : అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజాగా ప్రకటించిన టి20 ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. ఆసియా కప్ టోర్నీలో అదరగొడుతున్న భారత క్రికెటర్లు.. టి20 ర్యాంకింగ్స్ మూడు విభాగాల్లోనూ మనవాళ్లే టాప్‌లో నిలిచారు. టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ బ్యాటర్ల జాబితాలో అగ్రస్థానం నిలబెట్టుకున్నాడు. ఇక బౌలర్ల యూనిట్‌లో వరుణ్ చక్రవర్తి నంబర్ 1 స్థానంలో నిలవగా.. ఆల్‌రౌండర్లలో హార్దిక్ పాండ్యా ముందంజలో ఉన్నాడు. అభిషేక్ 907 రేటింగ్ పాయింట్స్‌తో మరోసారి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. 21న సూపర్ 4 మ్యాచ్‌లో పాక్ బౌలర్లను ఉతికేసిన ఈ డేంజరస్ ఓపెనర్ అర్థ శతకంతో జట్టు విజయంతో కీలకమయ్యాడు. అభిషేక్ విధ్వంసాన్ని కొనసాగించిన తిలక్ వర్మ ఒక స్థానం ఎగబాకి మూడో ర్యాంక్ సాధించాడు. ఇక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సైతం ఒక

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68